ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-7-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 155 పేజీలు: 12 వెల: 8.00

నా వార్తలే చదువుతా: యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ 9లో

ఇరాన్‌లో ఖమేనీ అంతిమయాత్ర ఆరంభం

# అమరావతిని ఎవరూ మార్చలేరు

## అరాచకాలు చేసేవారికి రాష్ట్రంలో చోటు లేదు..

## రౌడీయిజం చేసే వారిని నడిరోడ్డులో నిలబెడతా

## ప్రజా సంక్షేమం, శాంతి భద్రతలే ముఖ్యం

## కుప్పంలో బంగారు గనులు ప్రారంభిస్తాం

## బహిరంగ సభలో సిఎం చంద్రబాబు



శనివారం కుప్పం బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

**కుప్పం, జులై 4 ప్రభాతవార్త :** అమరావతి రాజధానికి మద్దతు పలికి ఆపై 2019లో అధికారంలో వచ్చాక మూడురాజధానులంటూ మూడుముక్కలాటలు ఆడారని, ప్రస్తుతం మావిగన్ అంటున్నారని ఎవరొచ్చినా రాజధాని అమరావతిని మార్చలేరని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మూడు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో 117కోట్లతో నూతన ఆర్టీసీ బస్‌స్టేషన్, డిపో నిర్మాణానికి శంకుస్థాపనచేశారు. అనంతరం కుప్పం బస్టాండులో ఏర్పాటుచేసిన బహిరంగసభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో అరాచకాలు చేసేవారికి చోటు లేదని, జనం ఓట్లేయరని వ్యాఖ్యానించారు. రౌడీలు, నేరాలు చేసేవారికి అవకాశం ఇవ్వాలా? అని ప్రశ్నించారు. జగన్ మావిగన్ అంటూ ఏంటి నీ పిచ్చిఆటలు అంటూ ప్రశ్నించారు. రాజధాని అమరావతికి పార్లమెంట్ ఉభయసభల్లో బిల్లు పాస్ అయిందని రాజ్యాంగం ఆమోదం కూడా పొందిందన్నారు. అమరావతి దేవతల, ప్రజా రాజధాని అన్నారు. ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్సీ నేతలు పోలీసులపై సైతం దాడులకు దిగుతున్నారన్నారు. తనకు శాంతిభద్రతలు, రాష్ట్రం, ప్రజాసంక్షేమం ఎంతో ముఖ్యం అన్నారు. సంఘ విద్రోహక శక్తులను వదలనని వారి పాలిట సింహస్వప్నంగా మారుతానని పేర్కొన్నారు. రౌడీయిజం చేసేవారిని నడిరోడ్డుపై నిలబెడతానన్నారు. గతంలో జగన్ కోడికత్తి, గులకరాయి డ్రామాలు సానుభూతికోసం చేశారని పేర్కొన్నారు. తనకు రౌడీయిజం తెలియదని హత్యలు చేయలేదని సిఎం పేర్కొన్నారు. చాలామంది తనను సౌమ్యుడు అంటారన్నారు. తాను 48 యేళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, ప్రస్తుతం రౌడీలు, నేరస్తులతో రాజకీయం చేయాల్సి వస్తోందన్నారు.

**తిరుమల పవిత్రతను కాపాడుతున్నాం**

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పవిత్రతను తాము కాపాడుతున్నామని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో కల్తీనెయ్యి, ప్రసాదాలు పంచి దేవుడ్ని సైతం అప్రతిష్ట పాలు చేశారన్నారు. తప్పులు చేసిన వారిపై చర్యలు >>2

# జూ॥ లాయర్ల స్టైపెండ్ 10 వేలకు పెంపు

## కర్నూలు హైకోర్టు బెంచి త్వరలోనే ఏర్పాటు: మంత్రి ఫరూక్

**విజయవాడ, జులై4, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. జూనియర్ న్యాయవాదులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.5,000 స్టైఫండ్‌ను రెట్టింపుచేస్తూ రూ.10,000కు పెంచుతున్నట్లు మంత్రి ఫరూక్ ప్రకటించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే జారీ చేస్తామని వెల్లడించారు. రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తామని, దీనికి సంబంధించి అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. తన రెండేళ్ల పాలన పురోగతిని వివరిస్తూ ఆయన ఈ ప్రకటన చేశారు. బెంచ్ ఏర్పాటుకోసం కర్నూలులో ఇప్పటికే స్థలాన్ని కేటాయించామని, ప్రస్తుతం హైకోర్టుతో సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వానికికూడా దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పంపామని, అన్ని అనుమతులు పొంది, త్వరలోనే బెంచ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడిఉందని ఆయన హామీ ఇచ్చారు న్యాయవ్యవస్థ బలోపేతం కోసం >>2

# ‘వైట్ గట్’పై అప్రమత్తం

## ప్రభావిత రొయ్యల చెరువులనుంచి నమూనాల సేకరణ

## నాణ్యమైన సీడ్, ఫీడ్ మాత్రమే ఉపయోగించాలి

## రైతులకు నష్టం రానివ్వం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, జులై 4 ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ఆక్వా రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇటీవల రాష్ట్రంలోని పలు ఆక్వా ప్రాంతాల్లో రొయ్యలలో “వైట్ గట్“ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయనే సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం అప్రమత్తమై, యుద్ధ ప్రాతిపదికన చర్యలు ప్రారంభించిందన్నారు. పశ్చిమ గోదావరిజిల్లా ఉండి మండలం మహదేవిపట్నంలో రైతు పి. మనోజ్ వర్మ చెరువును మత్స్యశాఖ అధికారులు పరిశీలించి, నీరు, రొయ్యలు, ఫీడ్, మల నమూనాలను సేకరించి పరీక్షల కోసం కైకలూరు ప్రయోగశాలకు పంపారని, నీటినాణ్యత పరీక్షలను భీమవరం ల్యాబ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే విధంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు.

జిల్లా జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లులు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లుగా పనిచేసి ప్రతి ఆక్వా ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని నమోదిత, నమోదుకాని హేచరీలు, ప్రైవేట్ ఆక్వా ల్యాబ్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, నాణ్యతలేని విత్తనం, నాసిరకం ఫీడ్ విక్రయాలు, తప్పుడు ల్యాబ్ నివేదికలు, నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. తప్పు చేసిన వారిపై చట్టపరంగా, శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు “1+1“ వంటి ఆకర్షణీయ ఆఫర్ల పేరుతో నాణ్యత లేని రొయ్య పిల్లలను కొనుగోలు చేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. తప్పనిసరిగా ధృవీకరించిన హేచరీల నుంచే నాణ్యమైన విత్తనాన్ని కొనుగోలు చేయాలని, చెరువు సామర్థ్యానికి అనుగుణంగా మాత్రమే పిల్లలను వదలాలని సూచించారు. కొనుగోలు చేసిన విత్తనం వివరాలను నమోదు చేసి భద్రపరచుకోవాలని చెప్పారు. చెరువుల నిర్వహణలో బయోసెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. ప్రతి పంట అనంతరం చెరువును పూర్తిగా ఎండబెట్టడం, సిల్ట్ తొలగించడం, సున్నం వేయడం, క్రిమి సంహారక చర్యలు చేపట్టడం ద్వారా

వ్యాధికారకాలను పూర్తిగా నిర్మూలించాలని తెలిపారు. సిఐబిఎ సూచించిన ఉత్తమ నిర్వహణ పద్ధతులను తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ అంశంపై స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ, ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ, నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనిటిక్ రిసోర్సెస్ వంటి జాతీయ, రాష్ట్ర స్థాయి సంస్థలతో సమన్వయం చేసి శాస్త్రీయ పర్యవేక్షణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నవీకరించిన ఎస్ఒపిలను రూపొందించి, ఫిషరీస్ యూనివర్సిటీ విద్యార్థుల ద్వారా గ్రామ స్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా >>2

# కొన్ని చోట్ల పిడుగుల వానలు

## మరో మూడు రోజులు భారీ వర్షాలు

**విజయవాడ,జులై4, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో వాతావరణ పరిస్థితుల్లో ఆకస్మిక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. బంగాళాఖాతం వాయువ్య ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోంది. భారీ వర్షాలకు కారణమౌతోంది. దీనివల్ల పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు వచ్చే మూడు రోజుల్లో కొన్ని గంటల్లో అకస్మాత్తుగా ఉరుములు, పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. బలమైన ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. తాజాగా వాతావరణ అంచనాల ప్రకారం.. శనివారం అల్పపీడనం ప్రభావంతో అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల భారీ వర్షాలు, మిగతా చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీటితో పాటు ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓమోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. బాపట్ల, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిస్తాయి. అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై, తేలికపాటి జల్లులు పడొచ్చు. అకస్మాత్తుగా వర్షం కురిసేటప్పుడు పిడుగుల ముప్పు పొంచి ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

# కొడుకు బూడిద ఇప్పించండి

## లేదంటే నడిరోడ్డుపై పెట్రోలు పోసుకొని చనిపోతా: మేజిస్టీరియల్ విచారణలో సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి హెచ్చరిక

**విజయవాడ,జులై 4,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ కేసుకు సంబంధించి మెజిస్టీరియల్ విచారణ కొనసాగుతోంది. నూతన భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)చట్ట నిబంధనలకు లోబడి, మానవహక్కుల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ విచారణ జరపాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో విచారణ కొనసాగుతోంది. విజయవాడ కృష్ణలంకకు చెందిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కృష్ణలంక సిఐ నాగరాజు, మరికొందరు కలిసి సాయికృష్ణను చిత్రహింసలు గురిచేసి చంపేశారని మృతుడి తల్లి విజయలక్ష్మి ఆరోపించింది. దీనిపై ప్రభుత్వం వెంటనేస్పందించి సిఐ నాగరాజు సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఈ కేసు త్వరితగతిన పూర్తిచేసేందుకు సిట్‌ను ఏర్పాటు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన సిట్ సిఐ నాగరాజును అరెస్ట్ చేసింది. దీంతో పాటు అతడికి సహకరించిన కానిస్టేబుల్స్ అశోక్, నానితో పాటు కృష్ణలంక క్రైమ్ కానిస్టేబుళ్లు బాబురావు, సాంబయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించింది. ఈ క్రమంలో బిఎన్ఎస్ పరిధిలో జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా జరుగుతున్న మేజిస్టిరియల్ విచారణకు సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, కుటుంబసభ్యులు వాంగ్మూలం ఇచ్చేందుకు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా తన అభిప్రాయాలను, అనుమానాలను సబ్ కలెక్టర్ ఎదుట సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి వినిపించారు. పోలీసులే తన బిడ్డను పొట్టన పెట్టుకున్నారని చెప్పారు.

సాయికృష్ణ గురించి అడిగితే ఫొటోకు దండ వేసుకోమన్నారని ఆమె వాంగ్మూలంఇచ్చారు. అనంతరం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. తన కుమారుడు బూడిద ఎక్కడుందో ఇప్పించాలని అధికారులను విజయలక్ష్మి వేడుకున్నారు. లేదంటే నడిరోడ్డుపై పెట్రోల్ పోసుకుని చనిపోతానని హెచ్చరించారు. తన కుమారుడిని సిఐ నాగరాజు అతి దారుణంగా చంపాడని పేర్కొన్నారు కాళ్లపై మేకులు కొట్టి హింసించి చంపాడని ఆరోపించారు. ఈ కేసులో కొందరిని అరెస్ట్ చేశారని, మిగతా వారి సంగతి ఏంటని ప్రశ్నించారు. సబ్ కలెక్టర్ ఎదుట వివరాలు చెప్పానని, మెజిస్టీరియల్ విచారణకు మళ్లీ పిలుస్తామని వారు చెప్పారని తెలిపారు. కృష్ణలంక

పోలీస్ స్టేషన్‌పై ఉన్నాయంటున్న బూడిద, ఎముకలు తన కుమారుడువేనని ఏమిటి నమ్మకమని, ఇలాంటివి వారు ఎన్నో చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

**సిట్‌కు కీలకాధారాలు**

గాదె సాయికృష్ణ కస్టోడియల్ మృతి కేసులో సిట్‌కు కీలకాధారాలు లభించాయి, విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్ టెర్రస్‌పై ఎముకలు, కాలిన బూడిదను పోలీసులు గుర్తించారు. ఇవి సాయికృష్ణకు సంబంధించినవిగా సిట్ అధికారులు భావిస్తున్నారు. ఫోరెన్సిక్ పరీక్షలకోసం డిఎన్ఎ శాంపిల్స్ సేకరిస్తున్నారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ టెర్రస్‌పై ఎముకలు, >>2

## మంత్రి లోకేష్ నేటి నుంచి

# ద.కొరియా పర్యటన

## పెట్టుబడులపై చర్చలు

## 11దాకా అక్కడే

**విజయవాడ, జులై4, ప్రభాతవార్త ప్రతినిధి:** భారత్ – దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేసేందుకు తమ దేశంలో పర్యటించాల్సిందిగా రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా) ఎపి విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానించింది. దక్షిణ కొరియా ఆహ్వానం మేరకు ఈనెల 5 నుంచి 11వతేదీ వరకు ఆరురోజులపాటు మంత్రి లోకేష్ ఆ దేశంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో మంత్రి లోకేష్ కొరియాలో వివిధ మంత్రిత్వశాఖల ప్రతినిధులతో అధికారిక సమావేశాల్లో పాల్గొంటారు. ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ అధికారిక సమావేశాలను నిర్వహిస్తున్నామని దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ (చెన్నయ్) చాంగ్ న్యాన్ కిమ్ మంత్రి లోకేష్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇరుదేశాల నడుమ మరింత సహకారం, సంబంధాల బలోపేతం ఈ పర్యటన కీలక అడుగు కాగలదని భావిస్తున్నట్లు కిమ్ తెలిపారు. ఈనెల 5వతేదీన దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఇండియా డయాస్పోరా ఆత్మీయ సమావేశానికి హాజరై అక్కడి భారతీయులు, తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. 6వతేదీన దక్షిణ కొరియా టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంతోపాటు వివిధ సంస్థలతో పెట్టుబడి చర్చల్లో పాల్గొంటారు. అనంతరం హ్యోసంగ్ భారీపరిశ్రమ సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమికండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యాంగ్ లీతో సమావేశమవుతారు. 7వతేదీన ఎల్జీ కెమ్ గ్లోబల్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్, ఎల్జీ ఓవర్ సీస్ కంపెనీస్ హెడ్ యున్ జు కోహ్ ఎల్జీ టవర్స్‌లో ఏర్పాటుచేసిన విందు సమావేశంలో పాల్గొంటారు. ఎల్జీ అనుబంధ సంస్థలకు చెందిన ఉన్నత >>2

यमुना जल परियोजना
50 हजार से अधिक युव
दिनांक: 4 जुलाई

శనివారం జోధ్‌పూర్‌లో కొత్త విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

# ‘ఉడాన్’ పథకానికి రూ. 28,840 కోట్లు

## కొత్తగా 100 ఏరోడ్రోమ్‌లు, 200 హెలిప్యాడ్‌ల అభివృద్ధి

## -రాజస్థాన్‌లో ప్రధాని మోడీ

**జోద్‌పూర్,జులై 4:** రాజస్థాన్ అభివృద్ధికి కొత్త ప్రాజెక్టులు మరింత వేగాన్ని అందిస్తాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. శనివారం రాష్ట్రంలోని పచ్‌ప్రద ఆయిల్ రిఫైనరీతోపాటు జోద్‌పూర్‌లో కొత్తగా సుమారు రూ.480 కోట్ల వ్యయంతో నిర్మించిన విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రధాని ప్రారంభించారు. 23 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనం ద్వారా ఏడాదికి 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించవచ్చు. రాజస్థాన్ సంప్రదాయ కళాకృతులు, ఆధునిక సదుపాయాల మేళవింపుగా టెర్మినల్‌ను తీర్చిదిద్దారు. దీనివల్ల మార్వార్ ప్రాంతంలో పర్యటకం,వాణిజ్యం, ఉపాధికి కొత్త అవకాశాలు లభిస్తా >>2

# 20 నుంచి వర్షాకాల పార్లమెంటు

## కీలక బిల్లుల ఆమోదం కోసం ఎన్డీయె కసరత్తు

## ఆగస్టు 13 దాకా కొనసాగనున్న సమావేశాలు: కేంద్రమంత్రి రిజిజు

**న్యూఢిల్లీ,జులై 4:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20 నుంచి ఆగస్టు 13 వరకు నిర్వహించనున్నారు. మొత్తం 25 రోజుల వ్యవధిలో 19 రోజులపాటు సభా కార్యకలాపాలు కొనసాగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పార్లమెంట్ ఉభయసభల సమావేశాలకు ఆమోదం తెలిపారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారం ఆ విషయాన్ని వెల్లడించారు. వర్షాకాల సమావేశాల తేదీలను కిరణ్ రిజిజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు >>2

# గోదావరి పుష్కరాలు తొలిదశ పనులకు 580 కోట్లు

## - మంత్రి నారాయణ వెల్లడి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జులై 4,ప్రభాతవార్త:** గోదావరి మహా పుష్కరాలు-2027ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో తొలి దశ అభివృద్ధి పనుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా రూ.580 కోట్ల నిధులను వివిధ పథకాల ద్వారా విడుదల చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పి. నారాయణ తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్‌లో గోదావరి మహా పుష్కరాల నిర్వహణ, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నగర మౌలిక సదుపాయాలపై ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి. సంపత్ కుమార్, కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘాస్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్‌లతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ గోదావరి మహాపుష్కరాలు ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వివిధ శాఖల పనుల పురోగతిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించామన్నారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధం, పుష్కరఘాట్లు తదితర మౌలిక సదుపాయా >>2

శనివారం కుప్పం ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

## పంజాబ్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్
# గోల్డీథిల్లాన్ స్పెయిన్‌లో అరెస్టు

**న్యూఢిల్లీ,జులై 4:** పంజాబ్ పోలీసుల యాంటీ గ్యాంగ్‌స్టర్ టాస్క్ ఫోర్స్, కేంద్ర నిఘా సంస్థలు, చండీగఢ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ ఆపరేషన్ ఫలితంగా స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో గోల్డీ ధిల్లాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కొంతకాలంగా అతడి కదలికలపై నిఘా పెట్టిన అధికారులు చివరకు అరెస్ట్ చేయడంలో విజయం సాధించారు. అతడిని భారత్‌కు తీసుకురావడానికి నేరస్తుల అప్పగింత ప్రక్రియను భారత అధికారులు ప్రారంభించారు.గోల్డీ ధిల్లాన్‌పై చండీగఢ్ సెక్టర్11లోని కుమార్ మెడికల్ హాల్ క్యాషియర్ జనకీ దాస్‌ను జూన్ 13న జరిగిన కాల్పుల్లో హత్య చేసిన కేసు నమోదైంది. ఈ ఘటన నగరంలో తీవ్ర కలకలం రేపింది. అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే నీనా మిత్తల్‌కు బెదిరింపులు చేసిన కేసుతో పాటు కెనడాలో జరిగిన పలు కాల్పుల ఘటనల్లోనూ అతడి ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి.గోల్డీ రాజ్‌పురా పేరుతో కూడా గుర్తింపు పొందిన ధిల్లాన్, కెనడాలో ఉన్న ఉగ్రవాదిగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ప్రకటించిన గోల్డీ బ్రార్‌కు సన్నిహిత సహచరుడిగా పోలీసులు తెలిపారు. అయితే గోల్డీ బ్రార్, గోల్డీ ధిల్లాన్ ఇద్దరూ వేర్వేరు వ్యక్తులని అధికారులు స్పష్టం చేశారు. చండీగఢ్‌లోని ఓ వ్యాపారిపై జరిగిన ఎక్స్‌టార్షన్, కాల్పుల కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో ఇద్దరి పేర్లూ ఉన్నాయి. 2022లో విదేశాలకు పారిపోయిన ధిల్లాన్, అక్కడి నుంచే పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో తన నేర ముఠాను నిర్వహించినట్లు విచారణలో తేలింది. వసూళ్లు, లక్ష్యహత్యలు, ప్రత్యర్థులపై దాడులు, అక్రమ ఆయుధాలు, మాదకద్రవ్యాల వ్యాపారాన్ని నియంత్రించేందుకు కుట్రలు పన్నినట్లు పోలీసులు తెలిపారు. జాంగీ, సిగ్నల్ వంటి ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ల ద్వారా తన అనుచరు లకు ఆదేశాలు జారీచేస్తూ పోలీసులకుచిక్కకుండా కార్యకలాపాలు

# అమరావతిని ఎవరూ మార్చలేరు

>> చేపట్టామని ప్రస్తుతం భక్తుల మనోభావాలను గౌరవిస్తున్నామన్నారు. ప్రస్తుతం టిటిడి ప్రసాదాలకు డిమాండ్ పెరిగిందన్నారు. సమాజంలో అన్ని మతాలను గౌరవించాలని దాడులు తగవని పేర్కొన్నారు.

**కుప్పంలో బంగారు గనులు ప్రారంభిస్తాం**

కుప్పం సమీపం చిగురుగుంటలో ఉన్న బంగారు గనులను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు చేపడతామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. అలాగే రాష్ట్రంలో ఉన్న రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భూవివాదాలు లేని వ్యవస్థకు శ్రీకారం చుడతామన్నారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యుఆర్ కోడ్‌లతో రైతుల భూరికార్డులు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వంలో రైతుల పాస్ పుస్తకాలపై ఫోటోలు ముద్రిస్తే తమ ప్రభుత్వం రైతులకు రాజముద్రతో పాస్ పుస్తకాలు అందిస్తోందన్నారు. ఈనెలలోనే తల్లికివందనం పథకం అమలు చేస్తామన్నారు.

**ప్రకృతిసేద్యం శ్రీరామరక్ష**

రాష్ట్రానికి ప్రకృతి సేద్యం శ్రీరామరక్ష అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. 20 లక్షలమంది రైతులు ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ప్రజలు కూడా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. వాతావరణ ంలో మార్పులు సైతం సంభవిస్తున్నాయని గతేడాది వర్షాలు బాగా కురిసి 65శాతం రిజర్వాయర్లకు నీరు చేరిందన్నారు. ఈ యేడాది వర్షాలు లేక ఆల్మట్టి డ్యామ్, కృష్ణా, గోదావరి నదులకు నీరు రాలేదన్నారు. పర్యావరణాన్ని కాపాడితేనే వర్షాలు పడతాయన్నారు. ఇరాన్- అమెరికా యుద్ధంతో పెట్రోల్, డీజిల్, నిత్యాసరాల ధరలు పెరిగాయన్నారు. అంతకుముందు కుప్పం ఏరియా ఆస్పత్రిలో సిఎం చంద్రబాబు 1.70కోట్లతో ఏర్పాటుచేసిన సిటిస్కాన్ సెంటర్‌ను ప్రారంభించారు. కుప్పం టిడిపి కార్యాలయంలో జననాయకుడు సిస్టమ్‌ను పరిశీలించారు. అనంతరం కంగుంది గ్రామంలో 355 మంది రైతులకు 460 ఎకరాల భూపట్టాలను సిఎం చంద్రబాబు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం , టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్‌రెడ్డి, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కుప్పం మండల అధ్యక్షుడు రాజగోపాల్ పాల్గొన్నారు.

# కొడుకు బూడిద ఇప్పించండి

>> బూడిద, అనుమానాస్పద మరకలున్న లాఠీ, పాక్షింగా కాలిన ఇనుప హ్యాండ్ గొలుసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు కస్టడీలో పోలీసుల దాడి వల్లే సాయికృష్ణ మరణించాడని సిట్ ఇప్పటికే నిందితుల రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. ఈ కేసులో సస్పెండైన సిఐ నాగరాజును కస్టడీకి తీసుకుని మృతదేహాన్ని తరలించిన వివరాలపై విచారణ జరుపుతున్నారు. తన కుమారుడి మృతదేహం లేదా కనీసం అస్థికలు, బూడిదైనా తనకు ఇవ్వాలని సాయికృష్ణతల్లి విజయలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విజయవాడ లోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మెజిస్టీరియల్ విచారణకు హాజరైన సందర్భంలోను ఆమె తన వాంగ్మూలాన్ని సమర్పించారు,ఈ కేసులో మరి కొందరు నిందితులన్నట్లు ఆమె ఆరోపిస్తున్నారు.అయితే సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో సిట్ లాకప్ సిసి ఫుటేజీ ధ్వంసం చేసారని అభియోగిస్తుంది.కేసుకు కీలకాధారాలైన మరి కొన్ని సిసి కేమెరాల ఫుటేజీని సిట్ సేకరించిందంటున్నారు. కృష్ణలంక స్టేషన్‌కు సమీపంలోని వీధుల్లోని సిసి కేమోరా ఫుటేజీ,స్మశానికి వెళ్లే దారిలోని ఫుటేజీని సిట్ సేకరించినట్లు సమాచారం.

## ఓటర్ల జాబితా సమగ్ర పునశ్చరణకు
# పౌరులంతా సహకరించాలి
## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వర రావు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై4, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ఓటర్లందరితో కూడిన సమగ్ర జాబితా రూపకల్పనకు పౌరులందరూ స్వచ్ఛందంగా ప్రభుత్వానికి సహకరించి తమ వివరాలను అందజేయాలని ప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ 'విద్యార్థుల నైతిక విలువల' సలహాదారు చాగంటి కోటేశ్వర రావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన గృహాన్ని సందర్శించిన బూత్ స్థాయి అధికారికి వివరాలు నింపిన తమ కుటుంబ సభ్యుల సర్ ఎన్ రోల్ మెంట్ ఫారాలను అందజేసారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 15వ తేదీన ప్రారంభమైన ఈ ఓటర్ల జాబితాల సమగ్ర పునశ్చరణ మరియు నూతన నమోదు ప్రక్రియ ఈ నెల 14వ తారీకు వరకు కొనసాగుతుందని పౌరులందరూ తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలన్నింటినీ ఎలాంటి దాపరికం లేకుండా స్పష్టంగా అందజేయాలని కోరారు. దీనివల్ల అర్హులైన ఓటర్లను గుర్తించి, పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం అధికారులకు తేలికవుతుందని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా పక్కాగా ఉన్నప్పుడే, రేపటి రోజున ఒక మంచి ప్రభుత్వాన్ని, సరైన ప్రజాప్రతినిధులను ఎంచుకునే అవకాశం ప్రజలకు లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఒక ప్రధానమైన కర్తవ్యంగా భావించి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని చాగంటి కోటేశ్వరరావు కోరారు. అధికారులు అందజేసిన ఎన్రోల్మెంట్ పత్రాలను సత్వరం పూర్తి చేసి తిరిగి ఇవ్వాలని, రేపు, ఎల్లుండి అని నిరక్ష్యం చేస్తూ అధికారులను చుట్టూ తిప్పించకుండా వెంటనే ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

పౌరులు త్వరితగతిన స్పందించి సహకరిస్తేనే, ఎన్నికల సంఘం మరియు అధికారులు ఈ కార్యక్రమాన్ని అనుకున్న సమయానికి విజయవంతంగా పూర్తి చేయగలుగు తారని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగానే తాను కూడా ఈ రోజు తన కుటుంబ వివరాలన్నింటినీ పత్రంలో నమోదు చేసి అధికారులకు అందజేసినట్లు తెలియజేశారు.

దేశ భవిష్యత్తును నిర్ణయించే ఈ ప్రక్రియలో పౌరులందరూ తమ వంతు బాధ్యతగా ఎన్నికల సంఘానికి, ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# తొలిదశ పనులకు 580 కోట్లు

>> లను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం తొలి దశలో రూ.580 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.150. కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు..సమీక్ష సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా నగరంలో అమలవుతున్న అభివృద్ధి పనులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సి న ప్రాధాన్య పనులపై తమ సూచనలు తెలియజేయగా, అన్ని శాఖలు సమన్వయంతో నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి డా పి నారాయణ మాట్లాడుతూ, పుష్కరాలకు ముందుగానే సమగ్ర ప్రణాళికతో నగరంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్, యాన్యుటీ మోడల్ తదితర పథకాల ద్వారా తొలి దశలో రూ.580 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు, అందులో రాష్ట్ర ప్రభుత్వం 150 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. జూలై 11 వ తేదీన మరోసారి జిల్లా పర్యటన కు రానున్నట్లు వెల్లడించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రాధాన్యతా పనులను గుర్తిస్తే ఈ నెల 11న పరిపాలనా అనుమతులు (సాంక్షన్లు) మంజూరు చేస్తామని తెలిపారు.గోదావరి నది కాలుష్య నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, నగరంలో రూ.140 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా నదీ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని మంత్రి పేర్కొన్నారు. అలాగే ఇరిగేషన్, దేవాదాయ, ఆర్ అండ్ బి శాఖలు పుష్కర పనులను వేగవంతం చేస్తున్నాయని తెలిపారు.ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ గోదావరి పుష్కరాలకు అవసరమైన నిధుల సమీకరణలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.

# వర్షాకాల పార్లమెంటు

>> మేరకు 2026 పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిర్వహణకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారని ఈనెల20న ప్రారంభమయ్యే సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగుతాయని తెలిపారు. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, సంభాషణలు, నిర్ణయాలకు ఈ సమావేశాలు వేదికగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి పార్లమెంట్ సమావేశాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఉభయసభలు సమావేశం కానున్నాయి. బెంగాల్, అసోం,పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో అధికార భారతీయ జనతా పార్టీ విజయాలు సాధించిన నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలపై ఆసక్తి నెలకొంది. మారిన రాజకీయ సమీకరణాల ప్రభావం ఉభయసభల కార్యకలాపాలపై కనిపించే అవకాశం ఉంది.

తృణమూల్ కాంగ్రెస్, శివసేన పార్టీల్లో చోటుచేసుకున్న పరిణామాలు సైతం వర్షాకాల సమావేశాల్లో చర్చనీయాంశంగా మారనున్నాయి. తమను ప్రత్యేక గ్రూపులుగా గుర్తించాలని కోరుతూ 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఆరుగురు శివసేన (యూబిటి) ఎంపీలు చేసిన విజ్ఞప్తులపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీంతో స్పీకర్ తీసుకునే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు రాజ్యసభలోనూ రాజకీయ సమీకరణాలు మారాయి. కొత్తగా ఎన్నికైన, తిరిగి ఎన్నికైన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అధికార ఎన్డీయేకు సంఖ్యాబలం మరింత అనుకూలంగా మారింది. రాజ్యసభకు చెందిన ముగ్గురు తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీలు రాజీనామా చేయడంతో ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటి ఫలితాలతో ఎగువసభలో బిజెపి మరింత బలం పెంచుకునే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

ఈసారి వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ బిల్లును పరిశీలిస్తున్న జెపిసి జూలై 17న సమావేశమై తన నివేదికను ఆమోదించే అవకాశం ఉంది. ఆ తర్వాత నివేదికను పార్లమెంట్ పరిశీలనకు సమర్పించనున్నారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రులు అరెస్టై వరుసగా 30 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారిని పదవి నుంచి స్వయంచాలకంగా తొలగించాలనే ప్రతిపాదన ఈ బిల్లులో ఉన్నట్లు సమాచారం. ఈ నిబంధనపై ఇప్పటికే తీవ్ర రాజకీయ చర్చ జరుగుతోంది. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను ఒకే విధంగా 50 శాతం పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ప్రతిపాదనపై దక్షిణాది రాష్ట్రాల రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ అంశం కీలకంగా మారింది. మరోవైపు ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీసేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత సైనికుల ప్రాణనష్టానికి సంబంధించిన అంశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభను తప్పుదోవ పట్టించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ వ్యవహారంలో ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన చర్యలు చేపట్టాలనే డిమాండ్‌ను వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షం ప్రస్తావించే అవకాశం ఉంది.

# 'వైట్ గట్'పై అప్రమత్తం

>> మత్స్యశాఖ అధికారులు యేడు రోజుల్లోగా తనిఖీలు, నమూనాల సేకరణ, తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించామని మంత్రి తెలిపారు. రైతులకు అవగాహన కల్పించడంలో లేదా ఆదే శాలఅమలులో నిర్లక్ష్యం వహించిన అధికారులపైకూడా క్రమశిక్షణా చర్యలు తప్పవని స్పష్టంచేశారు. రొయ్యల రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అవసర మైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

## వారం - వర్జ్యం

05-07-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
పంచమి మ.1.27
శతభిష మ.3.09
వర్జ్యం : రా.9.47-రా.11.27
దు.సా.సా.4.55-సా.5.47
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ప్రముఖులతో చర్చలు సాగిస్తారు. ఇంటిలో శుభకార్యాలు. నూతన ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. ఋణాలు తీరుస్తారు.

**వృషభం:** కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. కారణం లేని చికాకు మీకు కొంత ఇబ్బంది కలిగిస్తుంది.

**మిథునం:**ఆర్థిక విషయములలో నిజముగా సహాయపడే వారెవరో మీరు గ్రహించగలుగుతారు.ఇంటర్వ్యూలకు హాజరవుతారు.

**కర్కాటకం:**జీవిత భాగస్వామితో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించడం చెప్పదగినది. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:**దూరప్రాంతాలలోని ఆత్మీయుల క్షేమసమాచారం ఆనందం కలిగిస్తుంది. సంబంధ బాంధవ్యాలు పెరుగుతాయి.

**కన్య :** ఓర్పుతో, నేర్పుతో అందరితో కలిసి పనిచేసే ధోరణి వలన విజయాలాదిశగా వయనిస్తారు.బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**తుల :**నూతన ప్రయత్నాలలో పురోగతిని సాధిస్తారు. ప్రముఖులను కలుసుకొని కీలక సమాచారం తెలుసుకుంటారు.

**వృశ్చికం:** తనఖా వస్తువులను విడిపించుకుంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. ఇంటర్వ్యూలకు హాజరవుతారు.

**ధనుస్సు:** మాటల చాతుర్యంతో ఎంతటి వారినైనా ఆకట్టుకుంటారు. సన్నిహితుల సహాయంతో ముందుకు సాగుతారు.

**మకరం:** కొత్త పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. నిర్వహిస్తున్న సంస్థలు అభివృద్ధి పథంలో నడుస్తాయి.

**కుంభం:** కోర్టుకేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.స్పెక్యులేషన్ మధ్యస్థంగా వుంటుంది.

**మీనం:** రాజకీయ అధికార ప్రాప్తి పొందుతారు. నిందారోపణలు రానివ్వకుండా చాకచక్యంగా వ్యవహరిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

శనివారం పాపికొండల విహార యాత్ర అధికారికంగా ప్రారంభం కావడంతో లాంచీలు బయలుదేరిన దృశ్యం

# మన్యానికి మళ్లీ పర్యాటక సందడి
## రెండు వైపులనుండి ప్రారంభమైన పాపికొండల విహార యాత్ర

**చింతూరు, జులై 4, ప్రభాతవార్త:** మన్యానికి మళ్లీ పర్యాటకుల సందడి మొదలైంది. గత 20 రోజులుగా వివిధ కారణాలతో నిలిచిపోయిన పాపికొండల విహార యాత్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేయటంతో శనివారం అధికారికంగా పునః ప్రారంభం అయింది. పోలవరం జిల్లా వరరామచంద్రపురం మండలం పోచవరం మరియు దేవిపట్నం మండలం గండి పోచమ్మ గుడి వద్ద నుండి శనివారం ఉదయం అధికారికంగా విహార యాత్ర లాంచీలు ప్రారంభం అయ్యాయి. గత 20 రోజులుగా లాంచీలు నిలిచిపోవటంతో పర్యాటకుల సందడి లేక మన్యం ప్రాంతాలు వెలవెలబోయాయి.శనివారం పర్యాటకులు కాస్త పలుచగా ఉన్న గోదావరి నదిలో పాపికొండల విహార యాత్ర మొదలైంది అన్న వార్త పత్రికల్లో, సామజిక మధ్యమాల్లో ప్రచారం కావటంతో బుకింగులు మొదలైనాయి. 20 రోజులుగా వెలవెల బోయిన ప్రాంతాల్లో మళ్లీ పర్యాటకులు సందడి చేయనున్నారు.అధికారులు, పోలీసులు, ఇరిగేషన్ అధికారులు వారి వారి పరిధిలో అవసరమైన అనుమతి పత్రాలు, లాంచిల ఫిట్నెస్, పర్యాటకుల రక్షణ చర్యలను పరిశీలించి అన్ని సరిగా ఉంటెనే అనుమతులు మంజూరు చేశారు. పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

# 'ఉడాన్' పథకానికి రూ. 28,840 కోట్లు

>> యని ప్రధాని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ వాయు మార్గాల అనుసంధానాన్ని మరింత మెరుగుపరిచేందుకు సవరించిన ఉడాన్ పథకాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. రాబోయే పదేళ్ల కోసం ఈ పథకం కింద రూ.28,840 కోట్లను కేటాయించారు. కొత్తగా 100 ఎయిరోడ్రోమ్‌లు, 200 హెలిప్యాడ్‌లను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజస్థాన్ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన సుమారు 54 వేల మందికి నియామక పత్రాలు అందించినట్లు ప్రధాని తెలిపారు. వారికి అభినందనలు తెలియజేశారు. స్వావలంబనతోనే స్వాభిమానాన్ని నిలబెట్టుకోవచ్చని, కొత్త ప్రాజెక్టులతో రాజస్థాన్‌తో పాటు దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. పచ్‌పద్రలో ప్రారంభించిన గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీకమ్‌పెట్రోకెమికల్ కాంప్లెక్స్ దేశ ఇంధన రంగంలో చారిత్రక మైలురాయి అని ప్రధాని అభివర్ణించారు. రాజస్థాన్‌లో ఏర్పాటు చేసిన తొలి రిఫైనరీ కూడా ఇదేనని తెలిపారు. ఈ ప్రాజెక్టు పశ్చిమ రాజస్థాన్ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను మార్చివేస్తుందని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు రాజస్థాన్ స్వావలంబన సాధించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వాలు కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యేవని ప్రధాని విమర్శించారు. శిలాఫలకాలు వేసిన తర్వాత ప్రాజెక్టులను యేళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచేవారని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వాల పనితీరు అందుకు పూర్తి భిన్నంగా ఉంటుందని చెప్పారు. ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో బాధ్యత ముగిసిందని భావించకుండా వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తామని తెలిపారు. ఇటీవల రిఫైనరీ ప్రాజెక్టు ప్రాంతంలో జరిగిన ప్రమాదాన్ని ప్రస్తావించిన ప్రధాని, ఆ తర్వాత మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసిన కార్మికులు, అధికారులను అభినందించారు. ఎంత పెద్దసవాలు ఎదురైనా నవభారత్ తన సంకల్పం నుంచి వెనక్కి తగ్గదని వారు నిరూపించారని ప్రశంసించారు. పచ్‌పద్ర కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పెట్రోకెమి కల్స్, పట్టణ రవాణా, రైల్వేలు, జాతీయ రహదారులు, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ పంపిణీ తదితర రంగాలకు ఈ ప్రాజెక్టులు సంబంధించినవి. వీటిలో రూ.13 వేల కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న జైపూర్ మెట్రో రైలు ప్రాజెక్టు

# జూ॥ లాయర్ల స్టైపెండ్ 10 వేలకు పెంపు

>> ప్రభుత్వం తీసుకుంటున్న ఇతర చర్యలను కూడా ఆయన వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 96 కోర్టులను ఏర్పాటు చేయడంతో పాటు న్యాయవ్యవస్థలో 1770 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కోర్టు భవనాలు, న్యాయమూర్తుల నివాస గృహాలు, అతిథి గృహాల నిర్మాణం, అభివృద్ధి కోసం రూ.216 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.ఇతర కీలక నిర్ణయాలలో భాగంగా, లా ఆఫీసర్ల పదవీ విరమణ వయస్సును 61 ఏళ్లకు పెంచామని, హైకోర్టు జడ్జిల గ్రాట్యుటీ పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచామని గుర్తు చేశారు. హైకోర్టులోని ఏజీపీల గౌరవ వేతనాన్ని 25 శాతం పెంచగా, స్పెషల్ జ్యుడిషియరీ మేజిస్ట్రేట్‌ల గౌరవ వేతనాన్ని రూ.30,000 నుంచి రూ.45,000కు పెంచి, వారికి అదనంగా నెలకు రూ.5,000 రవాణా ఖర్చులు మంజూరు చేసినట్లు మంత్రి ఫరూక్ వివరించారు.

# ద.కొరియా పర్యటన

>>స్థాయి ప్రతినిధి బృందాలు ఈ సమావేశానికి హాజరుకానున్నాయి. 8వతేదీన కొరియన్ మెరైన్ అక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. 9వతేదీన కొరియన్ పొలిటికల్ ఎఫైర్స్ డిప్యూటీ మినిస్టర్ మిస్. యుయిహే సిసిలియా చుంగ్‌తో భేటీ అవుతారు. అనంతరం కొరియన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్వెస్టిమెంట్స్ డిప్యూటీ మినిస్టర్ కాంచన్ కాంగ్‌తో సమావేశమవుతారు. 10వతేదీన వివిధ సంస్థల ప్రతినిధులతో పెట్టుబడి చర్చలతోపాటు కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు. అదేరోజు రాత్రి సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్-2026 విజయవంతం చేయాలని కోరుతూ కొరియా కంపెనీల ప్రతినిధులతో రోడ్ షోలో పాల్గొంటారు.

# వీధివ్యాపారుల చట్టం మేరకు నగరపాలికలు, పురపాలికలకు కొత్త మార్గదర్శకాలు జారీ

**విజయవాడ,జులై 4,ప్రభాతవార్తప్రతినిధి:** వీధివ్యాపారుల చట్టం మేరకు నగరపాలికలు, పురపాలికలకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. పట్టణ స్థానికసంస్థలు ఇచ్చిన వీధివ్యాపారుల చట్టం మేరకు నగరపాలికలు, పురపాలికలకు కొత్త మార్గదర్శకాలు జారీవీధివ్యాపారుల చట్టం మేరకు నగరపాలికలు, పురపాలికలకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. పట్టణ స్థానికసంస్థలు ఇచ్చిన వీధివ్యాపార ప్రణాళికలు ఆమోదిస్తూ నోటిఫికేషన్ ఇచ్చింది. 51 నగరాలు, పట్టణాల్లోని వీధివ్యాపారుల ఉపాధికి ఊతం కలగనుంది. స్థానిక సంస్థలు, వీధివ్యాపార కమిటీల ఏర్పాటుతో సజావుగా వ్యాపారం సాగనుంది. స్థానికంగా ఇబ్బందులు రాకుండా వీధివ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేయనుంది. వీధివ్యాపారులకు కేంద్రం నుంచి వచ్చే రుణాల్లో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోనుంది.

# సివిల్ తగాదాలో ప్రియాంక వదిన సాయిరా వాధ్రా

**ఉధమ్‌సింగ్‌నగర్, జులై 4:** ఉత్తరాఖండ్‌లోని ఉధమ్ సింగ్ నగర్‌లో ఉన్న 4 హెక్టార్ల వివాదాస్పద భూమి చుట్టూ సాగుతున్న భూ వివాదం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా వదిన సాయిరా వాద్రా మరణించిన భూ యజమాని కుల్సుమ్ ఖాన్ సోదరి, 90 ఏళ్ల వృద్ధురాలు నస్రీన్ సంగాల మధ్య ఈ ఆస్తి తగాదా నడుస్తోంది. కుల్సుమ్ ఖాన్ 2025 డిసెంబర్‌లో అవివాహితగా చనిపోవడంతో, ఆమె ఆ భూమిని విల్లు ద్వారా తనకు రాసిచ్చిందని సాయిరా వాద్రా వాదిస్తుండగా తానే అసలైన వారసురాలినని నస్రీన్ పేర్కొంటున్నారు. ఈ సివిల్ కోర్టు వివాదం పెండింగ్‌లో ఉండగానే, నస్రీన్ తన అనుచరులతో కలిసి ఫామ్‌హౌస్‌లోకి చొరబడి కార్మికులను వెళ్లగొట్టి భూమిని స్వాధీనం చేసుకున్నారని సాయిరా వాద్రా ఆరోపించారు. దీనిపై కిచ్చా కాంగ్రెస్ ఎమ్మెల్యే తిలక్ రాజ్ బెహర్ నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు ఫామ్‌హౌస్ వెలుపల భారీ నిరసనకు దిగారు.

కోర్టు పరిధిలో ఉన్న భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు యంత్రాంగం సహకరిస్తోందని ఆరోపిస్తూ భూమిని సీల్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీ సులు నిరసనకారులను అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణంనెలకొంది. ఈ క్రమంలో అధికార యంత్రాంగం పక్షపాతంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆత్మాహుతి చేసుకుంటానని హెచ్చరించారు. ఈ వివాదం దిల్లీకి చేరడంతో, సాయిరా వాద్రా ద్వారా ప్రియాంక గాంధీ, రాబర్ట్ వాద్రాలు భూకబ్జాకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ జాతీయ ప్రతినిధి ప్రదీప్ భండారీ సంచలన ఆరోపణలు చేశారు. మరోవైపు, ఈ వ్యవహారంపై ఉత్తరాఖండ్ హైకోర్టు తీవ్రంగాస్పందించింది. సివిల్ కోర్టు ఇప్పటికే జూన్ 11న తాత్కాలిక స్టే ఇచ్చినప్పటికీ, మళ్లీ భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 164 కింద సమాంతరంగా ఎగ్జిక్యూటివ్ చర్యలు ప్రారంభించడంపై జస్టిస్ ఆలోక్ మహ్రా నేతృత్వంలోని ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది.

### డి.సిఎం పవన్‌ను దూషించిన కేసు

## యూట్యూబర్ జోసెఫ్ రావణ్ మళ్లీ అరెస్ట్

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను దూషించిన కేసులో యూట్యూబర్ జోసెఫ్ రావణ్‌పై రాష్ట్రంలో పలుచోట్ల కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన వరుసగా నాలుగోసారి అరెస్టయ్యారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంకోర్టు శుక్రవారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత అతనికి బెయిల్ మంజూరు చేసింది. కొద్దిసేపటికే శనివారం తెల్లవారు జామున అనకాపల్లి జిల్లా పాయకరావుపేట పోలీసులు మచిలీపట్నంలోనే అతన్ని మళ్లీ అదుపులోకి తీసుకున్నారు. జూన్ 30న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హిందుత్వవాది రాధా మనోహర్ దాస్‌లను లక్ష్యంగా చేసుకుని జోసెఫ్ రావణ్ తన యూట్యూబ్ ఛానల్‌లో అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు అప్‌లోడ్ చేశారు. దీనిపై కూటమి శ్రేణులు, జనసేన నేతలు రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. తొలుత పిఠాపురం పోలీసుల ఫిర్యాదుతో గత బుధవారం హైదరాబాద్‌లో అరెస్టయిన రావణ్‌కు అక్కడి కోర్టు బెయిల్ ఇచ్చింది. అయితే, ఆ వెంటనే కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు మరో కేసులో అతన్ని అరెస్ట్ చేశారు. ఆ కేసులోనూ బెయిల్ లభించింది. ఇదే క్రమంలో శుక్రవారం ఉదయం కృష్ణా జిల్లా మచిలీపట్నం పోలీసులు పాత కేసుల ఆధారంగా రావణ్‌ను అదుపులోకి తీసుకుని, ఇనగుదురు పోలీస్ స్టేషన్‌లో విచారించి మచిలీపట్నం మొబైల్ కోర్టు జడ్జి ఎదుట హాజరపర్చగా రావణ్ తరఫు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు విన్న న్యాయస్థానం అతనికి బెయిల్ మంజూరు చేసింది. ఒంగోలుతో పాటు అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో జనసేన నేతలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఇప్పటికే అక్కడ కేసులు నమోదు కావడంతో మచిలీపట్నం కోర్టు బయట అడుగుపెట్టిన వెంటనే పాయ కరావుపేట పోలీసులు అతన్ని మళ్లీ అరెస్ట్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

**విజయవాడ,జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ పశ్చిమ బైపాస్‌పై రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ప్రమాద సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారిని రాజమండ్రికి చెందిన పురోహితుడు దువ్వూరి హరిప్రసాద్, మార్కాపురం జిల్లాకు చెందిన వీఆర్‌ఏ గురవయ్యగా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పురోహితుడు హరిప్రసాద్ ప్రయాణిస్తున్న కారులో బ్రేక్, ఎక్సలేటర్ మధ్య కొబ్బరి బొండం ఇరుక్కుపోయింది. దీంతో కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ముందుగా అదే మార్గంలో వెళ్తున్న వీఆర్‌ఏ గురవయ్య బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో పాటు ముందున్న కంటైనర్‌ను కూడా ఢీకొట్టాడు. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో పురోహితుడు దువ్వూరి హరిప్రసాద్, వీఆర్‌ఏ గురవయ్య ఇద్దరూ ఘటనాస్థలంలోనే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## ముగ్గురు మహిళల బలవన్మరణం

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లాలోని గూడూరు మండలం అనంతయ్యపేట గ్రామంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఒకే ఇంట్లో ముగ్గురు మహిళలు హనుమకొండ రజిని కుమారి, మధుబాల, గౌరీదేవి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు మహిళల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన వెనుక కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలు లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలపై గూడూరు పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల నుంచి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## అల్లూరి సీతారామరాజుకు సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నివాళులు

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ అల్లూరి త్యాగం, ధైర్యం, దేశభక్తి భారత జాతికి చిరస్మరణీయమని ముఖ్యమంత్రి కొనియాడారు. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా ఆ మహావీరుడికి ఘన నివాళులు అర్పిస్తున్నాను అని చంద్రబాబు పోస్ట్ చేశారు. ఇక మన్యం వీరుడి పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యమని, తెలుగుజాతికి, దేశానికి స్ఫూర్తిప్రదాతగా నిలిచిన అల్లూరి సీతారామరాజు సేవలను ఈ సందర్భంగా స్మరించుకుందాం అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

**పింగళి వెంకయ్యకి సిఎం నివాళులు**

పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లు నివాళులు అర్పించారు. మన జాతీయ పతాకాన్ని రూపొందించిన వెంకయ్య దేశభక్తి అపూర్వమన్నారు.

**మాజీ సీఎం రోశయ్యకు చంద్రబాబు నివాళులు**

మాజీ సీఎం రోశయ్య జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నివాళుల ర్పించారు. విలువలతో కూడిన రాజకీయాలు, ఆర్థిక క్రమశిక్షణకు రోశయ్య ప్రతీక అని కొనియాడారు. ప్రజాజీవితంలో రోశయ్య చెరగని ముద్ర వేశారని అన్నారు. రోశయ్య నిబద్ధతతో కూడిన రాజకీయవేత్త అన్నారు. ఆయన ఆర్థిక మంత్రిగాను పనిచేసి మంచి సేవలు అందించారన్నారు.

**అల్లూరికి డి.సిఎం పవన్ నివాళి**

మన్యం వేదికగా విప్లవ పోరాటాన్ని నిర్వహించిన స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనను ధైర్యంగా ఎదిరించి, గిరిజన ప్రజల హక్కులు, గౌరవం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. **వంగవీటి రంగాకు నివాళి:** విజయవాడ తూర్పు నియోజకవర్గ దివంగత శాసనసభ్యుడు వంగవీటి మోహనరావు(రంగా) జయంతి సందర్భంగా ఆయనకు 'ఎక్స్' వేదికగా పవన్ నివాళి అర్పించారు. ఆశయ సాధన కోసం జీవితాన్ని త్యాగంచేసిన మహనీయుడు రంగా అన్నారు. నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి మరువలేదన్నారు,

## ప్రకాష్‌రాజ్, జోసెఫ్ రావణ్ సంఘ విద్రోహశక్తులు

### సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** చలనచిత్ర నటుడు ప్రకాష్‌రాజ్, యుట్యూబర్ జోసెఫ్ రావణ్ సంఘవిద్రోహ శక్తులుగా మారారని ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆరోపించారు. ప్రకాష్‌రాజ్‌కు జోసెఫ్ రావణ్‌తో ఏమైనా సంబంధం ఉందా? అనే అనుమానాలు వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రకాశ్‌రాజ్, బచ్చులకూరి జోసఫ్ వ్యాఖ్యలపై మంత్రి కందుల ఆగ్రహం వ్యక్తం చేశారు. జస్ట్ ఆస్కింగ్ అంటున్న ప్రకాశ్‌రాజ్, జోసఫ్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. అందుకు మా వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. జోసఫ్ ప్రశ్నించగానే జస్ట్ ఆస్కింగ్ అంటూ ప్రకాశ్‌రాజ్ వస్తారు. పవన్ కల్యాణ్ లక్ష్యంగా ఇద్దరూ కలిసి కుట్రలు చేస్తున్నారు. తెర ముందు వీరు ఉంటే, తెర వెనుక ఎవరున్నారో తేలాలి. తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే ఈ కుట్ర సాగుతుంది. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్రలు చేస్తున్నారు. ఇలాంటి సంఘవిద్రోహ శక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్సీపీ పాలనలో జస్ట్ ఆస్కింగ్ అని ఎందుకు అడగలేకపోయారు? పవన్ కల్యాణ్‌ను ఒక కుల చట్రంలో బంధించేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ప్రశ్నించడం అంటే బూతులు తిట్టడం, వ్యక్తిగత విమర్శలు చేయడమా అని కందుల దుర్గేష్ ప్రశ్నించారు.

### 9 మంది డిఎస్పీలకు అదనపు

## ఎస్పీలుగా పదోన్నతి

**విజయవాడ,జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 9మంది డీఎస్పీలు అదనపు ఎస్పీలుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేసారు. పదోన్నతి పొందిన వారిలో ఎం.రాజగోపాల్‌రెడ్డి, పి.శ్రీకాంత్, టి.శ్రీనివాసులు, జి.శివప్రభాకర్ రెడ్డి, డి.సోమన్న, ఎ.ఎస్.చక్రవర్తి, ఎం.అంబికా ప్రసాద్, ఎస్. వాసుదేవ్, ఎ.నరసింహమూర్తి ఉన్నారు. వీరంతా పోలీసు హెడ్‌క్వార్టర్స్ మంగళగిరిలో రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## విశాఖలో ఆరుగురు బిఎల్‌ఒల సస్పెన్షన్

### విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్

**విశాఖపట్నం, జూలై 4 ప్రభాతవార్త:** విశాఖ జిల్లాలో ఆరుగురు సర్‌బూత్ లెవెల్ అధికారుల(బిఎల్‌ఓ)పై జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్రసవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఆరుగురు బూత్ లెవెల్ అధికారుల్ని (బీఎల్‌వోలు) సస్పెండ్‌చేస్తూ విశాఖకలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భీమిలి నియోజకవర్గ పరిధిలో భీమిలి అర్బన్‌కు చెందిన బీఎల్వో సువర్ణ (పోలింగ్ స్టేషన్177), వి. వెంకటసాయి శరణ్ (పీఎస్359), దక్షిణ నియోజకవర్గపరిధిలో ఎం.డి.షాహిద్ (పిఎస్66), బి. లక్ష్మీనిహారిక(పీఎస్220), తూర్పు నియోజకవర్గ పరిధిలో చిట్టిబోయిన గంగాజలం (పీఎస్272), చేపలరామాంజనేయులు(పోఎస్‌లు114, 123)పై ఈ చర్యలు తీసుకున్నారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తమ విధుల్ని సక్రమంగా నిర్వర్తించకపోవడంతో పాటు, రిప్రెజెంటేషన్ ఆఫ్ దిపీపుల్స్ యాక్ట్1950లోని సెక్షన్32 నిబంధనలకు విరుద్ధంగా వారంతా వ్యవహరించినట్టు గుర్తించిన నేపథ్యంలో కలెక్టర్ ఈకఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఓటరుజాబితా సవరణ ప్రక్రియలో విధి నిర్వ హణలో బాధ్య తారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కలెక్టర్ హెచ్చరించారు.

## ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అల్లూరి

### టిటిడి ఆధ్వర్యంలో జయంతి

**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీక అని, ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి నేటి యువతకు ఆదర్శమని మన్యం జిల్లా సీతంపేటకు చెందిన సాంఘిక శాస్త్రఉపాధ్యాయుడు ఆర్. మోహన్‌రావు నాయుడు పేర్కొన్నారు. టిటిడి సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో తిరుపతి అన్నమాచార్య కళా మందిరంలో శనివారం అల్లూరి సీతారామరాజు 129వ జయంతి జరుపుకున్నారు. మోహన్‌రావు నాయుడు మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు తీవ్ర దోపిడీ, అణచివేత, అన్యాయాలకు గురయ్యారని తెలిపారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో గిరిజనులకు అండగా నిలిచిన అల్లూరి సీతారామరాజు వారిని ఏకం చేసి, దురలవాట్లకు దూరం చేసి, యుద్ధ విద్యలు, గెరిల్లా పోరాట పద్ధతుల్లో శిక్షణ ఇచ్చి బ్రిటిష్ పాలకులను ధైర్యంగా ఎదుర్కొన్న మహోన్నత నాయకుడని కొనియాడారు. టిటిడి డిప్యూటీ ఇఒ ఆనందరాజు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు తన అసమాన త్యాగం, వీరోచిత పోరాటంతో మన్యానికి చిరస్థాయి కీర్తిని తీసుకువచ్చార న్నారు. ఆయన సేవా స్ఫూర్తిని ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆడిట్ అధికారి వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు టిటిడి సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో అల్లూరి సీతారా మరాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అన్నమయ్య విగ్రహానికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు.

## తిరుపతి శివార్లలో చిరుత కలకలం

### ఓ ఇంట్లోకి చొరబడేందుకు యత్నం

**తిరుపతి, జులై 4 ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అడవులకు ఆనుకునే ఉన్న తిరుపతి నగర శివార్లలోని కరకంబాడి ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ చిరుతపులి ఏకంగా ఇంట్లోకి జొరబడింది. ఇంటి ఆవరణలో పూర్తిగా సంచరించింది. ఆ ఇంటి ఆవరణలో అమర్చిన సిసి కెమెరాల్లో ఈ దృశ్యాలు కనిపించడంతో ఇంటి కుటుంబ సభ్యులు భయంతో వణికిపోయారు. అందరూ కలసి గట్టిగా కేకలు వేయడంతో చిరుతపులి అక్కడ నుండి అడవిలోకి పరుగులు తీసింది. గత కొంతకాలంగా శేషాచలం అట వీప్రాంతం నుండి చిరుతపులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. ప్రధానంగా అడవికి ఆనుకునే ఉంటున్న కాలనీల్లోకి యధేచ్ఛగా జంతువులు సంచరించడం మామూలైంది. తిరుపతి నగర శివార్లలో చిరుత పులుల సంచారం ప్రజలను భయాం దోళనలకు గురిచేస్తోంది. రేణిగుంట మండలం వెంకటాపురం గ్రామంలో నివాసముంటున్న అధ్యాపకుడు బాలాజీ ఇంటికి అర్ధరాత్రి ఓ చిరుత పులి జొరబడింది. ఇంటి సిసి కెమెరాల్లో గమనించిన కుటుంబసభ్యులు గట్టిగా కేకలు వేయడంతో చిరుత దారిమళ్లి అడవిలోకి వెళ్ళిపోయింది. ఆహారంకోసం ఇలా దారితప్పి వచ్చినట్లు అటవీశాఖ వర్గాలు పేర్కొన్నాయి. చిరుతపులి సంచారానికి సంబంధించిన దృశ్యాలు ఇంటి ఆవరణలో ఉన్న సిసి కెమెరాలో రికార్డ య్యాయి. అర్ధరాత్రివేళ చిరుత పిల్లిలా నక్కినక్కి రావడం, ఇంట్లోకి దూరాలని చూడటం ఆ ఫుటేజీలో కనిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకుని పరిశీలించారు. ప్రజలు రాత్రివేళల్లో ఒంటరిగా తిరగవద్దని, అప్రమత్తంగా ఉండాలనిహెచ్చరించారు. చిరుతను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### దేవునిపై విశ్వాసంతో కొండకు..

## అలిపిరి మెట్లెక్కివచ్చిన 116 యేళ్ల అవ్వ

**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** దేవునిపట్ల విశ్వాసం..ఆపై వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలనే పట్టుదల ఆ శతాధిక వృద్ధురాలి వయసు ముందు ఓడిపోయిందనే చెప్పవచ్చు. ఏకంగా అలిపిరి మెట్లదారిలో శతాధిక వృద్ధురాలు అలుపుసొలుపు లేకుండా అమాంతం 3,550 మెట్లు మార్గాన్ని ఎవరి సహాయం తీసుకోకుండా, చేతిలో కేవలం ఒక కర్రను ఆసరాగా పట్టుకుని, గోవిందా. గోవిందా అంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ శనివారం ఉదయం తిరుమల చేరు కున్నారు. ఇప్పుడు ఈ బామ్మ వీడియో యువతలో స్ఫూర్తిని నింపేలా మారింది. ఇంత వృద్ధాప్యంలోనూ లభించిన శారీరక, మానసికశక్తి వేంకటేశ్వరస్వామి అనుగ్రహమేనని తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మరికొందరు మాత్రం ఆమె సంకల్పం, జీవనశైలి, మానసిక దృఢత్వమే కారణంగా భక్తులు చెబుతున్నారు. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం, భక్తి చూసిన సహ యాత్రికులు ఆశ్చర్యపోయారు. ఈ ఘటనను చూసిన పలువురు భక్తులు, ఇంత వృద్ధాప్యంలోనూ ఆమెకు లభించిన శారీరక, మానసిక శక్తి వేంకటేశ్వరస్వామి అనుగ్రహమేనని తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఏది ఏమైనా, 116ఏళ్ల వయస్సులో అలిపిరి మెట్ల మార్గంలో తిరుమల చేరిన భీమవ్వ ప్రయాణం ఇప్పుడు వేలాది మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ వీడియోను చూసిన నెటిజెన్లు అభినందిస్తూ పోస్టింగ్స్ పెడుతున్నారు. ఈమె కర్ణాటకకు చెందిన మహిళగా తెలిసింది. 116 ఏళ్ల బామ్మ తన కుటుంబసభ్యులతో కలిసి తిరుమల మెట్లు ఎక్కుతుండటాన్ని చూసిన మరో భక్తురాలు వీడియో తీశారు.

## రావణ్‌పై ఎపిలో కక్షసాధింపు చర్యలు: ప్రకాశ్‌రాజ్

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** యూట్యూబర్ రావణ్‌పై ఏపీలో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని " ఎక్స్" మాధ్యమంగా చలనచిత్రనట్టుడు, సామాజిక వేత్త ప్రకాశ్‌రాజ్ ఆరోపించారు. ఏలూరులో పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన తర్వాత పిఠాపురం పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. కాకినాడ కోర్టు బెయిల్ మంజూరు చేయగా, వెంటనే సర్పవరం పోలీసులు మరో పాత కేసులో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. రావణ్‌పై మొత్తం 30 కేసులు ఉన్నాయని, ఇది స్పష్టమైన ప్రతీకార చర్య అని ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. జనసేన కార్యకర్తలు పోలీస్ వాహనాన్ని అడ్డుకున్న ఘటనను కూడా ఆయన ప్రస్తావిస్తూ ప్రశ్నిస్తే చంపేస్తారా? అని ప్రశ్నించారు. జోసెప్ విషయంలో అరెస్ట్.. బెయిల్.. మళ్లీ అరెస్ట్. మీరు తప్పు చేస్తున్నారని మీకు కోర్టులు స్పష్టంగా చెప్పడం లేదా? మీ కక్షపూరిత రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు" అంటూ ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. ప్రశ్నించే వారిని అధికారాన్ని దుర్వినియోగం చేసి అణచివేయడం ఎంతవరకు సాగుతుంది? కోర్టు బెయిల్ ఇచ్చిన వెంటనే మరో కేసు తెరిచి వేధించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు.

## తిరుమల సమాచారం

### వారాంతం రద్దీ: శ్రీవారి దర్శనానికి 24గంటలు

**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం సెలవులతో తిరుమల శనివారం ఉదయానికి పూర్తిగా నిండిపోయింది. ఉదయం 5గంటలకే వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండి భక్తుల లైన్లు మూడుకిలోమీటర్లు శిలాతోరణం వరకు చేరాయి. దీంతో స్వామివారి దర్శనానికి 24గంటల సమయం నిరీక్షణ తప్పలేదు. ఆదివారం కూడా భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పరిస్థితిని పూర్తిస్థాయిలో అదుపులో ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. శనివారం ఉదయానికి లక్షమందిపైగా భక్తులు తిరుమలకు చేరారు. శుక్రవారం రాత్రి వరకు 71,668మంది భక్తులకు మహాలఘులో స్వామివారి దర్శనం చేయించారు. శనివారం సాయంత్రం వరకు 43 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు.

## 17న ఆణివార ఆస్థానం, 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానంపర్వదినం 17వతేదీ శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఆలయం లోపల ఈ వేడుక జరిపిస్తారు. ఈ సందర్భంగా 14వతేదీ మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధిచేయనున్నారు. ఆలయంలోపల బంగారువాకిలి నుండి ఉపఆలయాలు, మహాద్వారం వరకు నీటితో శుభ్రం చేయనున్నారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేస్తారు, అష్టదళపాదపద్మారాధన సేవ రద్దయ్యింది. 17వతేదీ ఆలయంలో ఆణివార ఆస్థానం జరగనుంది. ఆ రోజు సాయంత్రం ఉభయదేవేరులతో కలసి మలయప్పస్వామి సువాసనల పుష్పపల్లకిపై ఊరేగుతారు. ఈ రెండు పర్వదినాల సందర్భంగా 13వతేదీ సోమవారం, 16వతేదీ గురువారం దర్శనాలకు ఫార్సు లేఖలు స్వీకరించరు. జూలై 17న కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను రద్దు చేశారు.

## టిటిడి కపిలేశ్వరస్వామి ఉన్నతపాఠశాల విద్యార్థులకు నగదుతో సన్మానం

**తిరుమల,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ తాటితోపువెంకటపతి నగర్‌లో నిర్వహిస్తున్న కపిలేశ్వరస్వామి ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదు సన్మానం చేశారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు పాఠశాల పూర్వ విద్యార్థులు నగదు వెండి డాలర్లతో సన్మానించారు. ఈ పాఠశాలలో చదివిన 10వ తరగతిలో 562/600 మార్కులు సాధించిన ప్పి. జనని ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థినికి పూర్వ విద్యార్థులు 25వేల రూపాయలు నగదు బహుమతి, 10గ్రాముల వెండి డాలరు బహూకరించారు. పాఠశాల పట్ల వారికున్న భక్తిని ఔదార్యాన్ని చాటుకున్నారు. రెండవ ర్యాంక్ సాధించిన 545/600 మార్కులు సాధించిన చిరంజీవి విజయ దుర్గకు 10వేల నగదు, 10 గ్రాముల వెండి డాలర్‌తో సత్కరించారు. ఈ పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు పండిట్ నాగేంద్ర నాయక్ ఇద్దరు విద్యార్థులకు 1,500రూపాయలు , వెయ్యి వెయ్యి రూపాయలు నగదుతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు నంబూరి రెడ్డి దినేష్, దొరబాబు, శివ కృష్ణ, దీనా రెడ్డి ,వసంత, అశోక్ పాల్గొన్నారు. మంచిగా చదువుకుంటే అన్ని సమస్యలకు సమాధానమని మన స్థితిగతులను మార్చే శక్తివంతమైన సాధనమని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయే విద్యా సంవత్సరంలో 540 మార్కులు పైబడిన విద్యార్థులకు వెండి డాలర్లతో సత్కరిస్తానని హామీ ఇచ్చారు. బాగా చదివే విద్యార్థులకు ఎల్లవేళలా తాము అండగా నిలబడతామని భరోసా ఇస్తూ ప్రస్తుతం పదవ తరగతిలో ఉన్న విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణమూర్తి పూర్వ విద్యార్థుల సహృదయతను, ఔదార్యాన్ని అభినందించి వారిని దుశ్శాలువలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. టిటిడి యాజమాన్యం కల్పించిన సౌకర్యాలను తల్లిదండ్రులు వారి బిడ్డల కోసం సద్వినియోగం చేసుకొని తమ బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

## భార్యపై విచక్షణారహితంగా భర్త దాడి

**తిరుపతి,జులై 4ప్రభాతవార్తప్రతినిధి:** ప్రవర్తన సరిగా లేదని, మాట వినడంలేదని భార్యపై భర్త విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన తిరుపతి నగరం తూర్పు పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల చేను లో చోటు చేసుకుంది. చింతల చేనుకు చెందిన మహిళకు చిత్తూరుకు చెందిన రాజేష్‌తో కొన్నేళ్ళ క్రిందట వివాహమైంది. వీరికి 14యేళ్ల బాలిక, 12 యేళ్ల బాలుడు ఉన్నారు. వివాహమైన రెండు సంవత్సరాలు అత్తమామల సంపాదనలతో కుటుంబం సాగింది. పది సంవత్సరాల నుండి బలవంతంగా పడుపు వృత్తిలోకి దింపి ధనార్జన చేయిస్తున్నారు. ఆమె కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై ఆ వృత్తిని వదలిపెట్టింది. దీంతో భర్త పెట్టే వేధింపులు తట్టుకోలేక ఆమె పుట్టింటికి చేరింది. భర్త చేసిన తప్పులు బయటపడతాయని మహిళ తమ్ముడుప్రసాద్ తన కూతురిపై అసభ్యంగా ప్రవర్తించాడంటూ మహిళా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులకు ఆశ్చర్యం కలిగించే విషయాలు తెలిశాయి. మామయ్యపై మా నాన్న బలవంతంగా తప్పుగా చెప్పించాడని బాలిక వెల్లడించింది. తనకు సంబంధించిన విషయాలు బయటపెడుతుందని భార్యపై భర్త బంధువులు దాడికి దిగారు. ఆయన స్వప్రయోజనాలకులోను తీసుకొని 50లక్షలతో నిర్మించుకున్న రెండు అంతస్తుల భవనానికి అప్పు తీరే వరకు కాపురానికి రమ్మంటున్నాడని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. 112కు కాల్ చేసిన బాధితురాలు తనకు ప్రాణహాని ఉందని పోలీసులు రక్షణ కల్పించాలంటూ వాపోయింది.

## అమరావతి రైతులను మోసగించిన సిఎం: మాజీ మంత్రి పేర్ని నాని

**విజయవాడ.జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రైతులను సీఎం చంద్రబాబు మోసం చేసారని మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. అమరావతిలో కట్టడాలకే వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, రైతులకు ఎప్పుడు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అమరావతిని అప్పుల కుప్పగా మార్చుతున్నారని, ఎప్పటి లోగా నిర్మాణాలు పూర్తి చేస్తారో చెప్పటం లేదని వ్యాఖ్యానించారు. అసలు అమరావతికి ఎంత ఖర్చు చేస్తున్నారు.. ఎంత అవసరమో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఇప్పటికే రూ 50 వేల కోట్లు రాజధాని పేరుతో అప్పులు చేసారని చెప్పు కొచ్చారు. జగన్ పైన విమర్శలు చేసేందుకు.. తిట్టేందుకు ముందుకు వచ్చే మంత్రులు తమ శాఖల పని తీరు గురించి మాత్రం మాట్లాడరని మండిపడ్డారు. మావిగన్ అంటే మంత్రులు భయ పడుతున్నారని వ్యాఖ్యానించారు. సింగపూర్ తరహా రాజధాని నిర్మాణంచేస్తామని, చివరకు మున్సిపాల్టీ చేస్తున్నారని పేర్ని నాని చెప్పుకొచ్చారు. రాజధానిలో పేదలకు ఇచ్చిన 50 వేల పట్టాలు రద్దు చేసారని గుర్తు చేసారు. రాజధాని పేరుతో దోపిడీ ప్రజలకుకళ్లకు కట్టినట్లుగా కనపడుతోందని చెప్పారు. అమరావతి రైతులను కలిసేందుకు వెళ్తేదాడులుచేస్తారని, ఇదేం రాజకీయమని ప్రశ్నించారు. రైతుల కష్టాలు చూసేందుకు మళ్లీ అమరావతి వెళ్తాం, రైతులను కలుస్తామని పేర్ని నాని ప్రకటించారు.

## అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవం: ముళ్లపూడి రేణుక

**విజయవాడ జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో వేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసహనం, భయంతో కొత్త వివాదాలకు తెరలేపుతున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక విమర్శించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల దృష్టిని అభివృద్ధి నుంచి మళ్లించేందుకే 'మామిగం' వంటి కొత్త రాజకీయ నాటకాలకు శ్రీకారం చుడుతు న్నారని ఆరోపించారు.

గతంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టిన జగన్‌కు ప్రజలు ఎన్నికల్లోనే గట్టి తీర్పు ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. అయినప్పటికీ అమరావతిపై మళ్లీ రాజకీయాలు చేయడం ఆయన రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. అమరావతి కేవలం ఒక ప్రాంతం కాదని, అది ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని రేణుక స్పష్టం చేశారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టబద్ధ రాజధానిపై ఇష్టానుసార వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ వ్యవస్థల పట్ల గౌరవం లేకపోవడానికే నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధాని అమరావతి అయితే, జగన్ శాశ్వత నివాసం మాత్రం బెంగళూరు ప్యాలెస్ అని ఆమె విమర్శించారు.

## వ్యవసాయ భూముల బదలాయింపు సులభతరం

### వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్ విధానం

### రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లు

### రూ.10లక్షల లోపు విలువైన భూమికి స్టాంప్ డ్యూటీ కేవలం రూ.100

### వీలునామా లేకపోతే రిజిస్ట్రేషన్ సమయంలో ఎఫ్‌ఎంసి తప్పనిసరి

**విజయవాడ,జూలై4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూముల బదలాయింపు ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. ఇప్పటికే నామమాత్రపు స్టాంప్ డ్యూటీతో రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతించింది. ఈ క్రమంలోనే మరో నిర్ణయం అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. వారసత్వ ఆస్తుల పంపకాల దస్తావేజు రిజిస్ట్రేషన్ పూర్తికాగానే, ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ (రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పిడి) జరిగేలా కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ నిర్ణయంతో భూ యజమానులు మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పనున్నాయి. గతంలో కుటుంబ పెద్ద మరణానంతరం వారసులు తమ పేర్ల మీదకు భూమిని మార్చుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవారు. ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్‌ఎంసీ) కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రెవెన్యూ అధికారులను ఆశ్రయించి మ్యుటేషన్ చేయించుకోవాల్సి వచ్చేది. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో పాటు, రైతులకు శ్రమ, ఖర్చుతో కూడుకున్నదిగా ఉండేది. తాజా విధానం ప్రకారం, కుటుంబ సభ్యులు తమ మధ్య ఆస్తులను పంచుకుంటూ రాసుకున్న పంపకాల దస్తావేజును సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించిన వెంటనే, ఆ సమాచారం ఆన్‌లైన్‌లో రెవెన్యూ శాఖకు చేరుతుంది. దీని ఆధారంగా రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లను నమోదు చేసే ఆటో మ్యుటేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఏకకాలంలో జరిగిపోతాయి. వీలునామా లేకపోతే ఎఫ్‌ఎంసీ తప్పనిసరి అవుతుంది. అయినప్పటికి ఈ ప్రక్రియలో ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిబంధనను చేర్చింది. కుటుంబ పెద్ద (తాత, తండ్రి లేదా తల్లి) ఎలాంటి వీలునామా రాయకుండా మరణిస్తే, వారసులు ఆస్తి పంపకాల దస్తావేజును రిజిస్ట్రేషన్ చేసే సమయంలో తప్పని సరిగా ఎఫ్‌ఎంసీ సమర్పించాల్సి ఉంటుంది. వీలునామా ఉంటే ఈ నిబంధన వర్తించదు. గతంలో ఏపీ ప్రభుత్వం వారసత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రూ. 10లక్షల లోపు విలువైన వ్యవసాయ భూమికి కేవలం రూ. 100స్టాంప్ డ్యూటీగా, రూ.10లక్షలు దాటితే రూ. 1,000గా నిర్ణయించింది. ఇప్పుడు రిజిస్ట్రేషన్‌ను మ్యుటేషన్‌తో అనుసంధానించడం వల్ల రైతులకు పూర్తిస్థాయిలో హక్కులు వేగంగా లభిస్తాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు సకాలంలో చేతికి అందడంతోపాటు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు పొందడంకూడా సులభతరమవుతుంది. ఈ సమీకృత విధానం పరిపాలనలో పారద ర్శకతను పెంచడంతో పాటు, రైతులకు భరోసా కల్పిస్తుందని అధికారులు వివరిస్తున్నారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు కాలేజీలకు వచ్చి ఖాళీగా కూర్చోవల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలేజీలు ప్రారంభమై నెల రోజులు దాటినా ఇప్పటి వరకు తెలుగు మీడియం విద్యార్థులకు పుస్తకాలు అందజేయలేదు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడంతో వారికి క్లాసులు కొనసాగుతుండగా.. తెలుగు మీడియం విద్యార్థులు మాత్రం ఖాళీగా కూర్చో వల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలోని 436 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా వాటిల్లో కొన్నింటికి మాత్రమే తెలుగు మీడియం బుక్స్ అందాయి. రాష్ట్రంలోని 85 శాతానికి పైగా ప్రభుత్వ జూనియర్ కాలేజీవిద్యార్థులకు తెలుగు మీడియం బుక్స్ ఇప్పటికీ చేరలేదు. జూన్1నుంచి కొత్త విద్యాసంవత్సరం2026-27 ప్రారంభమైంది. అప్పటినుంచివిద్యార్థులు కాలేజీలకు వస్తున్నారు. మొదటి సంవత్సరంలో ఇప్పటి వరకు సుమారు 62వేల మంది విద్యార్థులు చేరగా..వారిలో 35వేల మంది వరకు తెలుగు మీడియం విద్యార్థులున్నారు. మిగిలిన వారు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులున్నారు. ఈ ఏడాదిలో సిలబస్ కూడా మారింది. ఈ నేపథ్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు కొత్త సిలబస్‌ను ప్రింట్ చేసి ఇస్తేనే క్లాసులు బోధించడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్ల కొరత తీవ్రంగా ఉంది. మంజూరైన పోస్టుల్లో సుమారు 70శాతం పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. వాటిల్లో గెస్ట్ లెక్చరర్లతో పాఠాలు బోధిస్తున్నారు. యూనివర్సిటీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 11 యూనివర్సిటీల్లో 2500కిపైగా అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనూ సౌకర్యాలతో పాటు, అధ్యాపకుల కొరత ఉంది. కొద్ది రోజులక్రితం నేషనల్ మెడికల్ కౌన్సిల్ ..ప్రభుత్వమెడికల్ కాలేజీల్లో ఉన్న లోపాలను సరిచేసుకోవాలని సూచించింది.ఈనేపథ్యంలో ఈ ఏడాది కూడా విద్యార్థులకు సమస్యలతోనేస్వాగతంపలికింది.

# సమస్యలతో విద్యా సంవత్సరానికి స్వాగతం

**నాగమణీంద్ర పల్లాపు**

తెలంగాణ రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరం జూన్ 1 నుంచి ప్రారంభమైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలు జూన్ 1 నుంచి ప్రారంభం కాగా, జూన్ 8 నుంచి డిగ్రీ, పీజీ కాలేజీలు ప్రారంభమయ్యాయి. జూన్ 15 నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతోపాటు అధ్యాపకుల కొరత కూడా కొనసాగుతోంది. ఈ ఏడాది ప్రత్యేకంగా పాఠశాల స్థాయి నుంచి జూనియర్ కాలేజీల వరకు విద్యార్థులందరికీ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌ను అందించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి పాఠశాల విద్యార్థులతోపాటు, జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా ఉదయం పూట అల్పాహారం అందిస్తోంది. అయితే ఇది రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి కాకుండా విడతల వారీగా మొదలుపెట్టనుంది. ఇదిలా ఉంటే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాల కొరతతోపాటు టీచర్ల కొరత కూడా ఉంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో లెక్చరర్ల కొరతతోపాటు ఇప్పటి వరకు తెలుగు మీడియం విద్యార్థులకు పుస్తకాలు సైతం అందజేయలేదు. ఇక రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పరిస్థితి కూడా ఇందుకు తీసిపోలేదు. ఉన్నవి 129 డిగ్రీ కాలేజీలే అయినా వాటిలో 70 శాతానికిపైగా అధ్యాపకులు లేరు. ఉన్నత విద్యా సంస్థలైన యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూనివర్సిటీల్లో 80 శాతానికి పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాకతీయ యూనివర్సిటీతోపాటు మరికొన్ని యూనివర్సిటీల్లో చాలా డిపార్ట్‌మెంట్లకు ప్రొఫెసర్లు లేరు. చివరికి హెచ్‌వోడీలుగా అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వ్యవహారిస్తున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది నుంచి మరో 2250కి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ క్లాసులను ప్రారంభించడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4679 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ క్లాసులను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు 24,562 ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రీ ప్రైమరీ నుంచి హైస్కూల్, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సుల వరకు సుమారు కోటి మంది విద్యార్థులు తమ విద్యను కొనసాగిస్తున్నారు. అత్యధికంగా పాఠశాల స్థాయిలో 62లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. సర్కారు స్కూళ్లలో టీచర్ల కొరత అయోమయానికి గురిచేస్తోంది. కేంద్ర విద్యాశాఖ

విడుదల చేసిన సమగ్ర శిక్ష పీఏబీ నివేదిక రాష్ట్ర విద్యా వ్యవస్థలోని ఎన్నో అంశాలను బహిర్గతం చేసింది. రాష్ట్రంలో మొత్తం 30,057 ప్రభుత్వ స్కూల్స్ (69.7 శాతం)ఉండగా, వాటిలో చదువుతున్నది 26.29 లక్షల (35.3 శాతం) స్టూడెంట్స్ మాత్రమే. కానీ రాష్ట్రంలో ఉన్న 12,474 (28.9 శాతం) ప్రైవేటు స్కూళ్లలో 47.52 లక్షల (63.7 శాతం) మంది చదువుతున్నారు. రాష్ట్రంలోని 4,739 ప్రైమరీస్కూళ్లు ఒక్క టీచర్‌తోనే కొనసాగుతున్నాయి. అప్పర్ ప్రైమరీ లెవల్లోనూ సింగిల్ టీచర్ బడుల సంఖ్య 80 నుంచి 93కి పెరిగింది. అప్పర్ ప్రైమరీలో పీపుల్ టీచర్‌రేషియో(పీటీఆర్) 14.8 నుంచి 18.6 శాతానికి పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 11,801 ప్రైమరీ స్కూళ్లలో (60శాతం) 30 కంటే తక్కువ మంది విద్యార్థులే ఉన్నారు. ఒక్క విద్యార్థి కూడా లేని జీరో ఎన్ రోల్‌మెంట్ బడుల సంఖ్య కూడా 1,809 నుంచి 1,997కు పెరిగింది. అప్పర్ ప్రైమరీలోనూ జీరో ఎన్‌రోల్‌మెంట్ బడుల సంఖ్య 39 నుంచి 49కి చేరింది. రాష్ట్ర వ్యాప్తంగా 6,791 ప్రైమరీ స్కూళ్లలో 15 మంది కంటే తక్కువ మంది స్టూడెంట్లు ఉన్నారు. రాష్ట్రంలో సెకండరీ స్థాయిలో డ్రాపౌట్ రేటు గతేడాది 8 శాతం ఉండగా, ఇప్పుడు 10.5 శాతానికి పెరిగింది. ఇది జాతీయ సగటు 8.2 శాతం కంటే ఎక్కువ. బడుల్లో త్రాగునీరు, కరెంటు లాంటి సదుపాయాలు 95 శాతానికి పైగా బడుల్లో కల్పించినప్పటికీ నాణ్యమైన విద్య అందించడంలో మాత్రం రాష్ట్రం వెనుకబడే ఉందని నివేదిక ఎత్తిచూపింది. రాష్ట్రంలో ఉన్న 14 డైట్ కాలేజీల్లో మంజూరైన 286 పోస్టుల్లో ఏకంగా 151 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఈ ఏడాది కూడా ఫీజుల భారాన్ని మోయక తప్పడం లేదు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజు నియంత్రణ చట్టం వస్తుందని ఆశతో ఎదురు చూడటం.. తీరా విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి రాకపోవడంతో తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ చట్టం ఈ ఏడాది 2026-27 కూడా రాలేదు. ఫీజు నియంత్రణ చట్టం ఇప్పటి వరకు రాకపోవడంతో ఈ ఏడాది కూడా రాష్ట్రంలోని సుమారు 12 వేల ప్రైవేటు స్కూల్స్‌లో చదువుతున్న సుమారు 32 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు లక్షల్లో ఫీజులను చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రైవేటు స్కూల్స్‌కి సంబంధించి ఫీజుల వసూలులో హైదరాబాద్ నగరం దేశంలో రెండో స్థానంలో ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ తరువాత ప్రైవేటు స్కూల్స్‌లో అడ్మిషన్లకు లక్షల్లో డొనేషన్లను వసూలు చేస్తుండటమే కాకుండా.. ఏడాది ఫీజు సైతం లక్షల్లో ఉంటుంది. ఇద్దరు పిల్లలను ప్రైవేట్ స్కూల్‌లో చదివించాలంటే ఉద్యోగస్తులు తాము సంపాదిస్తున్న దాంట్లో సగానికిపైగా వారి పిల్లల ఫీజులకే ఖర్చు చేయాల్సి వస్తోంది. రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ కోసం 2017లో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతి రావు ఛైర్మన్‌గా కమిటీని ఏర్పాటుచేసింది. అప్పటి నుంచి ఫీజు నియంత్రణ చట్టం కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. జూన్ 1 నుంచే ప్రారంభమైన జూనియర్ కాలేజీల్లోనూ సమస్యలు నెలకొన్నాయి. ఇంటర్‌బోర్డు అనుమతి లేకుండానే రాష్ట్రంలోని 1000కి పైగా ప్రైవేటు జూనియర్ కాలేజీలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు కోసం సుమారు 1424 కాలేజీలు దరఖాస్తు చేసుకోగా వాటిలో శనివారం వరకు కేవలం 358 కాలేజీలకు మాత్రమే ఇంటర్ బోర్డు అనుమతి ఇచ్చింది. ప్రైవేటు జూనియర్ కాలేజీలకు సంబంధించి 2025-26విద్యా సంవత్సరంలో 1405 కాలేజీలకు అనుమతి ఇవ్వగా ఇపుడు 358 కాలేజీలకు మాత్రమే గుర్తింపును ఇచ్చింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో తెలుగు మీడియం బుక్స్ లేవు. ●

---

తమిళనాడు

# రెండో సమరం!

**ఎ.వి.వి ప్రసాద్**

మొదటి 50 రోజులు'విజయ్' వంతమయ్యాయి. అదే సమయంలో రెండో యుద్ధంకూడా మొదలయింది. మే10 న సిఎంగా ప్రమాణం చేసే వరకు విజయ్ సాగించిన సమరం మొదటిదైతే, ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసం చేస్తున్న సమరం రెండోది. అది ఇప్పుడు కీలక దశకు చేరుకొంది. మొదటి యుద్ధానికి విజయ్ 'ఇమేజ్' సహకరిస్తే, రెండో యుద్ధం ఆయనసామర్థ్యానికి పరీక్షగా నిలుస్తోంది. 'ద్రవిడ' రంగు, రుచి, వాసన లేని పార్టీగా విజయ్ 'తమిళ వెత్రి కజగం (టివికె) పేరు తెచ్చుకొన్నా, దాదాపుఆరు దశాబ్దాల ద్రవిడ పార్టీల పాలనకు టివికె స్వస్తి పలికినా ఆ పార్టీలోకి వచ్చి చేరుతున్నవారంతా ద్రవిడ పార్టీల మూలాలున్నవారే అన్నది గమనించాల్సిన విషయం. ప్రభుత్వంలో ఉన్నచిన్న, పెద్ద అధికారులందరు కూడా రెండు ప్రధాన ద్రవిడ పార్టీలలో ఏదో ఒకదానికి మద్దతుదారులే. వారికి రుచించని విజయ్ విధానాలుచాలానే కనిపిస్తున్నాయి. మొదటి సారి ముఖ్యమంత్రి కావడం, తాను ప్రారంభించిన పార్టీని మొదటి సారి అధికారంలోకి తేవడంతో ఆ ప్రత్యేకత కనిపించేలా గత నెలన్నర రోజుల్లో విజయ్‌చాలా పథకాలే ప్రకటించారు. అదే సమయంలోనిత్యం తన ప్రభుత్వాన్ని కాపాడుకోవలసిరావడం కూడా అనివార్యమైంది.ఒక వంక రాష్ట్రంలో పాతుకుపోయిన డిఎంకె, అన్నాడిఎంకెలు విజయ్‌ని సిఎం పదవి నుంచి తప్పించడానికి యధాశక్తి ప్రయత్నిస్తున్నాయి. ఇటీవలి ఎన్నికల్లో డిఎంకె ఓడిపోవడంతో పాటు అధిపతి అయిన స్టాలిన్ కూడా ఓడిపోవడం ఆ పార్టీ నేతలకు ఎంత మాత్రం మింగుడు పడటం లేదు. దానితో విజయ్ వైపు నుంచి ఏ చిన్న అవకాశం దొరికినా దానిని ఉపయోగించుకోవాలని డిఎంకె చూస్తోంది. స్టాలిన్ తదనుగుణమైన వ్యాఖ్యలు పలుమార్లు చేశారు కూడా.విజయ్ ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గర పడుతున్నాయనీ, రాజకీయఅనుభవం లేని విజయ్ సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపలేడనీ స్టాలిన్ సందర్భం దొరికినప్పుడల్లా బాహాటంగానే విమర్శిస్తున్నారు. దానికి నిదర్శనమా అన్నట్లు విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర ఒకటి గత వారం వెలుగులోకి వచ్చి పెనుసంచలనం సృష్టించింది. టివికె ప్రభుత్వం పడిపోయినట్లే కొన్ని తమిళ పత్రికలు ప్రచారం చేశాయి. గతనాలుగు రోజులుగా తమిళ మీడియా విజయ్‌భవిష్యత్తుపై భిన్న కథనాలను కుప్పతెప్పలుగా వండి వడ్డిస్తున్నాయి. టివికె పార్టీకి చెందిన పదిమంది ఎమ్మెల్యేలకు రూ.35కోట్ల చొప్పున ప్రత్యర్థి వర్గంఎర వేసిందనీ, 'డీల్' దాదాపు ఖరారైన సమయంలో అది బయటపడిందనీ అంటున్నారు. దానితో తమిళరాజకీయం హఠాత్తుగా కొత్త మలుపు తిరిగింది. ఆ పదిమందిలో ఏడుగురు గోడదూకడానికి సిద్ధమయ్యారనీ, ప్లాన్ ప్రకారం జరిగి ఉంటే విజయ్ ప్రభుత్వం కూలిపోయి ఉండేదనీ ప్రచారమవుతోంది. ఆఎత్తుగడను ఇంటెలిజెన్స్ వర్గాలు సకాలంలో గుర్తించడం వల్ల బాగోతం బయటపడింది. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేయడంతో పరిణామాలు మరింత ఆసక్తికరంగా మారాయి. అరెస్టయిన ఆఐదుగురు డిఎంకె మాజీమంత్రి సెంథిల్ బాలాజీ అనుచరులని తేలడంతో కుట్ర ఎక్కడినుండి మొదలయిందో అందరికీ అర్థమైంది. ఓ యూట్యూబర్‌ను కూడా అరెస్టు చేసి పోలీసులు 'ఇంటరాగేట్' చేయడంతో ఇంకా చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. టివికె ఎమ్మెల్యే ఇళయరాజా, మరికొందరు ఎమ్మెల్యేలతో డిఎంకె అధిష్ఠానం నిరంతరం 'టచ్'లో ఉందనీ, అందుకే స్పీకర్‌కు వ్యతిరేకంగా ఓటింగ్‌లో పాల్గొనవలసిందిగా వారిని కోరారనీ తెలుస్తోంది. స్పీకర్ వ్యతిరేక తీర్మానాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని కూల్చాలనే విపక్ష సంకల్పం ఆఖరి దశలోబెడిసికొట్టింది. విజయ్ కూడా 'కొనుగోళ్ల' దారిలోనేవెళ్తున్నారనీ, డిఎంకె, మరికొన్ని పార్టీలలోని ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకొనే పనిలో నిమగ్నమయ్యారనీ అంటున్నారు. కొందరు విపక్ష ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి టివికె నుంచి పోటీ చేయించే వ్యూహం రూపొందించారనీ, అందుకు భారీగా ఖర్చుచేయడానికి కూడా సిద్ధమయ్యారనీ చెబుతున్నారు. ఆ విధంగా సొంతంగా పూర్తి మెజారిటీ సాధించే ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది.అయితే ఉన్నత స్థాయి అధికారులలో అధిక శాతం డిఎంకె మద్దతుదారులు కావడంతో వారిని తన దారిలోకి తెచ్చుకోవడం విజయ్‌కి పెద్ద తలనొప్పిగా ఉన్నదని పార్టీవర్గాలు అంటున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులు ఎన్ని ప్రకటనలు చేసినా క్షేత్రస్థాయిలో వాటినిఅమలు చేసేది అధికార వర్గమే గనుక వారిని తనవైపుతిప్పుకొనడానికి విజయ్ చాలా కష్టపడవలసి వస్తోందనే అంటున్నారు. ఇటువంటి సవాళ్లు పెరుగుతుండగా, గత శుక్రవారం విజయ్ ప్రభుత్వానికి గవర్నర్ తో కూడా ఢీకొనే పరిస్థితి ఎదురుకావడం మరో ఆసక్తికర పరిణామం. గవర్నర్ అర్లేకర్ మదురైలో సీనియర్ అధికారులతో సమీక్ష జరపడం ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. దానిపై మంత్రి నిర్మల్ కుమార్ ఘాటుగా స్పందించడం, మరికొందరు మంత్రులువంతపాడడం ఇప్పుడు ప్రభుత్వాన్ని ఓ కుదుపు కుదుపుతోంది. ప్రభుత్వ విభాగాల పనితీరుపై గవర్నర్ సమీక్ష జరపడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. మంత్రి వన్ని అరసు చేసిన విమర్శలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. సిపిఐ వంటి పార్టీలు కూడా రంగంలోకి దిగడంతో కొత్త వివాదం మరింతగా రాజుకొంటోంది. విజయ్‌కి ఇది నిజంగానే కొత్త తలనొప్పి అనే చెప్పాలి. విజయ్ ప్రభుత్వం ప్రమాణ స్వీకార సమయంలో ముప్పుతిప్పలు పెట్టిన గవర్నర్ ఇప్పుడు కొత్త వివాదానికి కారణమవడం చూస్తే లోక్‌భవన్ నుంచి కూడా విజయ్‌కి ముందుముందు సవాళ్లు ఎదురుకావొచ్చని అర్థమవుతుంది. ఈ రెండో సమరంలో విజయ్ సక్సెస్ కావడం ఆయన వ్యూహరచనపై ఆధారపడి ఉంటుంది. ముందు ముందు సంభవించే పరిణామాలు ఇంకెంత ఆసక్తికరంగా ఉంటాయో దీనిని బట్టే అర్థమవుతోంది. ●

ముఖ్యమంత్రి విజయ్

---

బంగ్లాదేశ్

# మాతృభూమికి 'అవామీ' అధినేత!

**గన్ని మోహన్**

రెండేళ్లుగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్‌మాజీ ప్రధాని షేక్ హాసీనా ఎంతో సాహసోపేతమైన నిర్ణయాన్నే తీసుకున్నారు. ఈ ఏడాదే తాను స్వదేశానికి వెళతానని, బంగ్లా ప్రజల శ్రేయస్సుతోపాటు తన సొంతపార్టీ అవామీ లీగ్ కేడర్ సంరక్షణ కూడా తన బాధ్యత అనిచెపుతున్నారు. చావుకు తాను భయపడేదిలేదని, స్వదేశానికి వెళ్లాలన్నదే తమ అభిమతమని ఈ వారంలో ప్రకటించారు. బంగ్లాదేశ్‌లో కాందిశీకుల రిజర్వేషన్ల నుంచి మొదలైన ఉద్యమంతో ముస్లిం ప్రజానీకం ముస్లిమేతరులు, మైనార్టీలపై దాడులకు పూనుకోవడం, ఆస్తులు విధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఎంత కట్టడి చేసినప్పటికీ హాసీనా హయాంలో ఈ ఉద్యమం పాక్‌ప్రేరేపిత ఉద్యమంగానే ముద్రపడింది. ప్రత్యేకించి భారత్ నుంచి బంగ్లాదేశ్‌ను వేరుచేసే లక్ష్యంతోనేహసీనా ప్రభుత్వాన్ని కూలదోశారన్నది అక్కడి మైనార్టీల వాదన. అంతేకాకుండా అమెరికా పరోక్షంగా తనను పదవీచ్యుతి చేసేందుకు కుట్రలుచేసిందని పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ వల్లెవేసినమాటలనే హసీనా కూడా చెప్పుకొచ్చారు. ఏదైతేనేమిరెండేళ్ల క్రితం నిర్బంధ రాజీనామాతో ఆమె అత్యవసరంగా దేశాన్ని వీడి భారత్‌లో ఆశ్రయంపొందుతున్న సంగతి తెలిసిందే. తదనంతరం వచ్చిన నోబెల్ పురస్కార గ్రహీత మహ్మద్ యూనస్ నేతృత్వంలోని కేర్‌టేకర్ ప్రభుత్వం ఆమెను, ఆమె పార్టీని ఎంతగా ఇబ్బందులు పాలుచేయాలో అంతగాను చేసింది. ఈ రెండేళ్ల కాలంలో హసీనా పార్టీ కేడర్ నాయకులు నిర్బంధాలకు గురయ్యారు. వందలాది మందిని జైలుపాలు చేసారు. పార్టీ కేడర్ ఛిన్నాభిన్నం అయింది. ఈలోపు అనుకోకుండా వచ్చిన ఎన్నికల్లో ఆమె ప్రత్యర్థి పార్టీ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ బిఎన్పీ విజయం సాధించడం మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిక్ అన్వర్ లండన్‌లోని తన ప్రవాసం నుంచి వచ్చి ఎన్నికల్లో పోటీచేసి గెలవడం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం వంటివి చకచకా సాగిపోయాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే హసీనా ఇప్పుడు హఠాత్తుగా తన స్వదేశం వెళతానని తెగేసి ప్రకటించడం వెనుక జరిగిన హఠాత్పరిణామాలేమిటన్న అంశంపైనే ఇప్పుడు ఎక్కువ చర్చలు సాగుతున్నాయి. భారత్ నుంచి ఒత్తిడి పెరుగుతోందా? లేక బంగ్లా ప్రభుత్వం ఆమెను అప్పగించాలని అంతర్జాతీయంగా భారత్‌పై ఒత్తిడిని పెంచుతుందా అన్నది ఒక అంచనా అయితే మరోవైపు అక్కడి స్థానిక ఎన్నికల్లో హసీనా పార్టీ అవామీ లీగ్‌కు పట్టు పెరుగుతున్నదని తెలుస్తోంది.దీనికితోడు నిషేధం ఉన్నప్పటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆమె పార్టీ రివ్వున ఎగిసి పడుతోంది. స్థానిక ఎన్నికల్లో మంచి పట్టుకూడా వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా తారిక్ రెహమాన్ ప్రభుత్వం అవామీ లీగ్ పార్టీని స్థానిక ఎన్నికల్లో పోటీకి అనుమతించింది.అయితే వారు పార్టీ గుర్తుపై కాకుండా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేయాలని షరతులు విధించింది. బంగ్లాదేశ్ ప్రజలకున్న రాజకీయ హక్కులు, దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ, శాంతి భద్రతలు, విముక్తి పోరాటం స్ఫూర్తిని కొనసాగించేందుకే తాను బంగ్లాదేశ్‌కు తక్షణమే వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు బాహాటంగానే హసీనావైఖరి ఉత్కంఠ కలిగిస్తోంది. యూనస్ సర్కార్ హయాంలో మానవాళిపై ఆమె పార్టీ ప్రభుత్వం హయాంలో నిర్వహించిన నేరాలకు సంబంధించి ఆమెకు మరణశిక్ష విధించిన వైనాన్ని అటు బిఎన్‌పి, ఇటు జమాత్ ఇస్లామి పార్టీలు ఆమెను హెచ్చరిస్తున్నాయి. వీటికితోడు అనేక కేసులు ఆమెపై కోర్టుల్లో విచారణకు సిద్ధంగా ఉన్నాయి. వీటిపై స్పందించిన హసీనా 1975లోనే నా తల్లితండ్రులు, సోదరులు ఇంచుమించు మొత్తం కుటుంబాన్ని పోగొట్టుకున్నానని, తనపై హత్యాయత్నాలు కూడా జరిగాయని ఆమె గుర్తుచేసారు. తనను అంతం చేసేందుకు అనేక కుట్రలు జరిగాయని, ప్రతి కుట్రను భగ్నం చేసామని ఆమె చెపుతున్నారు. బంగ్లాదేశ్ ప్రజలవైపు తాను ఉన్నందువల్లనే వారి ఆశీస్సులే తనను రక్షించాయని చెపుతున్న హసీనా ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో తన పార్టీ కేడర్ పోటీ చేసేవిధంగా వారిలో మరింత నైతిక స్థైర్యం నింపేందుకే బంగ్లాదేశ్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బిఎన్‌పి సర్కారు, యూనస్ కేర్‌టేకర్ సర్కారుపై ఆమె లెక్కలేనన్ని విమర్శలుచేసారు. ఇన్నీ ఆమె చెప్పేందుకు సజావుగానే ఉన్నప్పటికీ బంగ్లాదేశ్‌లో కాలుపెట్టిన వెంటనే ఆమెను అరెస్టు చేయకుండా ఉంటారా? పెండింగ్ కేసులను విచారణ షురూ చేయకపోతారా అన్నదే ఇప్పుడు ఆమె కేడర్‌లో నలుగుతున్న ప్రధాన చర్చ. అన్నింటికంటే ప్రధానంగా అత్యున్నత న్యాయస్థానం యూనస్ హయాంలో ఆమెకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ కేసు ఇప్పుడు ఎటువెళుతుంది. తారిక్ అన్వర్ ప్రభుత్వం ఈకేసులను కొట్టివేస్తుందా? అంతర్జాతీయ సమాజం తారిక్ సర్కార్‌పై ఒత్తిడి పెంచుతుందా? అన్నదే తేలాల్సి ఉంది. అటు చైనా, ఇటు పాకిస్థాన్‌లవైపే మొగ్గుచూపిస్తున్న తారిక్ అన్వర్ ప్రభుత్వ ధోరణులు చూస్తుంటే చైనా చెప్పినట్లు చేసేందుకు తారిక్ అన్వర్ ప్రభుత్వం తలూపుతున్నదనే భావన రాజకీయ నిపుణుల్లో వ్యక్తం అవుతోంది. అదే జరిగితే భారత్ ఉపేక్షించే పరిస్థితులు ఎంతమాత్రం ఉండవు. తారిక్ అన్వర్ ప్రభుత్వం అంతర్జాతీయంగా తమపై ఒత్తిడి పెంచేందుకే హసీనా వ్యూహాత్మక జిమ్మిక్కులకు పాల్పడుతున్నట్లు చెప్పుకొచ్చినా హసీనా బంగ్లాదేశ్‌లో తిరిగి కాలుమోపడం మాత్రం ఖాయం అన్నది ఖరారయిపోయింది. అపుడు బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్‌పార్టీ నేతలు, కేడర్‌కు కొత్త చైతన్యం వచ్చినట్లవుతుంది. అయితే నిషేధం కొనసాగుతున్న తరుణంలో హసీనా బంగ్లాదేశ్‌కు వెళ్లి ఎలా నెగ్గుకు రాగలరన్నదే ఇప్పుడు అంతుబట్టని ప్రశ్న.అలాగే శిక్షలు పడిన కేసులనుంచి ఆమె ఎలా తప్పించుకోగలరన్నదే మిలియన్‌డాలర్ల ప్రశ్నగా మారుతోంది. ●

షేక్ హాసీనా

---

# ఐరోపా హీట్ డోమ్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తాజా హెచ్చరిక

**డి జె మోహన రావు**

ఐరోపాను కమ్మేసిన ఈ అసాధారణ వేడి మరో సాధారణ వేసవి కాదు. వాతావరణ మార్పు ఇకపై పర్యావరణ సమస్య మాత్రమే కాదని, అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ వాణిజ్యం, ప్రజారోగ్యం, వలసలు, భద్రతను ఒకేసారి ప్రభావితం చేసే సంక్షోభంగా మారిందని ఈ హీట్‌డోమ్ స్పష్టం చేస్తోంది. ఐరోపా ప్రస్తుతం తన ఆధునిక చరిత్రలోనే అత్యంత తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటోంది. సాధారణంగా ఆహ్లాదకరమైన వేసవులకు పేరుగాంచిన స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, హంగేరీ వంటి దేశాల్లో జూన్, జులై నెలల్లోనే ఉష్ణోగ్రతలు 40నుంచి 45డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. ఈ అసాధారణ పరిస్థితికి కేంద్రబిందువుగా నిలిచింది హీట్ డోమ్ అనే వాతావరణ వ్యవస్థ. శాస్త్రీయంగా చూస్తే హీట్ డోమ్ అనేది ఒక ప్రాంతంపై బలమైన అధిక పీడన వ్యవస్థ చాలా రోజుల పాటు స్థిరంగా కొనసాగడం వల్ల ఏర్పడే పరిస్థితి. ఈ అధిక పీడన మండలం ఒక మూతలా పనిచేసి భూమి నుంచి పైకి వెళ్లే వేడి గాలిని బయటకు వెళ్లనివ్వదు. బదులుగా ఆ గాలిని మళ్లీ కిందికి నొక్కడం వల్ల వేడి నిరంతరం పేరుకుపోయి ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతాయి. అదే సమయంలో మేఘాల అభివృద్ధి, వర్షపాతం కూడా అణచివేయబడతాయి. సహారా ఎడారి నుంచి వచ్చే వేడి గాలులు చేరితే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. ఇలాంటి హీట్ డోమ్‌లు ఏర్పడటానికి ఎగువ వాయుమండలంలో ఏర్పడే ఒమేగా బ్లాక్ అనే స్థిరమైన గాలి ప్రవాహ నమూనా కూడా ప్రధాన కారణాల్లో ఒకటిగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈప్రభావం పగటి పూటకే పరిమితం కావడం లేదు. అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 20డిగ్రీల సెల్సియస్ కంటే దిగువకు పడిపోకపోవడంతో ట్రాపికల్ నైట్స్ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అంటే సూర్యాస్తమయం తర్వాత కూడా చల్లదనం లేకుండా ఉక్కపోత కొనసాగుతోంది. ప్రపంచ సగటుతో పోలిస్తే ఐరోపా దాదాపు రెండు రెట్లు వేగంగా వేడెక్కుతోంది. అందువల్ల ఇలాంటి తీవ్ర ఉష్ణోగ్రత ఘటనలు మరింత తరచుగా, మరింత తీవ్రంగా నమోదవుతున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఐరోపాలో ఈపరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారడానికి అక్కడి భౌగోళిక పరిస్థితులు, మౌలిక సదుపాయాలే ఒక కారణం. అక్కడి భవనాలు తీవ్రమైన చలిని తట్టుకునేలా నిర్మించబడటంతో వేసవిలో వేడిని బయటకు పంపకుండా లోపలే నిల్వ చేస్తాయి. పగటిపూట రహదారులు, కాంక్రీటు నిర్మాణాలు, పట్టణ ప్రాంతాలు గ్రహించిన వేడిని రాత్రిపూట కూడా విడుదల చేస్తుంటాయి. ఫలితంగా ప్రజలకు ఉపశమనం లభించడంలేదు. వృద్ధులు, చిన్నపిల్లలు, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నవారిపై దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. తీవ్ర ఉష్ణోగ్రతలు అదనపు మరణాల ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతున్నాయని ప్రజారోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పుల మరో కీలక ప్రభావం క్లైమేట్ మైగ్రేషన్. ఉత్తర ఆఫ్రికా, మధ్య ప్రాచ్యదేశాల్లో తీవ్రమైన వేడి, నీటి కొరత, వ్యవసాయ సంక్షోభం మరింత పెరిగితే లక్షలాది మంది ఐరోపావైపు వలస వెళ్లేపరిస్థితులు ఏర్పడవచ్చు.ఇది ఇప్పటికే సవాలుగా మారిన వలస సమస్యను మరింత తీవ్రతరం చేయడంతో పాటు రాజకీయ, సామాజిక, భద్రతాపరమైన ఒత్తిడిని పెంచే అవకాశంఉంది. ఆర్థికంగా కూడా ఈ ప్రభావం తీవ్రమైనదే. దీర్ఘకాలం కొనసాగే హీట్‌డోమ్ నిర్మాణ, తయారీ, బహిరంగ పనుల రంగాల్లో ఉత్పాదకతను గణనీయంగా తగ్గిస్తుంది. కరువు పరిస్థితులు ఏర్పడితే రైన్, డాన్యూబ్ వంటి ప్రధాననదుల్లో నీటి మట్టాలు తగ్గి జలరవాణాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో రవాణా వ్యయాలు పెరిగి పరిశ్రమలపై ప్రభావం పడుతుంది. వ్యవసాయ దిగుబడులు తగ్గి ఆహార భద్రతపై ఒత్తిడి పెరుగుతుంది. శీతలీకరణ అవసరాలు పెరగడంతో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వేడికి రైల్వేపట్టాలు వంగిపోవడం, అడవుల్లో కార్చిచ్చులు చెలరేగడంవల్ల రవాణా, పర్యాటక రంగాలు కూడా దెబ్బతింటున్నాయి. ఇది ఇక ఐరోపాకు మాత్రమే పరిమితమైన వాతావరణ ఘటన కాదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రత, అంతర్జాతీయ వాణిజ్యం, సరఫరా గొలుసులపై ప్రభావం చూపుతున్న ప్రపంచస్థాయి సవాలుగా మారింది. ఐరోపాలో పారిశ్రామిక ఉత్పత్తి మందగిస్తే రసాయనాలు, యంత్రాలు, ఆటోమొబైల్ విడిభాగాల ప్రపంచ సరఫరా దెబ్బతింటుంది. గోధుమలు, ఆలివ్ ఆయిల్, వైన్ వంటి వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు తగ్గడం ప్రపంచ ఆహార ధరలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఐరోపా సమాఖ్య భారత్‌కు మూడో అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. 2025లో ఇరుపక్షాల మధ్య వస్తువుల వాణిజ్య విలువ సుమారు12.74 లక్షల కోట్లకు చేరింది. అందువల్ల అక్కడి వాతావరణ సంక్షోభం భారత్‌పై కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఐరోపాలో పారిశ్రామిక ఉత్పత్తి, వినియోగం మందగిస్తే భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే వస్త్రాలు ఇంజినీరింగ్ ఉత్పత్తులు, రసాయనాలు, ఆటోమొబైల్ విడి భాగాలు, రత్నాలు, ఆభరణాలకు డిమాండ్ తగ్గవచ్చు.నౌకాశ్రయాలు, అంతర్గత జల మార్గాలు, రైల్వేలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు ఏర్పడితే భారత ఎగుమతులు ఆలస్యమవడంతో పాటు రవాణా వ్యయాలు పెరిగి ఎగుమతిదారుల పోటీతత్వం దెబ్బ తినే అవకాశంఉంది. అయితే ఈ సంక్షోభం కొన్ని అవకాశాలను కూడా సృష్టిస్తుంది. ఐరోపాలో వ్యవసాయ దిగుబడులు తగ్గితే ఆహార దిగుమతుల అవసరం పెరుగుతుంది. దీనిని భారత్ వ్యవసాయ ఉత్పత్తులు, సముద్ర ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులను విస్తరించుకునే అవకాశంగా మలుచుకోవచ్చు. అయితే ఇందుకు ఐరోపా నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు, ఆహార భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. మరోవైపు, తక్కువ కార్బన్ ఉద్గారాలతో తయారైన ఉత్పత్తులకు ఐరోపా మరింత ప్రాధాన్యం ఇస్తోంది. ఇందుకోసం కార్బన్‌బోర్డర్ అడ్జస్ట్మెంట్ మెకానిజం అమలు చేస్తోంది. అధిక కార్బన్ ఉద్గారాలతో తయారైన దిగుమతి ఉత్పత్తులపై అదనపు కార్బన్ వ్యయాన్ని విధించే ఈ విధానం వల్ల భారతీయ ఉక్కు, అల్యూమినియం, సిమెంట్ వంటి ఉత్పత్తుల ఎగుమతుల వ్యయం పెరిగే అవకాశంఉంది. అందు వల్ల భారత పరిశ్రమలు గ్రీన్‌టెక్నాలజీ, ఇంధన సామర్థ్యం, తక్కువకార్బన్ ఉత్పత్తి విధానాల వైపు వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. ఈ కోణంలో చూస్తే, ఐరోపా హీట్ డోమ్ భారత్‌కు ఒక హెచ్చరిక మాత్రమే కాదు, గ్రీన్ తయారీ ద్వారా ప్రపంచ మార్కెట్లో కొత్త అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తోంది. హీట్ డోమ్‌లు సాధారణంగా వాతావరణ ప్రసరణలో మార్పులు వచ్చిన తర్వాతే బలహీనపడతాయి. 2003, 2022, 2023 హీట్‌వేవ్‌ల నుంచి పాఠాలు నేర్చుకున్న ఐరోపా దేశాలు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, కూలింగ్ సెంటర్లు, హీట్ యాక్షన్ ప్లాన్‌లు, ప్రజారోగ్య చర్యలను బలోపేతం చేశాయి. అయినప్పటికీ, గ్లోబల్‌వార్మింగ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఇటువంటి తీవ్రమైన ఉష్ణోగ్రత ఘటనలు మరింత తరచుగా, మరింత కాలం కొనసాగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఐరోపాలో కనిపిస్తున్న ఈ హీట్ డోమ్ ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. వాతావరణ మార్పును ఇకపై పర్యావరణ సమస్యగా మాత్రమే చూడలేం. ఇది ప్రపంచ ఆర్థికవ్యవస్థ, ఆహార భద్రత, ఇంధన విధానం, అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులు, వలసలు, జాతీయ భద్రతలను ఒకేసారి ప్రభావితం చేసే బహుముఖ సంక్షోభంగా మారింది. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడం, వాతావరణ అనుకూల మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెంచడం, దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం ఇకపై ఒక ఎంపిక కాదు. ప్రపంచ భవిష్యత్తుకు అత్యవసర అవసరం. ●

# కిట్స్ లో సందడి చేసిన చెన్నై లవ్ స్టోరీ చిత్ర యూనిట్..

ప్రతిపాడు (వట్టిచెరుకూరు), జూలై 4, ప్రభాతవార్త : మాస్ మూవీ మేకర్స్, అమృత ప్రొడక్షన్స్ బ్యానర్ పై శ్రీనివాస్ కుమార్(ఎస్ కెఎన్), సాయి రాజేష్ నిర్మిస్తున్న ఈ చిత్ర యూనిట్ మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సందడి చేసింది . చెన్నై లవ్ స్టోరీ చిత్రం ఈ మాసంలో విడుదల కానున్న తెలుగు రొమాంటిక్ డ్రామా చిత్రమని కిట్స్ కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ చిత్రం ఈనెల 24వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుందని, ఈ సందర్భంగా చిత్ర యూనిట్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల , విద్యార్థుల సమక్షంలో చిత్ర యూనిట్ సందడి చేసిందన్నారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ కళాశాల యాజమాన్యం వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హీరో కిరణ్ అబ్బవరం హీరో కావాలని ఎన్నో ఏళ్ల పాటు కష్టపడ్డానని, ప్రేక్షకులందరూ తనను ఆశీర్వదించాలని అభినవ కిరణ్ కోరారు. ఇంజనీరింగ్ విద్యార్థుల కేరింతల నడుమ హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ రెడ్డి సినిమాలో కొన్ని డైలాగులు చెప్పింది. ఈ చిత్రాన్ని బేబీ చిత్ర దర్శకులు ఎస్కెయం, సాయి రాజేష్ లు నిర్మిస్తున్నట్లు హీరో తెలిపారు. ఈ చిత్రం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఆకట్టుకుంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమాలో ఓ పాటకు హీరో, హీరోయిన్లు స్టెప్పులు వేసి అలరించారు. మూవీ ప్రొడ్యూసర్ ఎస్కెఎన్ మరియు ధీరజ్, హీరోయిన్ గౌరి ప్రియ రెడ్డి మాట్లాడుతూ..తొలిప్రేమ గొప్పదే కానీ, అదే జీవితం కాదనే కోణంలో వాస్తవిక ప్రేమను ప్రతిబింబించేలా ఈ కథ ఉంటుందని వెల్లడించారు. హీరోయిన్ తొలిప్రేమను దైవంగా భావిస్తే, హీరో దానికి భిన్నమైన అభిప్రాయాన్ని కలిగి ఉంటాడని వారు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. బాబు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, వివిధ శాఖల హెచ్ఓడీలు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

I AM THE CULT
SLOW MORNING

## అరుదైన కేసుల చికిత్సలకి బా(ద్)షా...

### అనతి కాలంలోనే ఇరవై వేల ఎండోస్కోపీలు చేసిన వైద్యుడిగా రికార్డ్...

గుంటూరు మెడికల్, జూలై4(ప్రభాత వార్త ): అయన ప్రభుత్వ వైద్యుడుగా పేదలు వేల సంఖ్యలో వచ్చే సమగ్ర సర్వజన ప్రభుత్వ వైద్యాశాలలో అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తెస్తూ.. మరెక్కడా జరగని చికిత్సలను అరుదైనా శస్త్ర చికిత్సల చేస్తూ ప్రజల మనలను పొందుతున్నారు గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగూర్ భాషా . అత్యంత క్లిష్టమైన రోగాలను సైతం అత్యాధునిక పద్ధతిలో తగ్గిస్తూ. ఇరవై వేల పైచిలుకు ఎండోస్కోపీలతో గుంటూరులోనే మొట్ట మొదటి వైద్యుడిగా రికార్డ్ సృష్టించిప్రముఖ వైద్యులకు పోటీగా నిలుస్తున్నడు ఈ ప్రభుత్వ వైద్యుడు.జిజిహెచ్ కి వచ్చిన అనేక అరుదైన కేసులలో 6నెలల చిన్నారి కాయిన్ మింగడముతో మత్తు లేకుండా తొలగించుట, రక్తపు వాంతులకి నివారణ, కోత , కుట్లు లేకుండా గాలిబ్లాడర్ నుండి రాళ్ల తొలగింపు ఇలా అనేక అరుదైన శస్త్ర చికిత్సలను ఎండోస్కోపీ ద్వారా గుర్తించి సత్వరమే వైద్యం అందిస్తు ప్రభుత్వ వైద్యశాలలో పేదలకి అండగానిలుస్తున్నారు ఈ సహాయక ఆచార్యులు నాగూర్ భాష. పేదల వైద్యులు నాగూర్ భాషా సేవలపై వార్త ప్రత్యేక కదనం..

**పేద రోగులకి ప్రభుత్వ ఉచిత సేవలు**

సాధారణ మధ్యతరగతి కుటుంబ నేపథ్యంలో వైద్య వృత్తిలోకి రావడంతో వైద్యం కోసం వచ్చే పేదలకి సేవలు అందిచడములో ముందుంటారు.2020లో ప్రభుత్వ సర్వీస్ లోకి వచ్చిన నాగూర్ బాషా అతితక్కువ సమయంలోనే ఎంతో మందికి రోగాలని నయం చేస్తూ ప్రజలమన్ననలుపొందుతున్నారు.జిజిహెచ్ కి వచ్చే అరుదైన నయం కానీ రోగాలని కూడా తన నైపుణ్యంతో తగ్గిస్తు పేదల డాక్టర్ గా నిలుస్తున్నారు..

**రోగాన్ని గుర్తించడంలో దిట్ట..** అంతుబట్టని జీర్ణకోస వ్యాధులతో జిజిహెచ్ కి వచ్చే రోగుల ఇబ్బందిని గుర్తించడములో దిట్టగా అందరి మన్ననలు పెందుతున్నారు నాగూర్ బాషా. ఎండోస్కోపి చేయడముతోనే రోగానికి అవసరమైన చికిత్స చేస్తూ తక్కువ సమయంలోనే రోగి నయం చేసేలా చికిత్స అందిస్తున్నారు. మచ్చ లేకుండా లాప్రోస్కోపి సర్జరీలు నిర్వహిస్తూ అత్యాధునిక చికిత్సలు చేయడంలో రోగుల మన్ననలు పొందుతున్నారు.కార్పొరేట్,ఎంతో ప్రావీణ్యం ఉన్న సీనియర్ డాక్టర్స్ చేయలేని చికిత్సలు చేయడంతో ప్రభుత్వ ఆసుపత్రి సేవలపై ప్రజలకి నమ్మకాన్ని కల్పిస్తున్నారు.

**పేదలకి ఉత్తమ సేవలకి అవార్డు..** పేదలకి వైద్య సేవలు అందిచడమే కాకుండా ప్రభుత్వ సమగ్ర సర్వజన వైద్యాశాలలో ఆధునిక ఆదునాతన శస్త్ర చికిత్సలు చేయడంతో గ్యాస్ట్రో ఎంటరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. నాగూర్ భాష ఎన్నో విశిష్ట పురస్కారాలు పొందారు. కేవలం 4ఏళ్ళ కాలంలోనే రిపబ్లిక్ డే సందర్బంగా ఉత్తమ వైద్యులుగా జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి నుండి ప్రతిభ పురస్కారం పొందారు.వైద్య రంగములో విశిష్ట సేవలకి ఇచ్చే భూషణ్ అవార్డులని, అదే విధముగా వివిధ హెల్త్ టైమ్ అవార్డు ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నుంచి అందుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు, సేవాసంస్థల పురస్కారాలు రావడం జరిగింది.

## ఏఎన్‌యు పీజీ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై4, ప్రభాతవార్త: ఏఎన్‌యు పరిధిలో 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సిఇ ఎ.వెంకటేశ్వర్లు శనివారం విడుదల చేశారు. ఎంఏ ఆర్కియాలజీలో 19కి 18మంది, ఎంఏ లింగ్విస్టిక్స్‌లో 5కు 5, ఎంఏ హిస్టరీలో 24కు 24మంది, ఎంఏ జర్నలిజంలో 8కి 8మంది, ఎంఏ మహాయాన బుద్దిస్ట్ స్టడీస్‌లో 9కి 9, ఎంఏ ఉర్దూలో 13కి 12మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 17లోగా ఒక్కో పేపర్‌కు రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2190లను చెల్లించి దరకాస్తులు చేసుకోవచ్చునని వివరించారు.

**6 నుంచి ప్రీ-పీహెచ్‌డి పరీక్షలు**

ఏఎన్‌యులో పీహెచ్‌డి కోర్సులు చేస్తున్న పరిశోధకులకు ఈనెల 6నుంచి ఎంఫిల్ పార్ట్-1, ప్రీ పీహెచ్‌డి పరీక్షలు జరుగనున్నాయి.ఈ మేరకు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఆచార్య పి.సుధాకర్ ఏర్పాట్లు చేశారు. 6, 7, 8తేదీలలో ఉదయం 10.30 నుంచి మద్యాహ్నం 1.30 వరకు థియరీ పరీక్షలు, 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సెమినార్ పేపర్ నిర్వహించాలని షెడ్యూల్ ఇచ్చారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

పొన్నూరు, జూలై 4,ప్రభాతవార్త: మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్ల వీర కిశోరం అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఏఐటియుసి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పలువురు నాయకులు పాల్గొని అల్లూరి సేవలను కొనియాడారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ పిచ్చయ్య, అడపా వీర రాఘవయ్య, ఆరేటి రామారావు, ఎం నరసింహ్, జి.నాని, బొద్దు పద్మారావు, ఆర్.భాస్కరరావు, నాని, చిరంజీవి, ప్రసాద్, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ షిరిడి సాయిబాబా మందిరం అధ్యక్షుడిగా చక్కా

పొన్నూరు, జూలై 4,ప్రభాతవార్త: జీబీసి రోడ్డు, తెలగపాలెంలో వేంచేసియున్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో ఏకగ్రీవంగా సాయి భక్తుడు చక్కా శ్రీనివాసరావును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలుగా తోట పార్వతి, డైరెక్టర్‌గా యక్కటి హనుమాన్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కొండపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శిగా యరసాని సరిత, సహాయ కార్యదర్శిగా పసుపులేటి వేణు, కోశాధికారిగా తాళ్ళూరి ఉష, సభ్యులుగా బడే పద్మజ, తోట అంకమ్మరావు, తోట ఆదినారాయణ, శెట్టి లింగేశ్వరరావు, ఆకుల ప్రసాదు, కొత్తమాసు సుధ, షేక్ బాబావలితోపాటు గౌరవ సలహాదారుగా ఈఎస్ఎస్ బాలాజీకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చక్కా శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులందరి సహాయ సహకాలు, సలహాలతో నాపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని చెప్పారు. శ్రీ షిరిడి సాయిబాబా వారికి జరగాల్సిన కార్యక్రమాలన్నింటిని సక్రమంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. షిరిడి సాయినాథునికి జరగాల్సిన అన్ని కార్యక్రమాలకు దాతలు, భక్తులు ముందుకు వచ్చి సహకరించాలన్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు షిరిడి సాయిబాబా భక్తులు అభినందించారు.

# గుంటూరు వార్త

## సృజనాత్మక అభివృద్ధికి ప్రోత్సాహం

### కిట్స్.. చైర్మన్ డాక్టర్ సుబ్బారావు.

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 4, ప్రభాతవార్త: మా కళాశాల నందు స్ట్రాంగ్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం ఉన్నదని, ప్రతి విద్యార్థికి కొత్త ఆలోచన చేయడానికి, ప్రయోగాలు చేపట్టడానికి, సృజనాత్మకతను అభివృద్ధి చేయడానికి పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందిస్తున్నట్లు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు తెలిపారు. మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజుల నుండి జరుగుతున్న మొబైల్ యాప్ డెవలప్మెంట్ నైపుణ్యాలను పెంపొందించడం మరియు సృజనాత్మకతను ప్రోత్సహించడం లక్ష్యంగా మూడు రోజులు హైదరాబాదుకు చెందిన ఫ్లట్టర్ హేకథాన్ శివ అండ్ టీం, టెక్నో ఫీచర్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాదుకు చెందిన హైర్ ఐడి యుఎస్ బేస్డ్ కంపెనీ సిటిఓ అక్షయ్ కుమార్, ఎంఎల్ ఇంజనీర్ లోహియా ఇంటెలిజెంట్ టెక్నాలజీ ప్రతినిధి భానుప్రకాష్ పాల్గొని జూరీ మెంబర్స్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 30 జట్లు పాల్గొనగా, అందులో ఐదు బెస్ట్ థీమ్స్ గా ఎంపికైనట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన జట్టుకు రూ.12వేలు నగదు బహుమతి ఇవ్వడం జరిగింది. అందులో మొదటి బహుమతి రూ. ఐదు వేలు, సివిల్ సర్వీసెస్ ప్రొవైడర్ ఆప్ కు, రెండవ ప్రైజ్ రూ.4వేలు బోటిక్ కష్టమైజేషన్ ఆప్ కు మరియు మూడవ బహుమతి రూ.3వేలు గవర్నమెంట్ ఆఫీస్ డాక్యుమెంటేషన్ అప్లికేషన్ యాప్ కు ఇవ్వడం జరిగినది. కళాశాల సెక్రటరీ శ్రీ కోయ శేఖర్ మాట్లాడుతూ..ఇన్నోవేషన్స్ తరానికి అత్యంత శక్తివంతమైన ఆయుధమని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు డైరెక్టర్ డాక్టర్ హరిబాబు, ఆరంభం ఐటి హెచ్ఓడి ఎంఎస్ఎస్ సాయి, మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

36 hours
Hackathon on
Mobile App Development
Using Flutter
by

## "స్వేచ్ఛా సమర జ్వాలను రగిలించిన మన్యం వీరుడు అల్లూరి తదితర ప్రముఖులకు ఘన నివాళులు.

పెదనందిపాడు జులై 4 (ప్రభాతవార్త) భారతదేశ స్వాతంత్రోద్యమములో ముఖ్య పాత్ర వహించి, నాదేశం, నా ప్రజలు అంటూ 27 ఏళ్ల వయసులోనే మాతృ భూమి విముక్తి కోసం ప్రాణ త్యాగం చేసిన మన్యం వీరుడు మరియు విప్లవ జ్యోతి శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భముగా శనివారం పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లో అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. గుర్రం వీర రాఘవయ్య అధ్యక్షత వహించగా, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్స్ డాక్టర్.జి. హనుమంతరావు డి. గీతా లక్ష్మి కె. శ్రీనివాస్ మూర్తి సి.ఎల్.ఎస్ రెడ్డి జి.వి.డి.ఎస్ ప్రసాద్ డి.రాజేష్ కుమార్ ఎ. శ్రీనివాసరావు జె. శరత్ కుమార్, నందిపాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లూరి సత్యనారాయణ అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భముగా కళాశాల ప్రిన్సిపాల్ వీర రాఘవయ్య మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో భారత దేశ విశిష్టతను వివరిస్తూ మన భారతదేశానికి ఎన్నో వేల సంవత్సరాల చరిత్ర కలదని, ఎందరో పరాయి పాలనలు సవిచూచినను "ప్రాథమిక భారతీయత యొక్క అస్తిత్వాన్ని కోల్పోకుండా మనుగడ సాధించిందని. భారతదేశాన్ని మొగలులు . బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ 1757 ప్లాసీ యుద్ధం తరువాత క్రమంగా భారత దేశం పై ఆధిపత్యం సాధించి 1773 నుండి 1858 మధ్య ప్రధాన పరిపాలనా కొనసాగించిందన్నారు. బ్రిటీష్ రాజ్ లు 1858 నుండి 1947 ఆగష్టు 15 వరకు పరిపాలించారు, ఈ కాలాన్ని బ్రిటీష్ క్రౌన్ పాలన అని పిలిచారు. అనగా భారత దేశాన్ని 190 సంవత్సరాల పాటు బ్రిటీష్ వారు పరిపాలించారు. ఆ సమయంలో వారు కొన్ని ముఖ్య సామంత రాజ్యాల రాజులతో కలిసి భారతీయులను అణగద్రొక్కినారు. ఆ సమయంలో మన భారతీయులు స్వాతంత్ర్యం కొరకు ఎన్నో ఉద్యమాలను నడిపినారు, మరెందరో ప్రాణాలర్పించారు. స్వాతంత్రోద్యములో అతివాద నాయకుడిగా బ్రిటీష్ వారిని ఎదిరించి తన 27 వ ఏట దేశం కొరకు ప్రాణ త్యాగం చేసిన శ్రీ అల్లూరి సీతారామరాజు ఒక గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. అల్లూరి సీతారామరాజు 1897 జూలై 4న నాటి విశాఖపట్నం జిల్లాలోని పండ్రంగి గ్రామంలో జన్మించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజనుల హక్కుల కోసం పోరాడిన గొప్ప విప్లవ నాయకుడు. బ్రిటీష్ ప్రభుత్వం అమలు చేసిన అటవీ చట్టాల వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించి, వారి తరఫున పోరాటాన్ని ప్రారంభించారు. భారతదేశానికి రెండు పర్యాయాలు తాత్కాలిక ప్రధాన మంత్రిగా పనిచేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు మరియు ఆర్థిక సంస్కరణల రూపకర్త శ్రీ గుల్జారీలాల్ నందా జయంతి సందర్భముగా వారికి కళాశాలలో ఘన నివాళులర్పించడం జరిగినది. ఇదే కాక ఈ రోజు యువతకు స్ఫూర్తి ప్రదాత, భారత ఆధ్యాత్మిక దూత శ్రీ స్వామి వివేకానంద (నరేంద్రనాథ్ దత్త) వర్ధంతి సందర్భముగా వారి గురించి విద్యార్థులకు వివరిస్తూ యువతలో ఆత్మవిశ్వాసం, సేవాభావం, దేశభక్తిని పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి అపూర్వమైనది. "లేచి నిలబడండి, లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించవద్దు" అనే ఆయన సందేశం నేటికీ కోట్లాది యువతకు స్ఫూర్తినిస్తుంది తెలుపుతూ వారికి ఘనంగా నివాళులర్పించారు. మరో సంఘటనలో భాగంగా ఈ రోజు భారతదేశ చరిత్రలో మరొక విశేషం మన జాతీయ రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతి అని వారు ప్రముఖ దేశ భక్తుడు, వ్యవసాయ శాస్త్రవేత్త, భూగర్భ శాస్త్రవేత్త అని తెలియజేస్తూ వారు రూపొందించిన భారత త్రివర్ణ పతాకంలో కాషాయం ధైర్యానికి. తెలుపు శాంతికి. ఆకుపచ్చ అభివృద్ధికి మధ్యలో అశోక చక్రం ధర్మానికి ప్రతీకగా నిలిచాయని తెలియజేస్తూ వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.ఈ కార్యక్రమాల్లో కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది. నంది పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జూన్ 4,ప్రభాతవార్త :గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా విద్యుత్ శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖ అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ప్రతి వర్షాకాలంలో చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లకు తగలడం వల్ల విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని, సమస్య వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రమాదకరంగా ఉన్న చెట్లు, కొమ్మలను గుర్తించి తొలగించేలా విద్యుత్ శాఖ అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్న చెట్లు, కొమ్మలపై అన్ని ఏఈలు, లైన్‌మెన్లు ప్రత్యేక సర్వే నిర్వహించి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించారు. వర్షాలు, ఈదురుగాలులు వచ్చిన తర్వాత అత్యవసర పరిస్థితుల్లో స్పందించడం కంటే ముందస్తు నివారణ చర్యలే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు.చెట్ల కొమ్మలను కత్తిరించిన తర్వాత వాటి తొలగింపు విషయంలో విద్యుత్ శాఖ, జీఎంసీ మధ్య సమన్వయం లోపించకూడదని స్పష్టం చేశారు. "ఇది మా బాధ్యత కాదు" అంటూ ఒక శాఖ మరో శాఖపై నెపం మోపే పరిస్థితి ఉండకూడదని, ప్రజలకు సమస్యలు తలెత్తకుండా పరస్పర సహకారంతో పని చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు, జీఎంసీ సిబ్బంది కలిసి సమన్వయంతో వ్యవహరిస్తే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని అన్నారు.ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం, వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు.

## సీనియర్ జర్నలిస్టు పుట్టా శ్రీనివాసరావుకు ఘన నివాళులు

మంగళగిరి, జూలై 4, ప్రభాతవార్త: అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు పుట్టా శ్రీనివాసరావు భౌతికకాయాన్ని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మంగళగిరి సాహితి కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు ఘనంగా నివాళులర్పించారు. మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్‌లోని ఆర్.ఆర్. టవర్స్‌లో ఏర్పాటు చేసిన పుట్టా శ్రీనివాసరావు భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ, పుట్టా శ్రీనివాసరావు గత నాలుగు దశాబ్దాలుగా జర్నలిస్టుగా సమాజానికి విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. సామాన్య కుటుంబంలో జన్మించి, కృషి, పట్టుదలతో జర్నలిజంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించారని పేర్కొన్నారు. మానవీయ విలువలను ఆచరిస్తూ, జర్నలిజంతో పాటు సాహితీ, కళారంగాల అభివృద్ధికి విశేషంగా కృషి చేసి అందరి మన్ననలు పొందారని అన్నారు. మంచి స్నేహితుడిగా, సౌమ్య వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొంటూ, వారి మరణం జర్నలిజం, సాహితీ రంగాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధినేత ప్రగడ రాజశేఖర్, మంగళగిరి బుద్ధ విహార వ్యవస్థాపక అధ్యక్షులు రేఖా కృష్ణార్జునరావు, మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు, మంగళగిరి సాహితి కళావేదిక నిర్వాహకులు తాటిపాముల లక్ష్మీ పెరుమాళ్ళు, ఇతర ప్రముఖులు, పాత్రికేయులు, సాహితీ, సామాజిక రంగాలకు చెందిన పలువురు పాల్గొని పుట్టా శ్రీనివాసరావుకు ఘన నివాళులర్పించారు.

## 8న మాజీ వీసిలకు సన్మానం

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై4, ప్రభాతవార్త: ఏఎన్‌యు ఈ ఏడాది 50వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ 50ఏళ్ళ ప్రస్థానంలో అనేక సవాళ్ళను అధిగమించి ప్రత్యేక స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం నాక్ సంస్థ రీఅక్రిడిటేషన్‌లో ఏ ప్లస్ గ్రేడును కేటాయించింది. వర్సిటీ యంత్రాంగం 50ఏళ్ళ గోల్డెన్ జూబ్లీ వేడుకలను విడతల వారీగా అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంది. అందులో భాగంగా మాజీ వీసిలను ఆహ్వానించి సన్మానం చేయనున్నారు. ఈమేరకు వర్సిటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది 5మంది వీసిలను సన్మానించారు. మిగిలిన వారిని కూడా ఆహ్వానించనున్నారు. వీరితో పాటు రెక్టార్, రిజిస్ట్రార్‌లకు కూడా సన్మానం జరుగనుంది.

## అల్లూరి త్యాగస్ఫూర్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి

### ఎమ్మెల్యే రామాంజనేయులు.

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 4, ప్రభాతవార్త : స్వాతంత్ర్య సంగ్రామ విప్లవ జ్యోతి, మన్యం వీరుడు, సాయుధ పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు త్యాగ స్ఫూర్తిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రత్తిపాడు శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రారంభంలో గుంటూరు నా సెంటర్లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..బ్రిటీష్ పాలకుల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు భారత జాతికి స్ఫూర్తి ప్రదాతని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర చరిత్రలో ఆయన చూపిన ధైర్యసాహసాలు, దేశభక్తి, త్యాగనిరతి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. న్యాయం కోసం పోరాడే సంకల్పం, దేశం పట్ల అంకితభావం ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు. బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరిస్తూ వారి ఆశయాలకు అనుగుణంగా సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అల్లూరి ఆశయాలను కొనసాగిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా, డిఏపి పంపిణీ

ప్రతిపాడు (వట్టిచెరుకూరు), జూలై 4, ప్రభాతవార్త : ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా రైతులకు యూరియా, డిఏపి పంపిణీ చేయడం జరుగుతుందని ఆత్మ పిడి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలో శనివారం ఏపిఏ ఐఎంఎస్ యాప్ తో ఎరువులు పంపిణీ కార్యక్రమంపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మ పిడి వెంకటేశ్వరరావు [illegible] మాట్లాడుతూ.. ఏపీఏ ఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా యూరియా మరియు డిఏపి పంపిణి గురించి రైతులకి వివరించారు. రైతులకు యాప్ పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. రైతులు వేసిన పంటలకు అనుగుణంగా ఈఏడాది యూరియా, డిఏపి ఈ యాప్ ద్వారా అందించబడుతుందని తెలియజేశారు. ఎరువుల విక్రయాల క్రమబద్ధీకరణ కోసం మండల టాస్కోఫ్సర్స్ గా తహసిల్దార్,వ్యవసాయాధికారి,ఎంపీడీవో మరియు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బృందంగా ఉంటారని వివరించారు. వ్యవసాయశాఖ ద్వారా ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని వీరు ఎప్పటికప్పుడు సమీక్షిస్తారని పేర్కొన్నారు. 2025లో వేసిన పంట నమోదు కార్యక్రమాన్ని ప్రామాణికంగా తీసుకొని రైతులకు ఎరువులు కేటాయించడం జరుగుతుందన్నారు. రైతుల స్మార్ట్ ఫోన్లకు ఓటిపి వస్తుందని, దానిని వ్యవసాయ సిబ్బందికి తెలియజేస్తే ఏ పంటకు ఎన్ని ఎరువులు వస్తాయో, ఎన్ని దఫాలుగా ఇస్తారో తెలియ జేస్తారని పేర్కొన్నారు. రైతులు ఎరువుల కోసం ఎలాంటి కంగారు పడాల్సిన అవసరం లేదని చెప్పారు. పొలాలు ఉన్న రైతులు రైతు సేవ కేంద్రంలో వివరాలు సరిగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని తెలియచేసారు. పంట, విస్తీర్ణం, రైతు వివరాలు సరి చూసుకున్న తరువాత యూరియా, డిఏపి కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిపిడి తోటకూర శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి సునీత, హార్టికల్చర్ అసిస్టెంట్ కె. రాణి, ఎంపీఈఓ బి.చరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
SME బ్రాంచ్-63655, గ్రాండ్ ఫ్లోర్,
మధువాని అపార్ట్‌మెంట్, చిన్నరావూరు రోడ్డు, తెనాలి, గుంటూరు జిల్లా-522201.

(రూల్ 8(1)) స్వాధీనత ప్రకటన (చర / స్థిరాస్తి కొరకు)

NPA: EB-MSME-TL A/c No. 41896925500

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన బకాయి రూ.60,82,598/- (అక్షరాల అరవై లక్షల ఎనభై రెండు వేల ఐదు వందల తొంభై ఎనిమిది రూపాయలు మాత్రమే) ప్లస్ తేదీ.16-04-2026 నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీతో ఖర్చులు, ఛార్జీలు మొ॥నవి సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా యూనిట్ చిరునామా: M/s RR పేపర్ ఇండస్ట్రీస్, ప్రొప్రైటర్: శ్రీమతి చింతగుంట్ల కీర్తి, భర్త: నాగరాజు, డి నెం.432 B, ఫ్లాట్ నెం.1, 1వ అంతస్తు, ఆటో నగర్, తెనాలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522201. ప్రొప్రయిటర్ కమ్ హామీదారు చిరునామా: శ్రీమతి చింతగుంట్ల కీర్తి, భర్త: నాగరాజు, ప్రొప్రయిటర్: M/S RR పేపర్ ఇండస్ట్రీస్, డి నెం. 1-18, YSR విగ్రహం దగ్గర, అనంతవరం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522301 వార్లను కోరుతూ తేది.16.04.2026 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం, 2002 నందలి రూల్ 8 ప్రకారం దిగువ వివరించిన ఆస్తిని తేది 01.07.2026 న స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీత/హామీదారు & ప్రజానీకమునకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ఋణగ్రహీత/హామీదారు మరియు యావన్మంది సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తితో జరిపే ఏ లావాదేవీలైనా రూ.60,82,598/- ప్లస్ తేది.16-04-2026 నుండి ప్లస్ తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మొ॥నవి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

చరాస్తి వివరములు

Hypothecation of 8 No High-Speed Paper Cup Manufacturing Machine Model "PAPER CUP FORMING MACHINE MODEL-VE 1000 SPEED-90"

తేది : 01.07.2026
ప్రదేశం : తెనాలి

సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# పల్నాడు జిల్లా వార్త

## మెప్పు కాదు... మార్పే లక్ష్యం

### ప్రజానాట్య మండలి మహాసభల సందడి

### -నేటి నుంచి ప్రజానాట్య మండలి కళాజాతర

చిలకలూరిపేట, జూలై 4, ప్రభాతవార్త: తెలుగు నేలపై ప్రజల జీవితాన్ని, వారి పోరాటాలను, సామాజిక మార్పును కళారూపాల ద్వారా పలికించిన ఉద్యమం పేరు ప్రజానాట్య మండలి. కళను కేవలం వినోద సాధనంగా కాకుండా ప్రజా చైతన్యానికి ఆయుధంగా మలిచిన ఈ సాంస్కృతిక ఉద్యమం, మరోసారి పల్నాడు నేలపై తన చారిత్రక అడుగులను ముద్రించేందుకు సిద్ధమైంది. "మెప్పు కాదు... మార్పు కావాలి.. రేపటి కోసర అనే నినాదంతో ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా ద్వితీయ మహాసభలు ఆది, సోమ వారల్లో(జూలై 5, 6 తేదీలో) చిలకలూరిపేటలో వైభవంగా జరగనున్నాయి. సంకల్పమదే.. ప్రజల కోసం కళ.. సామాజిక ప్రగతి కోసం కళ.. అనే ఆదర్శంతో ఆవిర్భవించిన ప్రజానాట్య మండలి, దశాబ్దాలుగా సామాజిక చైతన్యం, ప్రజా పక్షపాతం, సాంస్కృతిక పునర్జీవనం, సామ్రాజ్యవాద-ఫాసిస్టు వ్యతిరేక భావజాలాన్ని కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తోన్న విషయం తెలిసిందే. అదే స్ఫూర్తిని నేటి తరానికి అందించాలనే సంకల్పంతో ఈ మహాసభలను నిర్వహిస్తున్నారు. రెండు వేదికలు... రెండు రోజుల కళోత్సవం మహాసభల తొలిరోజు ఆదివారం చిలకలూరిపేట ఎన్ఆర్‌టీసెంటర్‌లోని చౌదరయ్య కల్యాణ మండపం వేదిక కానుండగా, రెండో రోజు సోమవారం పండరీపురంలోని ఏలూరి సిద్ధయ్య విజ్ఞాన కేంద్రం కార్యక్రమాలకు ఆతిథ్యం ఇవ్వనుంది. తొలి రోజు... ఉదయం 9 గంటలకు ప్రజానాట్య మండలి పతాకావిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం కళారూపాల ప్రదర్శనలు, ప్రారంభోపన్యాసం, లఘు నాటికలు, నృత్యరూపకాలు, కోలాటాలు, డప్పు కళాకారుల ప్రదర్శనలు వరుసగా కొనసాగనున్నాయి. మధ్యాహ్నం ప్రజానాట్య, వేదిక ఆధ్వర్యం లో అనేక కళారూపాలతో ప్రారంభ వేడుకలు యడ్లపాడు నారాయణ స్కూల్, చిలకలూరిపేట చైతన్య ఎలైట్ స్కూల్, నాదెండ్ల కేజీబీవీ, నరసరావుపేట ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జానపద, నృత్య, డప్పు, కోలాట తదితర సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించనున్నారు. కళాసేవకులకు ఘన సత్కారం మహాసభల సందర్భంగా రంగస్థల, సినీ, సాహిత్య రంగాలకు విశేష సేవలందించిన పలువురు ప్రముఖ కళాకారులను ఘనంగా సత్కరించనున్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళారత్న, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సినీ నటుడు శొంఠినేని శివాజీ, ప్రముఖ నాటక విశ్లేషకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, నాటక, సినీ రచయిత బుర్రా సాయిమాధవన్, సినీ దర్శకుడు వి. సముద్రలను సన్మానించనున్నారు. ప్రజాప్రతినిధులు, సాంస్కృతిక ప్రముఖుల సమక్షంలో... వేదిక అధ్యక్షుడు, మహాసభల ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షతన జరిగే ప్రారంభ సభకు జిల్లా కార్యదర్శి టి. పెద్దిరాజు సభా పరిచయం చేయనున్నారు. ముఖ్య అతిధులుగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, గుంటూరు ఎంపీ రాజ్యసభసభ్యులు భాష్యం రామకృష్ణ, మాజీఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ధనలక్ష్మి గ్రూప్స్ డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్‌కుమార్, కౌలురైతుసంఘం రాష్ట్ర నాయకులు వై రాధాకృష్ణ, నాటక రచయిత కె దేవేంద్ర, అనంతవరం కళాపరిషత్ అధ్యక్షులు గుదె పాండురంగారావు, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్‌జేటీవో ఏవీ శివయ్య హాజరు కానున్నారు. కళకు కొత్త తరాన్ని కలిపే ప్రయత్నం ఈ మహాసభల్లో ప్రత్యేక ఆకర్షణగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు భాగస్వామ్యం కానున్నారు. యడ్లపాడు నారాయణ స్కూల్, చిలకలూరిపేట చైతన్య ఎలైట్ స్కూల్, నాదెండ్ల కేజీబీవీ, నరసరావుపేట ఈశ్వర్ ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రదర్శించే సంప్రదాయ జానపద కళారూపాలతో పాటు సమకాలీన సామాజిక అంశాలపై రూపొందించిన నృత్యరూపకాలు, లఘు నాటికలు, డప్పు, కోలాట బృందాల ప్రదర్శనలు ప్రేక్షకులను ఆలోచింపజేసేలా ఉండనున్నాయి. కళను సమాజ మార్పు దిశగా నడిపించాలనే ప్రజానాట్య మండలి లక్ష్యాన్ని ఈ కార్యక్రమాలు ప్రతిబింబించనున్నాయి.

ప్రజా నాట్యమండలి
పల్నాడు జిల్లా (కమిటీ)

డా॥ ముత్తవరపు సురేష్ బాబు
అధ్యక్షులు, వేదిక

ప్రజా నాట్యమండలి మరియు వేదిక
సన్మాన గ్రహీతలు

## అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించిన రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట

చిలకలూరిపేట, జూలై 4, ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం "జైహో అల్లూరి సీతారామరాజు" అంటూ నినాదాలు చేసి ఆయన దేశభక్తి, త్యాగనిరతిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు బోడి రామసుబ్బారావు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య సమరంలో ప్రదర్శించిన వీరత్వం, త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి మానం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు అనుసుమల్లి మోహన్, పూర్వాధ్యక్షులు ఉప్పుటూరి ప్రసాద్, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు, తోటకూర వెంకటనారాయణ, సభ్యులు పానకాల రాంబాబు, ఓపూరి సాంబశివరావు, బైరా కృష్ణ, భాస్కర్, మల్లికార్జునరావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల్లో విప్లవ స్ఫూర్తిని నింపిన అల్లూరికి ఘన నివాళి

చిలకలూరిపేట, జూలై 4, ప్రభాతవార్త: గిరిజనుల్లో విప్లవ స్ఫూర్తి రగిలించేటమేకాకుండా వారిలో ఉన్న మూఢవిశ్వాసాలను తొలగింప చేసి ఉద్యమం వైపు నడిపించిన ధీరుడు అల్లూరి సీతారామరాజు అని నాయకులు కొనియాడారు. అదేవిధంగా భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి అని నాయకులు ఉద్ఘాటించారు. రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కునుకులేకుండా చేసిన సీతారామరాజు.. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేశారని నాయకులు తెలిపారు. గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం పట్టణములోని ఎన్నార్టీ సెంటర్ లోని అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులునివాళు లర్పించారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్, గిరిజన,బిసి నాయకులు కొంద్రముట్ల నాగేశ్వరరావు, పాలపర్తి శ్రీనివాసరావు, బి రాంబాబు నాయక్, పాలపర్తి శివ శ్రీనివాసరావు, డి.గోపీనాయక్, కంచర్ల శ్రీనివాసరావు, ఆర్ నాగు నాయక్, పి లక్ష్మీకాంత్, వి అమర్ సింగ్ నాయక్, చందవరం హరి ప్రసాద్, పాలపర్తి కోటి తో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఇన్నర్ వీల్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

చిలకలూరిపేట, జూలై 4, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాల్ లో ఇన్నర్ వీల్ క్లబు ప్రమాణస్వీకారం అత్యంత వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యులు డాక్టర్ కందిమల జయమ్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు క్లబ్ నూతన అధ్యక్షురాలుగా తోటకూర రామ సీత కార్యదర్శిగా డాక్టర్ కొల్లు భాగ్యమాల అధ్యక్ష కార్యదర్శులుగా ప్రమాణ స్వీకారం చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి డాక్టర్ కందిమల్ల జయమా మాట్లాడుతూ ఇన్నర్ వీక్ల ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు జరిగినాయి అని సభ్యులు ఎంతో ఉత్సాహంగా సేవా కార్యక్రమాలు పాల్గొని క్లబ్బు విధివిధానాలను అనుసరిస్తూ అధ్యక్ష కార్యదర్శులు సారధ్యంలో క్లబ్ చాలా అభివృద్ధి చెందిందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలోనూతన అధ్యక్షురాలు తోటకూర రామ సీ తనూతన కార్యదర్శి డాక్టర్ భాగ్యమాల కొ ల్లమాజీ అధ్యక్షురాలు ఇన్నర్ వీల్ జయలక్ష్మి నార్ని మాజీ కార్యదర్శి చెన్నుపాటి చైత న్యజిల్లా ఐఎస్‌ఓ డాక్టర్ లావు అరు ణడిస్ట్రిక్ట్ ఎడిటర్ మారెళ్ళ ఇందిరా జిల్లా మాజీ చైర్మన్ కోలా విజయలక్ష్మి మరియు ఇన్నర్ సభ్యులు రోటరీ సభ్యులు పాల్గొన్నారు

## అల్లూరి పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యం

చిలకలూరిపేట, జూలై 4, ప్రభాతవార్త: మన్యం వీరుడి పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యమని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ సుభాని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఐ కార్యాలయలో శనివారం నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి అపూర్వ సాహసాన్ని ప్రదర్శించిన మహనీయుడని కొనియాడారు. ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి యావత్ భారత జాతికి చిరస్మరణీయమన్నారు. ప్రస్తుత తరుణంలో అల్లూరి వంటి మహనీయుల ఆశయాలు నేటి తరానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ కార్యదర్శి కే.మల్లికార్జున్, నాయకులు దుర్గ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి మీడియా అక్రిడిటేషన్లు మంజూరు : కలెక్టర్ కృతిక శుక్లా

నరసరావుపేట, జులై 4 ప్రభాతవార్త ::జిల్లాలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మీడియా అక్రిడిటేషన్లు మంజూరు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మూడవ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ జీవో లో పేర్కొన్న నిబంధనల మేరకు మూడో సమావేశంలో మొత్తం 46 మంది పాత్రికేయులకు మీడియా అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హత కలిగిన జర్నలిస్టులు ఆన్లైన్‌లో సమర్పించిన దరఖాస్తుల్లో వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న వాటిని పరిశీలించి తదుపరి సమావేశంలో అక్రిడిటేషన్లు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అక్రిడేషన్ కమిటీ సభ్యులు వార్త జగన్మోహన్ రెడ్డి, జ్యోతి లక్ష్మయ్య, వెంకటప్పయ్య మాట్లాడుతూ బస్సు పాసులకు సంబంధించి విజయవాడ వరకు అనుమతి, పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ ఫీజుల రాయితీ, ప్రెస్ క్లబ్ కు సంబంధించిన స్థల కేటాయింపు, పెన్షన్లు తదితర జర్నలిస్టు సమస్యలను చైర్మన్ కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. దానిపై వారు సానుకూలంగా స్పందించారు. తొలుత సమావేశంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి దీప్తి, ప్రకాష్ రెడ్డి మీడియా అక్రిడిటేషన్ కు సంబంధించిన ప్రభుత్వ జీవో లోని నియమ నిబంధనలు, పాత్రికేయుల ఆన్లైన్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. సమావేశంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటి సభ్యులు, వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

PALNADU DISTRICT

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రొంపిచర్ల,జూలై 4ప్రభాతవార్త : గుర్తు తెలియని వాహనం ఢీకొనటం వలన ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన హైవే రోడ్డు పరిధిలో మండలంలో మర్రిచెట్టుపాలెం గ్రామంలో శనివారం జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండలంలో సంతగుడిపాడు గ్రామానికి చెందిన మారెడ్డి జయరామిరెడ్డి(72) తన స్వగ్రామం నుండి విప్పర్ల గ్రామానికి ఒక పని నిమిత్తం స్కూటీ పై వెళ్ళారు. అక్కడ తన పనులు ముగించుకుని తిరిగి తన స్వగ్రామానికి స్కూటీ పై తిరిగి హైవే రోడ్డు పై వస్తుండగా మర్రిచెట్టు పాలెం వద్దకు రాగానే, వెనుక వైపు నుండి వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో, తీవ్ర గాయాలు పాలై అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

## ఘనంగా వంగవీటి మోహనరంగా 27 జయంతి

నరసరావుపేట టౌన్, జూలై 4 ప్రభాతవార్త : బడుగుల ఆశాజ్యోతి... అణగారిన వర్గాల హక్కుల కోసం ప్రాణాలు సైతం పోగొట్టుకున్న పోరాట యోధుడు స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా 79 వ జయంతిని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట జనసేన పార్టీ తరుపున జనసేన శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. కుల మతాలకు అతీతం గా పేద ప్రజల. పెన్నిధి గా వంగవీటి మోహన్ రంగా ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని వక్తలు కొనియాడారు. నేడు కుల మతాలకు అతీతం గా వచ్చిన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ని రాజకీయం గా ఎదుర్కొనే దమ్ములేక వైసీపీ ప్రభుత్వం రాష్ట్రం లో కుల, మతాల తో ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొడుతూ, శాంతి భద్రత లకు విఘాతం కలిగిస్తుందన్నారు. ప్రజానాయకుడు వంగవీటి రంగా కి జోహార్లు అర్పించారు. అలాగే మన్యం వీరుడు విప్లవ జ్యోతి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా వారికి జనసేన పార్టీ తరుపున ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అద్దేపల్లి ఆనందబాబు, కృష్ణం శెట్టి గోవిందరావు, మిర్యాల వెంకట సుబ్బమ్మ, రాధారంగా మిత్రమండలి అధ్యక్షులు పోతంశెట్టి రామ్మోహన్, గుప్తా శ్రీకాంత్, బోనం జయరాం, సంక నాగరాజు, బీమా సాంబయ్య, రామాంజనేయులు, జక్కా నిర్మల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు

నరసరావుపేట టౌన్, జూలై 4 ప్రభాతవార్త :: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత కొణిజేటి రోశయ్య 92వ జయంతి వేడుకలను శనివారం నరసరావుపేట పట్టణంలోని శివుని బొమ్మ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణ ప్రముఖులు కపలవాయి విజయ్ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్తా, బత్తుల మురళి, ఆర్యవైశ్య ప్రముఖులు వారితో ఉన్నారు. తొలుత ఎమ్మెల్యే అరవింద బాబు కొణిజేటి రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ముద్దుబిడ్డ, ఆరాధ్య దైవం కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో మొత్తం 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టారని, ఇందులో ఆర్థిక మంత్రిగా 15 సార్లు, ఒకసారి ముఖ్యమంత్రి హోదాలో (201011 ఆర్థిక సంవత్సరానికి) బడ్జెట్‌ను సమర్పించారన్నారు. ఆర్యవైశ్య ప్రముఖులు కపలవాయి విజయ్ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్తా, ఇతర ఆర్యవైశ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రోశయ్యకు నివాళులర్పించారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

సత్తెనపల్లి, జూలై 4, ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు 129 వ జయంతి మరియు అఖండ దేశభక్త సాధువు స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమము రైల్వేస్టేషన్ రోడ్ లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జరిగినది. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో సత్తెనపల్లి స్టేషన్ రోడ్ లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి, స్వామి వివేకానంద చిత్రపటానికి సంస్థ అధ్యక్షులు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్, సభ్యులు పోతుగంటి రామకోటేశ్వరరావు లు పూలమాలలు వేశారు. సంస్థ సభ్యులు జెపిఎస్ శాస్త్రి అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారిపై పోరాడిన విశేషాలను తెలియజేశారు. యోగా సాధకులు మోటమర్రి రాంబాబు దేశభక్తి గీతాన్ని ఆలపించారు. అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్ ఉపాధ్యక్షులు పుట్టి సాంబశివరావు, సభ్యులు శ్రీ రఘునాథ శాస్త్రి ఈ సందర్భంగా స్వామి వివేకానంద అల్లూరి సీతారామరాజు సేవలను కొనియాడారు. కోశాధికారి తొమ్మండ్రు సత్యనారాయణ, సభ్యులు మట్టా సుబ్రమణ్యం, రత్తయ్య, అబ్బూరి సత్యనారాయణ, దేవరశెట్టి రవికుమార్, మరియు నారాయణసేన నగర సంకీర్తన బాధ్యులు అన్నం వెంకట రమణ, ఎ.జి.కే.యం వాకర్స్ సంఘ సభ్యులు, క్లబ్బు సభ్యులు ఆనంద్, చలువాది సత్యనారాయణ, బదరీనారాయణ పట్టణంలోని పుర ప్రముఖులు వెంకటేశ్వర రావు, విజయ్ తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పుష్పాంజలితో ఈ కార్యక్రమం ముగిసింది.

## హైకోర్టు న్యాయవాది బగ్గీ వెంకట పవన్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం

సత్తెనపల్లి, జులై 4, ప్రభాతవార్త: హైకోర్టు న్యాయవాది బగ్గీ వెంకట పవన్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా శనివారం నాడు పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణం వడ్డవల్లి లో ఉన్న మాతృశ్రీ మొల్లమాంబ వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు..... ఈ సందర్భంగా మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు మాట్లాడుతూ వృద్ధులను. అనాది పిల్లలను పేద ప్రజలను బాటసారిలను అలాంట వారికి ఏదో సందర్భంలో సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదుకోవాలని ఆయన కోరారు ,బగ్గి శ్రీదేవి, బగ్గి శ్రీకమల్, హైదరాబాద్ న్యాయవాది పాలపర్తి కేసరి నందన్ శర్మ, సాయి దృతి,. జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు కంబాల శ్రీనివాస్. యువజన సంఘం నాయకులు దాసరి తిరుపతి రావు ఆశ్రమ నిర్వాహకులు.ఎ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## వివేకానందుని వర్ధంతి

చిలకలూరిపేట, జూలై 4, ప్రభాతవార్త: పట్టణంలోని భాస్కర్ సెంటర్ స్వామి వివేకానంద విగ్రహం వద్ద స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం వివేకానందుని వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలుత వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణ మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు నెలకు సరిపడా ఉచిత ఔషధాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు హాజరై మాట్లాడారు. ఇందులో భాగంగా కార్మికులకు ఔషధ మందుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో వివేకానంద సేవా సమితి చేస్తున్న సేవలను ప్రశంసించారు. పట్టణ పరిశుభ్రతకు పాటుపడే పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి కార్యక్రమం చేపట్టడం హర్షణీయమని కొనియాడారు. అనంతరం 150 విధారకాల సపోటా, రామఫలం, నిమ్మ, మామిడి, కొబ్బరి, జామ వంటి పండ్ల మొక్కలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు వలివేటి వెంకట సత్యనారాయణ, రోటిరియన్ కాపు వెంకట్రావు, జగన్మోహన్ రావు, డా.పీవీ సుబ్బారావు, రవి, గోపాల్‌తో పాటు కమిటీ సభ్యులు,, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సేవకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మండలనేని సుబ్బారావు జన్మదిన వేడుకలు

చిలకలూరిపేట జూలై 4, ప్రభాతవార్త: ప్రముఖ పారిశ్రామికవేత్త, నిరంతరం సమాజ శ్రేయస్సును కాంక్షించే గొప్ప దాత శ్రీ మండలనేని సుబ్బారావు గారి జన్మదిన వేడుకలు ఆయన కార్యాలయంలో అత్యంత ఘనంగా జరిగాయి. కాపు కళ్యాణ మండపం నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో, శ్రీ పోతురాజు హరీష్ నేతృత్వంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సుబ్బారావు గారిని శాలువాతో ఘనంగా సత్కరించి, పూలదండలు వేసి, కేక్ కట్ చేయించి తమ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాపు కళ్యాణ మండపం కమిటీ సభ్యులుమాట్లాడుతూసుబ్బారావు గారి గొప్పతనాన్ని, ఆయన సేవాదృక్పథాన్ని కొనియాడారు. కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా ఎన్నో దానధర్మాలు చేస్తూ, ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న గొప్ప మానవతావాది సుబ్బారావు గారు అని ప్రశంసించారు. ముఖ్యంగా నేటి సమాజంలో ఎంతోమంది నిరుద్యోగ యువతకు తన వంతుగా ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న ఆయన కృషి ఆదర్శనీయమని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. తండ్రి అడుగుజాడల్లోనే ఆయన తనయుడు శ్రీ మండలనేని చరణ్ తేజ కూడా నడుస్తుండటం విశేషమని కమిటీ సభ్యులు అభినందించారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా చరణ్ తేజ కూడా ప్రజలకు తన వంతు సేవలు అందిస్తూ, జనసేన పార్టీలో చురుకైన యువ నాయకుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారని వారు పేర్కొన్నారు. సమాజ సేవలో తండ్రీకొడుకులు ఇద్దరూ ముందుండటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం లో పోతురాజు హరీష్, తోట వెంకట సురేష్, పొన్నం చంద్రశేఖర్, కమిలి శివరామకృష్ణ, మరెళ్ల శీను, మండలనేని జగదీష్, మండలనేని కొండయ్య బోనం సుబ్బారావు తోట మల్లిఖర్జున రావు తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీకి రూ.10 లక్షల విరాళం

చిలకలూరిపేట జూలై 4, ప్రభాతవార్త: చిలకలూరిపేటకు చెందిన యువ పారిశ్రామికవేత్త శ్రీ వెంకటేశ్వర స్వామివారికి కానుక చిలకలూరిపేటకు చెందిన ప్రముఖ యువ పారిశ్రామిక వేత్త చుండి రంగ నాయకులు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. శుక్రవారం తిరుమలలో టీటీడీ చైర్మన్ శ్రీ బి.ఆర్. నాయుడు సమక్షంలో రూ.10 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ దాతను అభినందిస్తూ, శ్రీవారి సేవలో భాగంగా చేసిన ఈ విరాళం అన్నప్రసాదం కార్యక్రమానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. దాతృత్వ భావంతో టీటీడీ ట్రస్టుకు విరాళం అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, కుటుంబ సభ్యులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## షేక్ నాగూర్ మృతికి ఘననివాళి

చిలకలూరిపేట జూలై 4, ప్రభాతవార్త: మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావు వ్యక్తిగత ఫోటోగ్రాఫర్ షేక్ మన్సూర్ , ఆల్ మదీనా బిర్యానీ పాయింట్ నిర్వాహకులు షేక్ నాగూర్ నిన్న రాత్రి స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త,నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, నియోజకవర్గ పరిశీలకులు ఆడక స్వాములు,పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి,యూనిట్ ఇంచార్జీ షేక్ అబ్దుల్ మజీద్,10వ వార్డు సెక్రటరీ షేక్ దరియా వలి లు వారు ఉంటున్న నివాసం వద్ద ఉన్న వారి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు

## కొణిజేటి రోశయ్య జయంతి

సత్తెనపల్లి, జూలై 4, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం తాలూకా సెంటర్ నందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్, దివంగత కొణిజేటి రోశయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్యకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

## పూడికతీత పనులకు 'కన్నా' శంకుస్థాపన

సత్తెనపల్లి, జూలై 4, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ డొంక రోడ్ వద్ద. అమరావతి మేజర్ కాలువ పూడికతీత పనులకు. శనివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు. కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఉప ఆలయాల ప్రతిష్టమహోత్సవం

సత్తెనపల్లి, జూలై 4, ప్రభాతవార్త: గురజాల నియోజకవర్గం,దాచేపల్లి మండలం,గ్రామాలపాడు గ్రామంలో మాజీ శాసన సభ్యులు టిటిడి బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీ మహా శైవ క్షేత్రంలో కొలువుదీరిన శ్రీ పార్వతి సమేత శ్రీ చెన్న మల్లికార్జున స్వామి వారి దేవస్థాన ప్రాంగణం నందు ఉప ఆలయాల నూతనంగా ప్రతిష్టమహోత్సవ ఘనంగా జరిగింది., ఈసందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమం లో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, భక్తులు హాజరయ్యారు.

## ప్రజాపరిష్కార వేదికలో ప్రజల అర్జీలు స్వీకరించిన కన్నా: సమస్యల పరిష్కారానికి హామీ

సత్తెనపల్లి, జూలై 4, ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, శాసనసభ్యులు కన్నా సత్తెనపల్లి కార్యాలయంలో పాల్గొన్నారు. అనంతరం నకరికల్లు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు. తన దృష్టికి కొన్ని సమస్యలు. గృహ,పెన్షన్, వైద్యం,పలు సమస్యలు తీసుకొచ్చారని,. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందరి సమస్యలు పరిష్కరిస్తామని, హామీ ఇచ్చారు .

## వివేకానందుని బోధనలు ఆచరణీయం

సత్తెనపల్లి, జూలై 4, ప్రభాతవార్త: లేచి నిలబడు, లక్ష్యాన్ని చేరేవరకు ఆగకు" అనే ఆయన సందేశం ఎప్పటికీ ప్రేరణే..ఆయన బోధనలు మన జీవితానికి మార్గదర్శక దీపంలా నిలుస్తాయని సత్తెనపల్లి మున్సిపల్ కమీషనర్ ఎన్.అనంద్ కుమార్ అన్నారు. అనంతరం అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసిన మున్సిపల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# రాజధాని నిర్మాణంలో మొబైల్ జేషన్ అడ్వాన్సుల పేరుతో కూటమి ప్రభుత్వ దోపిడీ!: డా. గోపిరెడ్డి..

నరసరావుపేట, జూలై 4 ప్రభాతవార్త :: అమరావతి రాజధాని నిర్మాణాల పేరుతో కూటమి ప్రభుత్వంలోని పెద్దలు భారీ అవినీతికి,మోసానికి పాల్పడుతున్నారని పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్ర బాబు అమరావతిని మొదలుపెట్టి సుమారు 7 8 సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు ఏమి చేయలేదన్నారు.తొలి విడతలో రైతుల దగ్గర నుంచి 34 వేలఎకరాలు తీసుకున్నారు ,ఇంతవరకు రైతులకు ఆ ఫ్లాట్లు ఎక్కడ ఎక్కడ ఉన్నాయి కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే నిర్మాణాలకు రూ.1520 వేల రూపాయలు చదరపు అడుక్కి ఖర్చు చేస్తున్నారు . కేంద్రం మాత్రం కేవలం రూ.4000 రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. అంటే ఎంత మోసం, అవినీతి జరుగుతుందో తెలిగ్గానే అర్థం అవుతుంది అన్నారు.జగన్మోహన్ రెడ్డి చెప్పిన మావిగన్ ప్రాజెక్టులో విజయవాడ, గుంటూరు నగరాల్లో రైల్వే స్టేషన్లు ఉన్నాయి, మచిలీపట్నంలో కోర్టు ఉంది ,కాకినాడ డెవలప్మెంట్ ఉంటుందన్నా రు.ప్రజల మధ్యలో రాజధాని ఉండాలి !ఎక్కడో పొలాల్లో పెట్టి అభివృద్ధి చేయాలంటే ఎలా జరుగుతుంది అన్నారు.అన్ని వసతులు ఉండి అతి తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేయడానికి అవకాశమున్న మావిగన్ రాష్ట్రానికి అవసరమన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఎంతో ముందుచూపుతో మావిగన్ అని చెప్పడం జరిగిందన్నారు . మావిగన్ ప్రాజెక్టుపై ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.పుల్లారావు,, జీవీ ఆంజనేయులు , జగన్మోహన్ రెడ్డి పై వ్యక్తిగతంగా నిందించడం, రాజధాని పేరుతో వేలకోట్లు దోచుకోవటం తప్ప ఎటువంటి మేలు జరగదు అన్నారు.రాజధాని ఎన్ని సంవత్సరాలు కడతారు ?ఎన్ని లక్షల కోట్లు కావాలి ?రాష్ట్ర బడ్జెట్ మొత్తం కూడా రాజధాని లో పెట్టి రెండు లక్షలు మూడు లక్షల కోట్లు ఖర్చుపెట్ట కార్యక్రమం చేస్తే రాష్ట్రంలో మిగిలిన ప్రాంత ప్రజల పరిస్థితి ఏమిటన్నారు. అమరావతి ప్రాంతాన్ని కూడా మావిగన్ లో కలుపుకునే కార్యక్రమం చేసి కచ్చితంగా అభివృద్ధి చేసే కార్యక్రమం చేస్తాం అని వివరించారు. సర్ కార్యక్రమంలో పట్టణంలోని 15 వేల ఓట్లు ట్రేస్ కావట్లేదన్నా రు., తక్షణమే అద్దెలకు ఇళ్లల్లో ఉండి ,వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు తమ బూత్ల వద్దకు వచ్చి సచివాలయంలో బిఎల్ఓ లను ,కలిసి అన్యుమరేషన్ ఫారాలు పూర్తి చేసి అందజేయాలని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు.

# నరసరావుపేటలో ఘనంగా వంగవీటి మోహన రంగా 79వ జయంతి వేడుకలు

నరసరావుపేట, జులై 4 ప్రభాతవార్త : ఉమ్మడి కూటమి బలోపేతానికి వంగవీటి రంగా అభిమానులు కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు. పట్నంలోని బలుపు ప్రాంతాల్లో కూటమి నాయకులు కపలవాయి విజయ్ కుమార్, రాయల శ్రీనివాసరావు, కాపు సంఘం నాయకులు వంగవీటి మోహన్ రంగా జయంతి కార్యక్రమాలకు హాజరయ్యారు.శనివారం పట్టణంలోని గుంటూరు రోడ్డులో వంగవీటి మోహన రంగా 79వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఉన్న రంగా విగ్రహానికి నరసరావుపేట శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కపలవాయి విజయ్ కుమార్, రాయల శ్రీనివాసరావు, రాధా మిత్రమండలి సభ్యులు, కాపు సోదరులు, ఉమ్మడి కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా 1947 జూలై 4న జన్మించి 1988 డిసెంబర్ 26న అమరులయ్యారన్నారు.

ఆయన విజయవాడలో కార్మిక, కాపు వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు. 1985లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది పేదల పక్షాన గళం వినిపించారని, అణగారిన వర్గాలకు అండగా నిలిచి ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. వంగవీటి రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ తన తండ్రి ఆశయాల కొనసాగింపుగా ప్రజాసేవలో ఉండిపోయారన్నారు. 2004 నుంచి 2014 వరకు విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని, రంగా అభిమానుల సంక్షేమం కోసం వంగవీటి మోహన రంగా ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి కూటమి బలోపేతానికి వంగవీటి రాధా అభిమానులు కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రంగా కుటుంబం ప్రజలకు చేస్తున్న సేవలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# వాగ్దేవి డిగ్రీ విద్యార్థుల విజయభేరి

నరసరావుపేట, జులై 4, ప్రభాతవార్త: : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ 4వ సెమిస్టరు ఫలితాలలో వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు బి .ఎస్సీ , బిసిఎ, బి కామ్ అన్నిగ్రూపులలో మంచి ఫలితాలను సాధించారని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కె . రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వారు మాట్లాడుతూ బి ఎస్సీ హానర్స్ (కంప్యూటర్ సైన్స్ ) గ్రూపులో పి .కళ్యాణి 93.58 , కె .రాజా రాజేశ్వరి 93.47 ,కె .లక్ష్మి దేవి 93.47 ,జె .రోజా మేరీ 93.26 ,బి .ఎస్సీ హానర్స్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ) గ్రూపులో టి .త్రివేణి 93.68 ,ఎన్ .నీలిమ 93.16 , డి .సునీత 91.58 ,బికామ్ హానర్స్ (కంప్యూటరప్లికేషన్స్ ) గ్రూపులో టి .నాగజ్యోతి 96.0 ,ఎం .చందన 93.53 , వి .బ్లెస్సీ 92.0 ,బి సి ఎ హానర్స్ (కంప్యూటర్ అప్లికేషన్స్ ) గ్రూపులోజి .త్రివేణి 90.24 ,వీ.ఉషశ్రీ 89.29 ,రీ.శ్రీవల్లి 87.76 సాధించి కాలేజీ టాపర్స్ నిలిచారన్నారు. గ్రూపులలో 91 పాస్ పెర్సెంటేజ్ తో యూనివర్సిటీ స్థాయిలో మరియు పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాల సెక్రటరీ కరెస్పాండంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు. మాథమాటిక్స్ లో 100 కి 100 మార్కులు, స్టాటిస్టిక్స్ లో 100 కి 100 మార్కులు, ఫిజిక్స్ లో 100 కి 98 మార్కులు, కంప్యూటర్స్ లో 100 కి 98 మార్కులు, ఇన్కమ్ టాక్స్ లో 100 కి 96 మార్కులు మరియు అకౌంట్స్ లో 100 కి 98 మార్కులు సాధించారని, ఉత్తమ మార్కులు సాదించటానికి కారకులైన అధ్యాపకులను మరియు విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల డైరెక్టర్స్ కాట్ల రామ కోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, సూదా సురేష్ బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, అధ్యాపకులు మరియు సిబ్బంది అభినందించారు.

# భావన (విక్టరీ) డిగ్రీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట, జులై 4, ప్రభాతవార్త: : స్థానిక భావన (విక్టరీ) డిగ్రీ కాలేజీ విద్యార్థులు నాలుగో సెమిస్టర్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల సెక్రటరీ వద్దుల. సుబ్బారెడ్డి, డైరెక్టర్ మైనీడి. శ్రీనివాసరావు లు శనివారం తెలిపారు. కాలేజీలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బిఎస్సి కంప్యూటర్స్ విభాగంలో బి సి ఏ విభాగంలో ఏ. త్రివేణి (96 ), బి య సి డేటా సైన్స్ విభాగంలో పి. శ్రీలక్ష్మి (93 ), బి. కామ్ కంప్యూటర్స్ విభాగంలో ఎస్. నందిని (93 ), జె.విజయ కుమారి (92 )లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల మేనేజ్మెంట్ అభినందించారు. ప్రిన్సిపాల్ పి. వేణు గోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్..

నరసరావుపేట క్రైమ్, జులై 4 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్, నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఏరియా ఆసుపత్రిని సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న హెచ్ఐవీ నిర్ధారణ, చికిత్స మరియు నివారణ కార్యక్రమాల అమలును సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ ) మరియు యాంటీ రెట్రోవైరల్ థెరపీ (తిళిగి) సెంటర్లను సందర్శించి, ఇన్పేషెంట్ మరియు అవుట్పేషెంట్ విభాగాల రికార్డులు చూశారు. క్రాస్ రిఫరల్ రిజిస్టర్లు, హెచ్ఐవీ పరీక్షల నిర్వహణ, రోగుల ప్రవాహం (పేషెంట్ ఫ్లో ) తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం శిశిగిదిగి (ప్రివేన్షన్ అఫ్ పేరెంట్ టూ చైల్డ్ ట్రాన్సమిషన్ ) సేవలను సమీక్షించి, గర్భిణుల నమోదు రిజిస్టర్, హెచ్ఐవీ పరీక్షల వివరాలు, పాజిటివ్ కేసుల నిర్వహణ, సేవల అందుబాటు, లక్ష్యాలకు అనుగుణంగా నమోదవుతున్న కేసులు మరియు రోగుల భారాన్ని (పేషెంట్ లోడ్ ) పరిశీలించారు. నరసరావుపేట కేంద్రానికి నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే మెడికల్ ఆఫీసర్, నోడల్ ఆఫీసర్, కౌన్సెలర్లు మరియు ఇతర సిబ్బందితో సమావేశమై హెచ్ఐవీ పరీక్షలు, రిఫరల్ వ్యవస్థ, చికిత్సలో చేరిక, రోగుల అనుసరణ సేవల నాణ్యత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సంబంధిత అన్ని రికార్డులు, రిజిస్టర్లు మరియు కార్యక్రమాల అమలును పరిశీలించి, సేవల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మరియు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో ) నిర్దేశించిన 95-95-99 లక్ష్యాలను సాధించేందుకు హెచ్ఐవీ నిర్ధారణను మరింత విస్తరించడం, గుర్తించిన ప్రతి హెచ్ఐవీ బాధితుడిని తక్షణమే ఎఆర్టి చికిత్సలో చేర్చడం, వైరల్ లోడ్ సప్రెషన్ సాధించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశించారు. తర్వత జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ కార్యాలయం జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ని కలిసి బీ।జు/తి।దీళీ ప్రోగ్రామ్ గురించి వివరించడం జరిగింది. జిల్లాలో హెచ్ఐవి పరీక్షలు నిర్వహణ కొరకు మొబైల్ ఐసీటీసీ వాహనం కొరకు చర్చించి వాహనం ఏర్పాటు కోసం అనుమతి తీసుకోడం జరిగింది. డా. శ్రీనివాస్ వర్మ, జాయింట్ డైరెక్టర్ (బేసిక్ సర్వీసెస్ డివిజన్), డా. మాధవీ లత, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి నరసరావుపేట, దిశా బృందం, సంబంధిత వైద్య అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# నలంద కాలేజీ వద్ద రోడ్డు ప్రమాదం

సత్తెనపల్లి, జూలై 4, ప్రభాతవార్త: రూరల్ సత్తెనపల్లి మండలం నలంద కాలేజీ వద్ద రోడ్డు ప్రమాదం టైర్ పంచరవడంతో బోల్తా కొట్టిన కారు.. మాచర్ల శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ఘటన.. ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు.. గాయపడిన వారు మంగళగిరి సమీపంలో నూతక్కి గ్రామానికి చెందినవారు.. గాయపడిన వారిని సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# తెనాలిలో ఒరిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు పర్యటన

తెనాలి జులై4(ప్రభాతవార్త): తెనాలిలో ఒరిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా రూపాకుల సత్యనారాయణ-లక్ష్మీనరసమ్మ దంపతుల విగ్రహాలను ఆవిష్కరించి ప్రసంగించారు.

**త్యాగమూర్తుల గాథ తరతరాలకు స్ఫూర్తి.**

దేశ ఆర్థిక బలోపేతానికి ప్రతి పౌరుడు భాగస్వామి కావాలన్నారు.స్వాతంత్ర్య సమరయోధులు రూపాకుల సత్యనారాయణ-లక్ష్మీనరసమ్మ దంపతుల త్యాగం, దేశభక్తి, సమాజసేవ భావితరాలకు ఆదర్శప్రాయమని ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. అలాంటి మహనీయుల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. శనివారం తెనాలిలో నిర్వహించిన రూపాకుల దంపతుల విగ్రహావిష్కరణ, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.వేదపండితుల పూర్ణకుంభ స్వాగతంతో ప్రారంభమైన కార్యక్రమంలో దేవతామూర్తుల చిత్రపటాలకు పూలమాలలు సమర్పించిన గవర్నర్ అనంతరం రూపాకుల దంపతుల విగ్రహాలను ఆవిష్కరించారు.దేశసేవనే జీవిత పరమార్థంగా భావించి వారు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు శిక్షలు అనుభవించారని, అంటరానితనం, సామాజిక వివక్ష నిర్మూలన, దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించారని కొనియాడారు. ప్రభుత్వ పెన్షన్ను కూడా విద్యార్థులు, ప్రజల సంక్షేమానికే వెచ్చించారని, ప్రతి ఇంటిలో, ప్రతి పాఠశాలలో వారి జీవితగాథ వినిపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రపంచ యుద్ధ పరిస్థితుల ప్రభావంతో దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని పేర్కొంటూ, ప్రధానమంత్రి సూచించిన ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు.క్రూడ్ ఆయిల్ వినియోగానికి బదులుగా ఎలక్ట్రిక్ వాహనాలు ఉపయోగించాలని, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచాలని సూచించారు.బంగారం దిగుమతులు, వంటనూనె వినియోగం, విదేశీ పర్యటనల వల్ల విదేశీ మారకద్రవ్యం అధికంగా ఖర్చవుతోందని, వీటిని తగ్గించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.అనంతరం ప్రముఖులకు పౌరసన్మానం నిర్వహించి, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నిజమైన కాంగ్రెస్ వాది కొణిజేటి రోశయ్య:డా. సాంబశివుడి నివాళి.

తెనాలి జులై4(ప్రభాతవార్త): కాంగ్రెస్ పార్టీ యే ఊపిరి గా, నిబద్ధత కల్గిన,నిజమైన కాంగ్రెస్ వాది, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య 93వ జయంతి సందర్భంగా తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొణిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ, పంచాయితీ వార్డు మెంబర్ గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన కొణిజేటి రోశయ్య,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్ గా అనేక పదవులు నిర్వహించి ఆ పదవులకే వన్నెతెచ్చారని, నిబద్ధత కలిగిన కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా పార్టీ కార్యక్రమాలను తూ.చ తప్పకుండా పాటించేవారని, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన జీవితాంతం కృషిచేసిన స్వర్గీయ కొణిజేటి రోశయ్య మన ప్రాంత వాసి కావటం మన అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి టౌన్ ప్రెసిడెంట్ పొన్నూరు నాగసూర్య శేశి ధర్, గుంటూరు జిల్లా జనరల్ సెక్రెటరీ యన్నం శెట్టి శివరామకృష్ణ ప్రసాద్, తెనాలి మండల ప్రెసిడెంట్ పి.స్టీవెన్ బాబు,పెనుగొండ శివకుమార్ , భీమ రమేష్, శీలం సుబ్బారావు,షేక్ నాగూర్, కార్తీక్, కే.వీరస్వామి, బి.శీను,ఎన్.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# టీబి ముక్తభారత్ అభియాన్ మనందరి బాధ్యత :డా. రమాదేవి.

తెనాలి మున్సిపాలిటీ జూలై4(ప్రభాతవార్త): టీబి ముక్తభారత్ అభియాన్ 2.0 జన్ భాగీ దారి హ్యాండ్ హోల్డ్ ఎక్స్ రే కార్యక్రమంలో పాల్గొన్న తెనాలి టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి మాట్లాడుతూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు మేరకు జరుగుతున్న క్షయ వ్యాధిని అంతం చేసే కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్థానిక నందులపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు హ్యాండ్ హోల్డ్ ఎక్స్ రే ద్వారా ఛాతి ఎక్సరే తీసే కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందని 2030 నాటికి టిబి ముక్తభారత్ అభియాన్ మనందరి బాధ్యత అని అందకు ప్రజలందరూ సహకరించాలని తెలియజేసినారు. అంతేకాకుండా రాబోవు రోజులలో తెనాలి పట్టణంలోని అన్ని పట్టణ మురికివాడలలో 14 సంవత్సరములు దాటిన ప్రతి ఒక్కరికి ఛాతి ఎక్సరే తీసే కార్యక్రమం జరుగుతుందని,ఆప్రాంత ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలియజేసారు.నందుల పేట యు పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుశాన్ గ్రేస్ మాట్లాడుతూ గాలి ద్వారా వ్యాప్తి చెందే క్షయవ్యాధి ప్రమాదకరమైన దని అయినప్పటికీ ముందస్తు పరీక్షలతో క్షయవ్యాధిని అంతం చేయొచ్చని తెలియజేసినారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ, ఈ హ్యాండ్ హోల్డ్ ఎక్స్ రే ద్వారా నిద్రావస్థలో ఉన్న క్షయ వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించి క్షయ వ్యాధిగా మారకుండా ప్రివెన్షన్ థెరపీ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ యుయల్ బి ఆరోగ్య విస్తరణాధికారి అందేబాలచంద్రమోళి ,లెప్రసీ పారామెడికల్ ఆఫీసర్ జె శ్యామ్, గుంటూరు డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి సౌజన్య , తెనాలి టీబీ యూనిట్ హెల్త్ విజిటర్ వాకా దిలీప్,నందుల పేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్పాల్గొన్నారు .

# గాంధేయవాది రామలింగాచారి జ్ఞాపకార్థంగా అన్నదానం

తెనాలి జులై4(ప్రభాతవార్త): ఇటీవల మరణించిన ప్రముఖ గాందేయవాది శ్రీ మహాత్మాగాంధీ సేవా శాంతి ఆశ్రమ వ్యవస్థాపకులు, వజ్రాల రామలింగాచారి జ్ఞాపకార్థంగా,సూర్య శిల్ప శాల అధినేత కాటూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవాసమితి అధ్యక్షులు కుర్రా శ్రీను పర్యవేక్షణలో,స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని సేవా సమితి అన్నదాన కేంద్రం వద్ద,వృద్ధులు,నిరాశ్రయులు, వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ముందుగా రామలింగాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సూర్య శిల్పశాల అధినేత కాటూరి వెంకటేశ్వరరావు తనయుడు కాటూరి రవిచంద్ర మాట్లాడుతూ, గత రెండున్నర దశాబ్దాలుగా తెనాలి పట్టణంలో వృద్ధులు, నిరాశ్రయుల కోసం వృద్ధాశ్రమం స్థాపించి, మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గంలో పయనించిన,ప్రముఖ గాందేయవాది,వజ్రాల రామలింగాచారి జ్ఞాపకార్థంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నా మన్నారు. సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను మాట్లాడుతూ,మహాత్మా గాంధీ స్ఫూర్తిని అనుసరిస్తూ, పేదలు, వితంతువులు, వృద్ధుల కోసం ఆశ్రమాన్ని స్థాపించిన ప్రముఖ గాందేయవాది వజ్రాల రామలింగాచారి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో, వజ్రాల విశ్వనాథ్,పి. అఖిల్,కే. సురేంద్ర,బి. పోతురాజు మరియు సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయులు కొణిజేటి రోశయ్య: వైశ్య సంఘాల నివాళులు

తెనాలి జులై4(ప్రభాతవార్త): మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్, ఆర్యవైశ్య సమాజం గర్వించదగ్గ మహానేత కొణిజేటి రోశయ్య 93వ జయంతి సందర్భంగా,స్థానిక బోస్ రోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రం ప్రాంగణంలో శనివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రం కమిటీ అధ్యక్షులు నూకల వెంకట వేణుగోపాలరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్రం ప్రాంగణంలో ప్రతిష్ఠించిన కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆర్యవైశ్య ప్రముఖులు, సంఘ నాయకులు మాట్లాడుతూ, రాజకీయాలలో రోశయ్య ప్రజాసేవ, నిజాయితీ, నిరాడంబరత, విలువలతో కూడిన రాజకీయ జీవితం చిరస్మరణీయమని కొనియాడారు.వక్తలు మాట్లాడుతూ, ఆర్యవైశ్య సమాజం పట్ల రోశయ్య ఎల్లప్పుడూ ప్రత్యేకమైన ఆదరణ, ఆప్యాయత చూపారని, ముఖ్యంగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రాలు, ధర్మ సంస్థలు తమ సంప్రదాయాలను, స్వతంత్రతను కాపాడుకుంటూ సమాజ ఆధ్వర్యంలో కొనసాగేందుకు ఆయన అందించిన సహకారాన్ని ఆర్యవైశ్య సమాజం ఎల్లప్పుడూ కృతజ్ఞతతో స్మరించుకుంటుందని పేర్కొన్నారు.అనంతరం రోశయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవ, ధర్మ పరిరక్షణ, ఆర్యవైశ్య సమాజ ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



రోశయ్య ని గొప్ప నాయకుడిని చేసింది ఆయన పదవి కాదు, ఆయన వ్యక్తిత్వం,అధికారం కాదు, ప్రజల విశ్వాసం,అదే ఆయన జీవిత సందేశం.ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రం కమిటీ అధ్యక్షులు నూకల వెంకట వేణుగోపాలరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, సంఘ నాయకులు, భక్తులు, పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య బంధువులు పాల్గొని కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు.

# వంగవీటి రంగా జయంతి సందర్భంగా అభిమానుల నివాళి

తెనాలి జులై4(ప్రభాతవార్త): జీవించింది కొంతకాలమైనా ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన అమరుడు వంగవీటి మోహనరంగా అని రంగా అభిమానులు కొనియాడారు.శనివారం సమైక్యాంధ్ర సంచలన నేత వంగవీటి మోహనరంగా 79 వ జయంతిని పరిష్కరించుకొని, నాజరుపేట సెయింట్ జాన్స్ స్కూలు వెనక వంగవీటి రంగా అభిమానుల ఆధ్వర్యంలో మోహనరంగ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముందుగా రంగా విగ్రహానికి అలంకరించి నివాళులు అర్పించిన అనంతరం పలువురు వక్తలు ప్రసంగించారు. అనంతరం పేదలకు దుప్పట్లను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గిడుగు తులసి,సుబ్రహ్మణ్యం,మాదల కోటేశ్వరరావు, బొచ్చు శ్రీనివాసరావు, నన్నపనేని రాంబాబు, తవిటి భాస్కర్, ప్రసాదం శ్రీను, చిన్నా , శరత్ చంద్ర, లింగినేని సాంబశివరావు, లింగనేని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చు వారి నూతన
దారి

# ఓటరు జాబితా శిబిరాన్ని పరిశీలించిన మున్సిపల్ కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ జులై4(ప్రభాతవార్త): మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు శనివారం పట్టణం లో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ శిబిరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటర్ల నుండి ఎన్ని ధరఖాస్తులు సేకరించినది ఎన్ని ఆన్లైన్ చేసినది సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లు అడిగిన సందేహాలకు కమిషన్ విపులంగా వివరించారు. ఓటర్ల నుండి అవసరమైన పత్రాలు సేకరించి సవివరమైన ఓటరు జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.బిఎల్వో లు తమకు కేటాయించిన పోలింగ్ బూత్ లకు సంబంధించిన ఓటర్ల జాబితా సవరణ ను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఓటర్ల నుండి తగు సమాచారాన్ని సేకరించి ఏరోజుకారోజు ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. ఓటర్లు కూడా తమ ఓటు వివరాలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే బిఎల్ఓ లను లేదా ఓటర్ జాబితా శిబిరాలలో తెలియజేసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ వేగవంతం చేసేందుకు బిఎల్ఓ లకు ఆర్పీలు అంగన్వాడీ కార్యకర్తలను కూడా అనుసంధానం చేసినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలోఅసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమతి వాణి, బిఎల్ఓ లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక
ఓటరు జాబితా సవరణ

# ఆదర్శనీయుడు డాక్టర్ కొణిజేటి రోశయ్య

వేమూరు జూన్ 4 (ప్రభాతవార్త) : రాజకీయాలలో ఆదర్శనీయుడు డాక్టర్ కొణిజేటి రోశయ్య అని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తెలియజేశారు. శనివారం మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు రాష్ట్ర మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య 93వ జయంతిన స్వగ్రామమైన వేమూరులో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని డాక్టర్ కొణిజేటి రోవయ్య విగ్రహానికి వెల్లంపల్లి శ్రీనివాస్, వేమూరు వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్బాబు, రేపల్లె వైసిపి ఇన్చార్జి పేట నాగమోహన్కృష్ణ, వైసిపి రాష్ట్ర ఐ ఆర్టి విభాగం అధ్యక్షులు రేబల శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెల్లంపల్లి మాట్లాడుతూ డాక్టర్ రోశయ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక శాఖ మంత్రిగా ఎక్కువ కాలం పని చేసి ఏనాడు ఓవర్ డ్రాఫ్టకు వెళ్ళకుండా రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలన్నారు. రాజకీయాల్లో నిబద్ధతగల నాయకుడిగా ఆదర్శనీయుడుగా వెలుగుందారని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈ ప్రాంతానికి అందించిన సేవలు ప్రజలు ఎన్నటికీ మరువరన్నారు. అశోక్బాబు మాట్లాడుతూ నేటితరం రాజకీయ నాయకులు డాక్టర్ కొణిజేటి రోశయ్య రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాష్ట్రానికి రోశయ్య చేసిన సేవలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం గురి_ంచకపోవడం శోచనీయమన్నారు. ఈ సందర్భంగా పలువురు రోశయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి బొలిశెట్టి ప్రభాకరరావు, బాదం సుబ్బయ్య, వేమూరు, భట్టిప్రోలు ఎంపీపీలు ఎల్లమాటి మోహనరావు, లలితకుమారి, పార్టీ నాయకులు దాది సుబ్బారావు, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్, విష్ణుమొలకల వెంకటరెడ్డియ్య, గాదె వివరామకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, పెరికల పద్మారావు, చందోలు డేవిడ్ విజయ్కుమార్, గాజుల భాను ప్రకాష్, దున్నా మేరీస్బాబు, గాజుల చినబాబు, లంక శ్రీనివాసరావు, దాసరి కిరణ్బాబు, రోశయ్య అభిమానులు, వైఎస్ఆర్సిపి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వేమూరు జూన్ 4 (ప్రభాతవార్త) : రానున్న వర్షాకాలం నేపథ్యంలో పంచాయితీ, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షులు ఎల్లమాటి మోహనరావు తెలియజేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పరిశుద్ధ కార్యక్రమాలు నిర్వహిస్తూ అపరిశుభ్ర వాతావరణంలో చూడాలన్నారు. త్రాగునీటి ట్యాంకులను శుభ్రపరుచుకోవడం క్లోరినేషన్ చేసి పరిశుభ్రమైన త్రాగునీరు అందించాలన్నారు. సమావేశాలకు అధికారులు గైరు హాజరు అవుతున్నారని సమావేశాలకు రాని అధికారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా మండల గ్రామాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు కేటాయించిన నిధుల గురించి వివరించారు. సమావేశంలో ఎంపీడీవో రవికుమార్, ట్రైనీ డిప్యూటీ తహశీల్దార్ కె.కళ్యాణ్, డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు, ఎంపీటీసి సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు

కొల్లిపర,జూలై 4 ప్రభాతవార్త: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలను ప్రభుత్వం ఏర్పాటు చేయటం జరిగిందని ఎంపీడీవో విజయలక్ష్మీ అన్నారు.మండల పరిధిలోని వల్లభాపురం,కొల్లిపర గ్రామాలలో అధికారులు గ్రామసభలను నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ గ్రామసభ దృష్టికి సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరగా పలువురు తమ సమస్యలు విన్నవించారు.సమస్యలు విన్న ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామసభకు వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు.కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సాంబిరెడ్డి,మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి,హౌసింగ్ ఏఈ పద్మావతి,పరిపాలనాధికారి కిషోర్కుమార్,దుగ్గిరాల మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ వంగా సాంబిరెడ్డి,సొసైటీ అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం చేయండి..నాణ్యమైన ఉత్పత్తులు పొందండి

కొల్లిపర,జూలై 4 ప్రభాతవార్త: ప్రకృతి వ్యవసాయం చేస్తే రైతులు నాణ్యమైన ఉత్పత్తులు పొందవచ్చని డీఆర్డీఏ వెలుగు డీపీఎం అశోక్ అన్నారు.స్థానిక స్త్రీశక్తి భవనంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఏపిఎం రమాదేవి అద్యక్షతన జరిగిన సమావేశంలో అశోక్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్ మంచి డిమాండ్ ఉందన్నారు.మహిళా రైతులు గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వం ఇస్తున్న యంత్ర పరికరాలను కొనుగోలు చేసి వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదాఉరుల సంస్థ అద్యక్షురాలు నాగరత్నం,సీసీలు బుజ్జిబాబు,విజయకుమార్,ప్రమీలాదేవి,ఎమ్ఎస్ఏ సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్
BOD సభ్యుల

# అత్తోటలో నూరెళ్ళు నిండిన తాతయ్యకు జన్మదిన వేడుకలు

కొల్లిపర,జూలై 4 ప్రభాతవార్త: సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తున్న ఓ తాతయ్య..ఐదు తరాల మనవలు..మనవరాళ్ళు సమక్షంలో తన భార్యతో కలసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.వివరాల ప్రకారం మండల పరిధిలోని అత్తోట గ్రామంలో దైవాల చంద్రమౌళికి 100 సంవత్సరాలు నిండటంతో ఆయన కొడుకులు..కూతుర్లు..మనవలు,మనువరాళ్ళు ఆందరూ కలసి పుట్టిన రోజు వేడుకలను పండుగగా జరుపుకున్నారు.దైవాల చంద్రమౌళి..పున్నమ్మ దంపతులను కుటుంబ సభ్యులు..బంధుమిత్రులు..గ్రామస్తులు ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు

## మోహనరంగా ఆశయాలకు అణుగుణంగా నడుచుకోవాలి

కొల్లిపైర, జూలై 4 ప్రభాతవార్త: వంగవీటి మోహనరంగా ఆశయాలకు అణుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని మాజీ మండల ఉపాధ్యక్షుడు అడపాల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని దావులూరు, చక్రాయపాలెం, అత్తోట గ్రామాలలో వంగవీటి మోహనరంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిలబడిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అన్నారు. కార్యక్రమంలో డీసీ వైస్ చైర్మన్ తోటా ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యులు బొల్లిముంత వెంకటేశ్వర రావు, అమ్మిశెట్టి హరికృష్ణ, నాయకులు దాసరి నరసయ్య, వరికూటి నాగరాజు, ముంగర బుల్లి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

కొల్లిపర, జూలై 4 ప్రభాతవార్త: విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తూ.. విద్యార్థుల యొక్క పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేయాలని ఎంఈవో ఝాన్సిలత పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చివలూరు, తూములూరు, కొల్లిపర ప్రాధమిక పాఠశాలలను ఆయన తనిఖీ నిర్వహించి రికార్డులు.. హాజరు పట్టీలు పరిశీలించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు.. సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఝాన్సిలత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కొల్లిపర, జూలై 4 ప్రభాతవార్త: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామ కార్యదర్శులు గ్రామాలలో దోమల మందులను పిచికారీ చేయించాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాలువలలో ఉన్న మురుగునీరు తొలగించి బ్లీచింగ్ చల్లించాలన్నారు. గ్రామ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో డిప్యూటి ఎంపీడీవోలు భార్గవ్, దానయ్య, పరిపాలనాధికారి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా పనిచేయండి..అర్హులందరికీ హక్కు కల్పించండి

కొల్లిపర, జూలై 4 ప్రభాతవార్త: ఓటర్ల జాబితా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి.. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని డిప్యూటి ఎంపీడీవో దానయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తూములూరు, కొల్లిపర, చివలూరు గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఆయన తనిఖీ చేసారు. మ్యాపింగ్.. డిజిటలైజేషన్ పనుల పురోగతిని బూత్ స్థాయి అధికారుల నుండి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దానయ్య మాట్లాడుతూ సర్ ద్వారా ఓటరు నమోదు జరగాలన్నారు. ఓటర్ల వెరిఫికేషన్ విషయంలో బీఎల్‌ఓలు ఓపికగా వ్యవహరించాలన్నారు.

## *ప్రభుత్వ నిధుల డొంకకు ప్రైవేట్ వ్యక్తుల అజమాయిషీనా?*

### ..ఇది ఎక్కడి చోద్యం అంటున్న పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు

యడ్లపాడు, జులై 4, ప్రభాతవార్త : మండల పరిధిలోని వంకాయలపాడు పంచాయతీ సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలకు ప్రభుత్వ నిధులతో నిర్మించిన స్థిరాస్తి వెంచర్ నిర్వాహకులు మూసివేశారు. బోయపాలెం సంగంగోపాలపురం రోడ్డు పక్కన విశాలమైన ప్రదేశంలో ఎనిమిదేళ్ల క్రితం గురుకుల పాఠశాల నిర్మించారు. ఊరికి దూరంగా కొండల పక్కన ప్రశాంతమైన వాతావరణం, చక్కని గాలి, వెలుతురు, మంచినీరు తదితర మౌళిక వసతులు ఉన్నా రోడ్డు సౌకర్యం లేదు. బోయపాలెంసంగంగోపాలపురం బీటీ రోడ్డు నుంచి పాఠశాలకు సుమారు 1.5 దూరం అప్రోచ్ రోడ్డు లేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. వర్షాలు కురిసిన సమయంలో చిత్తడిగా ఉన్న మట్టి మార్గంలో అగచాట్లు పడ్డారు. వాహనాలు చక్రాలకు బురద చుట్టుకుపోయి ఇబ్బందులు పడ్డారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోవటంతో 2022లో పాఠశాలకు అప్రోచ్ రోడ్డు మంజూరు చేశారు. రూ.15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో మట్టి రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి పాఠశాలకు రాకపోకలు సాగించటానికి అదే రోడ్డులో వినియోగించారు.

.. అయితే పాఠశాలకు నిర్మించిన రోడ్డు మధ్య ఉన్న 482బీ8 సర్వే నంబర్లోని భూమిని ప్రభుత్వం గతంలో నిరుపేదలకు షరతులతో కూడిన పట్టాలు మంజూరు చేసింది. సదరు భూములను ప్రభుత్వం ఎప్పుడైనా తిరిగి స్వాధీనం చేసుకునే హక్కు, ప్రజా ప్రయోజనం కోసం వినియోగించే అధికారం ఉంది. ఆ ప్రామాణికం పరిగణనలోకి తీసుకుని సంబంధిత భూమిలో రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. 2022లో నిర్మాణ పనులు గావించి రోడ్డు అందుబాటులోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఇబ్బందులు తప్పాయి. ఆ మార్గంలో ఇటీవల గుంటూరు చెందిన ఓ స్థిరాస్తి వెంచర్ నిర్వాకులు లేఅవుట్ నిర్మిస్తున్నారు. లేఅవుట్ చుట్టూ ప్రహరీ నిర్మించి రోడ్డును మూసివేశారు దీంతో విద్యార్థులు పక్కనే రాళ్లురాప్పలతో ఉన్న ఏపీఐఐసీ భూముల్లోంచి పాఠశాలకు వెళుతున్నారు. దీనిపై వెంచర్ నిర్వాహకులను వివరణ కోరగా.. తాము పట్టా భూమిని తాము కొనుగోలు చేశామని, తమ భూమిలో రోడ్డును ప్రభుత్వం నిర్మించలేదని, తామే సొంతగా నిర్మించుకున్నామని చెప్పారు. మీభూమి సైట్‌ల్లో పరిశీలించగా 2022వరకు సంబంధిత వెంచర్ నిర్వాహకుల పేర్లు ఏమి లేవు. తదుపరి 2023వ సంవత్సరం నుండి భూమి కొనుగోలు చేసినట్లు వెంచర్ నిర్వాహకుల పేరిట పట్టాభూమిగా ఉంది. మరి కొనుగోలుకు ముందు రోడ్డు నిర్మాణం ప్రభుత్వ నిధులతో గావించిన ప్రాంతాన్ని ఏవిధంగా కొనుగోలు దారుడు కొనుగోలు చేసియున్నాడని ప్రశ్నార్ధకంగా మిగులు తుంది. అన్ని తెలిసి కొనుగోలు చేసాడా లేదా అనేది అధికారులు తేల్చాలి మరి. ఇవేమి పరిశీలించ కుండానే రోడ్డు నిర్మాణంన గావించారా అన్నది ప్రశ్నగానే మిగులు తుంది. నాడు 2022లో పంచాయితీ సభ్యుల తీర్మానం ఇస్తేగాని జిల్లా పరిషత్ నుండి నిదులు మంజూరు కాలేదని అంటున్నారు. ఏది ఏమైనా అధికారులు పూర్తి స్ధాయిలో విచారణ గావించి విద్యార్థుల అవస్ధల నుండి గట్టెక్కించాలి కోరుతున్నారు

## అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

యడ్లపాడు, జులై 4, ప్రభాతవార్త : యడ్లపాడు తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు తహశీల్దార్ విజయశ్రీ, డిప్యూటి తహశీల్దార్ అనురాధ, కార్యాలయం సిబ్బంది. ఈ సందర్భంగా తహశీల్దార్ విజయశ్రీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తి అని. సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు అల్లూరి సీతారామరాజన్నారు.

## ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి

పిడుగురాళ్ల, జూలై 4 ప్రభాతవార్త : పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద శనివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య నేత, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు కనిగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక శాఖా మంత్రిగా, ఆరోగ్య శాఖా మంత్రిగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా రోశయ్య సేవలందించారని కొనియాడారు.

## విద్యార్థులకు గొడుగులు పంపిణీ

పిడుగురాళ్ల, జూలై 4 ప్రభాతవార్త : ది హెల్ప్ టు హోప్‌లెస్ రవి ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం పట్టణంలోని లెనినల్ నగర్‌లోని హైస్కూల్‌లో విద్యార్థులకు గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత మల్లెల ఆదినారాయణ మాట్లాడుతూ రవి ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ఫౌండేషన్‌ను ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ, ఫౌండేషన్ ఫౌండర్, అధ్యక్షుడు రవికుమార్, సెంథిల్ కుమార్, విజయ్‌కుమార్, హెచ్‌ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆ మాటలు పూర్తి అవాస్తవం: మట్టపల్లి బ్రహ్మాం

విజయపురిసౌత్, జులై 4 ప్రభాతవార్త: వార్తలోకం అనే పత్రికలో వచ్చిన మాటలు పూర్తి అవాస్తవమని స్నేహపూర్వకంగా ఉండే మా గ్రామంలో వార్తాలోకం పత్రికా విలేకరి తన ఎదుగుదల కోసం తన గుర్తింపు కోసం బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాడని ఆ పత్రికలో తనపై వచ్చిన వార్తలను మట్టపల్లి బ్రహ్మం ఖండించారు. ఒక హోటల్ అద్దెకు తీసుకుని దాన్ని ప్రారంభించడానికి స్నేహితులైన వైసీపీ శ్రేణులను ఆహ్వానించాను. అంతేతప్ప పత్రికలో ప్రచురణలు చేయమని విలేకరులను అడగలేదన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో పిచ్చి రాతలు రాసి తానేదో ఆనందపడుతూ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు తనను ఎప్పుడూ ఇబ్బంది పెట్టింది లేదని ఇది పూర్తిగా అవాస్తవమన్నారు. తెలుగుదేశం పార్టీ వచ్చి నేటికి మూడు సంవత్సరాలు అవుతున్నా, తాను అందరితోనూ కలసిమెలసి ఉంటున్నానని ఏ ఒక్కరూ తనను ఇబ్బంది పెట్టలేదన్నారు. కొంతమంది గిట్టని వాళ్లు పని కట్టుకొని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

## బీఎల్‌ఓలకు సర్‌పై అవగాహన

విజయపురిసౌత్, జులై 4 ప్రభాతవార్త: గ్రామ సచివాలయంలో మాచర్ల మండల తహశీల్దారు కిరణ్‌కుమార్ అధ్యక్షతన శనివారం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్)పై అవగాహన సమావేశం నిర్వహిం చారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లకు సర్ ప్రక్రియ, ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై సమగ్ర అవగాహన కల్పించారు.

## గ్రామాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### -ఎంపిపి భవనం పద్మలీల

పొన్నూరు, జూలై 4, ప్రభాతవార్త: గ్రామాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు(ఎంపిపి)భవనం పద్మలీల కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి భవనం పద్మలీల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పద్మలీల మాట్లాడుతూ ప్రస్తుతం వర్షా కాలం కాబట్టి గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధుల పదవీ కాలం త్వరలో తీరనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు గ్రామాభివృద్ధిపై దృష్టిపెట్టి ప్రభుత్వానికి, అధికారులకు మంచి పేరు తెచ్చేవిధంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన రక్షిత మంచినీటిని అందించాలన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం అన్ని శాఖల అధికారులకు దక్కిందని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు రాయితీపై వరి విత్తనాలను అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురియడం లేదని, సకాలంలో వర్షాలు పడినట్లయితే రైతులు వరి వెద సాగు చేపట్టే అవకాశం ఉండేదన్నారు. కాలువలకు నీటిని కూడా ఈ నెల 15 తర్వాత విడుదల చేస్తామని అధికారులు చెప్పున్నారని చెప్పారు. రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను భూసారాన్ని వృద్ధి చేసుకునేందుకు అందజేసినట్లు చెప్పారు. మే నెలలో 366 క్వింటాళ్ళ పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 8,731మందికి రూ.5.51కోట్లు వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఎరువులు పంపిణీకి ప్రత్యేక యాప్‌ను రూపొందించామన్నారు. యాప్ ద్వారానే రైతులకు ఎరువులు అయిన డిఏపి, యూరియాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది 4,500కౌలు రైతుల కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికి 1,960మందికి కౌలు రైతు కార్డులు అందజేయడం జరిగిందన్నారు. మిగిలినవి త్వరలో అందజేస్తామన్నారు. మండల విద్యాశాఖాధికారి దూపం రాజు మాట్లాడుతూ ఏడాది ఒకటో తరగతికి 414అడ్మిషన్లు జరిగినట్లు చెప్పారు. 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 83శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. 550పైగా 38మంది విద్యార్థులు సాధించారన్నారు. వారిలో 8మందికి ట్రిపుల్ ఐటీ సీట్లు వచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివి విద్యార్థుల తల్లిదండ్రులచే లీప్‌యాప్ డౌన్‌లోడ్ చేయించే విధంగా ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు చెప్పారు. ఈ యాప్ ద్వారా విద్యార్థి యొక్క ప్రగతి, విద్యార్థికి అందజేస్తున్న వైద్యం, మధ్యాహ్న భోజన పథకం, తదితర వివరాలన్నీ తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్‌శాఖ, ఐసీడిఎస్, ఇరిగేషన్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అంబటి రాఘవయ్య, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అందరివాడు విఎం రంగా: వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు

పొన్నూరు, జూలై 4, ప్రభాతవార్త: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, అందరివాడుగా స్వర్గీయ వంగవీటి మోహనరంగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరారావు అన్నారు. వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా స్థానిక తెలగపాలెం వద్ద వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విఎం రంగా ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎందేటి వెంకటసుబ్బయ్య, చింతలపూడి మురళీకృష్ణ, ఆకుల రామమోహన్, అమిరినేని సాంబశివరావు, చిల్లర నాగరాజు, గేరా సంజీవ్, వట్టిప్రోలు రంగారావు, వేముల మూర్తిరాజు, గోపిశెట్టి శ్రీనివాసరావు, దేగల శ్రీరామమూర్తి, అద్దూరి మణికంత తదితరులున్నారు.

## కొణిజేటి ఆశయ సాధనకు కృషి చేయాలి

### -ఆర్య వైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్

పొన్నూరు, జూలై 4, ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య అశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్ కోరారు. కొణిజేటి రోశయ్య 93వ జయంతిని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొణిజేటి రోశయ్య వివిధ పదవులను అలంకరించడం ద్వారా ఆర్యవైశ్యులకు ఎనలేని గౌరవాన్ని తెచ్చిపెట్టారన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావు మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య పొన్నూరు ఆర్యవైశ్యులకు ఎనలేని సేవలందించారన్నారు. ఆర్యవైశ్యుల మైన మనం అపరకర్మశాల నిర్మించుకోగలిగామంటే కొణిజేటి రోశయ్య, స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌ల కృషేనన్నారు. తొలుత కొణిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్యుల్లో కురు వృద్ధుడు అయిన బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కారుమూరి ప్రకాష్ మాట్లాడుతూ బాపనపల్లి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో ఆర్యవైశ్యుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారన్నారు. అనంతరం శ్రీ సహస్రలింగేశ్వరస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా కూడా బాపనపల్లి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పు

చేబ్రోలు(పొన్నూరు), జూలై 4, ప్రభాతవార్త: ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పు కలిగిస్తుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని చేబ్రోలు ఆర్వీఐటీ కళాశాల ఛైర్మన్ ఆర్ వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో శనివారం నో ప్లాస్టిక్ డే సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి వంశీకృష్ణ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కకూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించే విధంగా ఆలోచన చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజస్థాపనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగం ఒక్క మానవులకే కాదు జంతువులకు కూడా హాని కలిగిస్తున్నాయన్నారు. మానవులు ప్లాస్టిక్ వినియోగం వల్లే జంతువులు కూడా బలవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని విరమించుకొని, మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి వాటి ఉపయోగాన్ని పెంచాలన్నారు. విద్యార్థులు ర్యాలీలో ప్లకార్డులు ధరించి ప్లాస్టిక్‌కు నో చెప్పండి...పర్యావరణాన్ని కాపాడండి....గుడ్డ సంచులు ఉపయోగిద్దాం... భవిష్యత్ తరాలను రక్షిద్దాం....సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారిద్దాం వంటి నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌వి కృష్ణయ్య, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ దూళ్ళ శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

RVIT
RV INSTITUTE OF TECHNOLOGY
UGC - AUTONOMOUS
NO
SAY NO TO PLASTIC
CHOOSE

## పల్నాటి చరిత్రను బావితరాలకు అందించాలి

పిడుగురాళ్ల జూలై 4 ప్రభాతవార్త : పల్నాటి చరిత్రను బావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం దాచేపల్లి మండలం గామాలపాడులో నాయకురాలు నాగమ్మ ప్రాంగణంలో టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ఆధ్వర్యాన పలు ఆలయాల శంకుస్థాపన, సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు అంకురార్పణలు చేశారు. శ్రీపార్వతి సమేత చెన్న మల్లిఖార్జునస్వామి ఆలయ జీవ ధ్వజ ప్రతిష్టాపన, టీటీడీ సహకారంతో శ్రీ రాజరాజేశ్వరి సమేత మహారాజ రాజేశ్వరస్వామి ఆలయం, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపనలు జరిపారు. ఉపాలయాల్లో శ్రీ విఘ్నేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. గోశాల, వృద్ధాశ్రమం, అనాధాశ్రమం, కళ్యాణ మండపం నిర్మాణాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే యరపతినేనితోపాటు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, గుంటూరు జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో బీఎల్‌ఏలు, మండల కన్వీనర్లు, పట్టణ అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, కూటమి నేతలతో సర్ కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, యువనేత యరపతి నిఖిల్‌లు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు దిశాదిర్దేశం చేశారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గురజాల, జూలై 4 ప్రభాతవార్త : పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యాన శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిపారు. సహకార వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు గురజాల బ్రాంచ్ మేనేజర్ రజని, ఎంఈవో డాక్టర్ ఆకుల సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఉప్పల రవి, గురజాల పీఏసీఎస్ చైర్మన్ పోటు నాగేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ లింగారెడ్డి, సీఈవోలు పీర్ అహ్మద్, జానీబాషా, గురవయ్య, ఐజాక్, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## *బొల్లా వ్యాఖ్యలు రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శం: యాగంటి*

మాచర్ల, జులై 4 ప్రభాతవార్త: వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఇటీవల నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఆదరణ కోల్పోయిన నాయకులు అసత్య ప్రచారం, వ్యక్తిగత విమర్శలనే రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వల్ల నిజాలు మారవు. ప్రజలకు సమాధానం చెప్పలేని వారు మీడియా ముందు మైకులు పట్టుకుని సంచలన వ్యాఖ్యలు చేస్తే ప్రజలు నమ్మే రోజులు పోయాయి. ఏవైనా ఆరోపణలు ఉంటే చట్టబద్ధమైన సంస్థల ముందు ఆధారాలతో ఉంచాలన్నాన్నారు. లేనిపక్షంలో ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ నాటకంగా మిగిలిపోతాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతుంటే, వాటిని ఎదుర్కోలేక వైసీపీ నాయకులు విష ప్రచారానికి దిగుతున్నారన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడే ధైర్యం లేక వ్యక్తిగత విమర్శలతో రాజకీయ ఉనికి కాపాడుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బొల్లా తన మీద ఉన్న కేసుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చూడటం సిగ్గు చేటు అన్నారు. హైదరాబాదులో ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించి అడ్డంగా దొరికిన మాట వాస్తవం కాదా అన్నారు. తెలంగాణ కలెక్టర్, సబ్ కలెక్టర్, ఎమ్మార్వో సంతకాలు పోర్జరీ చేసి గండిపేటలో ప్రభుత్వ భూమిని కాజేయాలని చూస్తే తెలంగాణ ప్రభుత్వం కేసు పెట్టి జైలుకు పంపించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బొల్లా జైలుకెళ్లడానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు ఏమి సంబంధం అని ప్రశ్నించారు. ఎంపీపై చేసిన అసత్య ఆరోపణలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని బొల్లాను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలు, కూటమి నాయకులు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చక్రధర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

మాచర్ల, జులై 4 ప్రభాతవార్త: ఆచార్య నాగార్జున యూనివర్సిటి ప్రకటించిన ఫోర్త్ సెమ్ ఫలితాల్లో ఫైనల్ బీకాంలో 748 మార్కులతో పి.స్రవంతి మొదటి స్థానం సాధించారు. 741 మార్కులతో ఎస్కే అల్లాబి రెండోస్థానం, 738 మార్కులతో కల్పన మూడోస్థానం సాధించారు. బీఎస్సీ కంప్యూటర్స్‌లో వి.చందు, సీహెచ్ మౌనిక 853 మార్కులతో ప్రథమస్థానం, 830 మార్కుల రెండోస్థానం సాధించారు. కృష్ణకుమారి 824 మార్కులతో మూడోస్థానం సాధించారు. ఎస్కే నజ్మా 811 మార్కులతో నాలుగోస్థానం సాధించారు. అలాగే బీజెడ్‌సీలో 828 మార్కులతో ఎం.సృజన మొదటిస్థానాన్ని సాధించగా 803 మార్కులతో నరసింహారావు రెండోస్థానం, 787 మార్కులతో అనంతలక్ష్మి మూడోస్థానాన్ని సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు బహుమతులతో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, అధ్యాపకులు జక్కా గురవయ్య, ఎన్.ఎఫ్.ఎస్.రాణి, నందిని, కుర్రి పవనేశ్వరరెడ్డి, బరువు రోసిరెడ్డి, ఎస్కే రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్‌పై ఎంపీ, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో దిశానిర్దేశం

మాచర్ల, జులై 4 ప్రభాతవార్త: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరిట ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న సర్వే గడువు ముగుస్తున్న సందర్భంగా ప్రక్రియపై కూమి పార్టీల శ్రేణులను వేగవంతం చేసేలా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు నియోజకవర్గంఓ ఆదివారం బూత్‌లేవల్ కేడర్‌తో సమీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు దుర్గి మార్కెట్ యర్డులో కారంపూడి, దుర్గి, రెంటచింతల మండలాల పరిధిలోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలతో కూటమి పార్టీల శ్రేణులతో సమీక్షిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు మాచర్ల పట్టణంఓని నరిశెట్టి కల్యాణ మండపంలో మాచర్ల పట్టణం, వెల్దుర్తి, మాచర్ల రూరల్ మండలాలకు చెందిన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలతో కూటమి పార్టీల శ్రేణులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు దుర్గి మండలం ధర్మవరంలో పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది.

# సంక్షోభ వేళ.. సరైన నిర్ణయాలు

- ఇంధన సమస్యలను జాగ్రత్తగా పరిష్కరించాం.. • పశ్చిమాసియా యుద్ధ ప్రభావాన్ని తగ్గించాం: ప్రధాని మోడీ

**జోద్‌పూర్,జులై 4:** ప్రపంచ ఇంధన సంక్షోభ సమయంలో ఆచరణాత్మక, విధానపరమైన, దౌత్యపరమైన స్థాయిలలో భారతదేశం తీసుకున్న సున్నితమైన, దూరదృష్టితో కూడిన నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయని ప్రధాని మోడీ అన్నారు. ఈ చర్యలు దేశాన్ని ఒక పెద్ద సంక్షోభం నుండి కాపాడటంలో కీలక పాత్ర పోషించాయి. భారతదేశం తన ఎల్‌పిజి అవసరాలలో సుమారు 60 శాతాన్ని దిగుమతి చేసుకుంటుంది, మరియు ఈ దిగుమతి చేసుకున్న ఎల్‌పిజిలో అధిక భాగం గల్ఫ్ దేశాల నుండి వస్తుంది. పశ్చిమ ఆసియాలో యుద్ధం సరఫరాలకు అంతరాయం కలిగించే ప్రమాదం ఏర్పడింది, ఇది దేశంలో తీవ్రమైన సంక్షోభానికి దారితీసే అవకాశం ఉంది.

**సంక్షోభ సమయంలో ఎల్‌పిజి ఉత్పత్తిలో పెరుగుదల**

మధ్యప్రాచ్య యుద్ధాన్ని ప్రస్తావిస్తూ, ఏప్రిల్ నుండి జూన్ మధ్య కాలంలో పెట్రోల్, డీజిల్ కంపెనీలు మాత్రమే 75 వేల కోట్ల నష్టాన్ని చవిచూశాయని ప్రధాని మోడీ అన్నారు. రాజస్థాన్‌లోని బలోత్రాలో పచ్‌పద్ర రిఫైనరీని ప్రారంభించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఘనత సాధించినందుకు రాజస్థాన్‌ను అభినందిస్తూ, దేశం దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ఇంధన సంక్షోభం పరిష్కారం కోసం ఎదురుచూపులు ఇప్పుడు ముగిశాయని ఆయన అన్నారు. దేశానికి అవసరమైన 90 ఎల్‌పిజి హోర్ముజ్ జలసంధి ద్వారా వచ్చేది. అకస్మాత్తుగా, యుద్ధ పరిస్థితులు ఈ సరఫరాను నిలిపివేశాయి.

కానీ, సవాళ్లను ఎదుర్కోవడం రాజస్థాన్ గడ్డ మనకునేర్పింది. సంక్షోభం ప్రారంభమైన వెంటనే మేము రిఫైనరీపై దృష్టి సారించాము. ఈ మొత్తంతో ఒక రిఫైనరీని నడపవచ్చు. ఏడు రోజుల్లోనే ఎల్పీజీ ఉత్పత్తి పెరిగింది. గతంలో ఉత్పత్తి 35వేల మెట్రిక్ టన్నులు ఉండగా, సంక్షోభ సమయంలో అది 54వేల మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఎల్పీజీని ఉత్పత్తి చేయని రిఫైనరీలు కూడా ఉత్పత్తిని ప్రారంభించాయని గుర్తుచేసారు. దాదాపు 11 లక్షల ఇళ్లకు పిఎన్‌జీ కనెక్షన్లు కూడా అందించబడ్డాయి. 54 వేల మంది యువతకు నియామక పత్రాలు అందజేశారు.

ఈ సమావేశంలో ఆయన రాజస్థాన్‌కు చెందిన సుమారు 54వేల మంది యువకులకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను కూడా అందజేశారు. నియామకాలు పొందిన యువకులందరినీ అభినందిస్తూ, ఈ అవకాశం వారి ఉజ్వల భవిష్యత్తుకు కొత్త బలాన్ని ఇస్తుందని, రాష్ట్ర అభివృద్ధిలో వారు కీలక పాత్ర పోషిస్తారని ప్రధానమంత్రి అన్నారు.

## ఎప్పటికీ జరగని పెళ్లికి టికెట్ బుక్‌చేయాలా?

### సియాగోయల్ స్నాప్‌చాట్‌పై పోలీస్ దర్యాప్తు

**పుణె,జులై 4:** పుణే వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తు ముందుకెళుతున్న కొద్దీ విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితురాలు సియా గోయల్‌కు చెందినట్లు చెబుతున్న స్నాప్‌చాట్ చాటింగ్ ఇప్పుడు కీలకంగా మారింది. ఎప్పటికీ జరగని పెళ్లికోసం టికెట్ బుక్ చేయాలంటే నీ ఆధార్ కార్డు పంపు అంటూ సియా తన స్నేహితురాలికి మెసేజ్‌పంపినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ చాట్ నిజమైనదేనా? హత్యకు ముందు పక్కాప్రణాళికలో భాగమేనా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు. పెళ్లి ఏర్పాట్లు కొనసాగుతున్నాయనే భావన కల్పించి అనుమానాలు రాకుండా చేసేందుకే విమాన టికెట్లు బుక్ చేయాలని భావించినట్లు అనుమానిస్తున్నారు. అయితే ఈ చాట్ ప్రామాణికత ఇంకా నిర్ధారణ కాలేదని అధికారులు స్పష్టం చేశారు. పోలీసుల దర్యాప్తులో మరో కీలకవిషయం బయటపడింది. సియా గోయల్, చేతన్ చౌదరి తమ ఫోన్లలో కోడ్ భాష, మారుపేర్లతో మాట్లాడినట్లు డిలీట్‌చేసిన డేటా రికవరీలో గుర్తించారు. దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకే ఈ పద్ధతి అనుసరించినట్లు భావిస్తున్నారు. ఇద్దరినీ ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారించేందుకు మరో మూడు రోజుల పోలీసు కస్టడీ ఇవ్వాలని పోలీసులు కోర్టునుకోరారు. అయితే కోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో సియా, చేతన్‌లను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

## ప్రపంచాన్ని తప్పుదారి పట్టించేందుకే తెరపైకి సింధుజలాల ఒప్పందం

**న్యూఢిల్లీ,జులై 4:** ఉగ్రవాదానికి పుట్టినిల్లుగా పేరుపడ్డ పాకిస్థాన్, ఇప్పుడు అంతర్జాతీయ సమాజం దృష్టిని మళ్లించేందుకు కొత్త ఎత్తుగడకు తెరలేపింది. తన దేశంలో నెలకొన్న తీవ్ర నీటి సంక్షోభానికి భారత్ కారణమంటూ ఓ కొత్త నాటకాన్ని రక్తికట్టిస్తోంది. దేశంలో భరించలేని ఉష్ణోగ్రతల కారణంగా నీటి కొరత ఏర్పడుతుందన్న భయంతో పాకిస్థాన్ హడావుడిగా ఓ అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది.

సింధు జలాల ఒప్పం దాన్ని భారత్ నిలిపివేయడం వల్లే తమకు ఈ దుస్థితి వచ్చిందని ప్రచారం చేయడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. వాస్తవానికి పాకిస్థాన్‌లో పెరుగు తున్న నీటి కష్టాలకు దాని దశాబ్దాల వైఫల్యాలే కారణం. 2025లో పహల్గామ్‌పై జరిగిన ఉగ్రదాడి తర్వాతే భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలివి వేసింది. పహల్గామ్ దాడి తర్వాత సహనం నశించి, "రక్తం, నీళ్లు కలిసి ప్రవహించవు" అని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఒప్పందాన్ని పునరుద్ధరించేది లేదని భారత్ స్పష్టం చేసింది. ఈ వాస్తవాలను దాచిపెట్టి పాకిస్థాన్ మంత్రులు, బిలావల్ భుట్టో వంటి నేతలు అణుయుద్ధం వస్తుందంటూ బెదిరింపులకు దిగుతున్నారు.

**పాకిస్థాన్ వైఫల్యాలే అసలు కారణం**

పాకిస్థాన్ ఆరోపిస్తున్నట్టుగా ఈ నీటి సంక్షోభం భారత్ వల్ల వచ్చింది కాదు. దశాబ్దాలుగా నీటి యాజమాన్యాన్ని నిర్లక్ష్యం చేయడం, సరైన నిల్వ సామర్థ్యం లేకపోవడం, ప్రావిన్సుల మధ్య అంతర్గత వివాదాలే దీనికి మూల కారణాలు. నీటి ఎద్దడి ఉన్నదేశంలో వరి, చెరకువంటి అధిక నీటిని వినియోగించే పంటలను విరివిగా పండించడం కూడా ఈసంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది.

## ఖమేనీ అంతిమయాత్ర ఆరంభం

### ఎర్ర జెండాలతో వేలాదిగా వచ్చిన అభిమానులు

### 'డెత్ ఆఫ్ అమెరికా' అంటూ నినాదాలు

**టెహ్రాన్, జులై 4:** ఇరాన్ దివంగత నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ అంతిమయాత్ర అధికారికంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఖమేనీతోపాటు మృతి చెందిన కుటుంబసభ్యుల శవపేటికలనూ మద్దతుదారుల సందర్శనార్థం రాజధాని నగరం టెహ్రాన్‌లో ఉంచారు. వాటిల్లో ఆయన 14 నెలల మనవరాలు జహ్రా మొహమ్మదీ శవపేటిక కూడా ఉంది. దాని పక్కనే ఆ చిన్నారి ఫొటో ఫ్రేమ్‌ను ఉంచారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ నిర్వహించిన సంయుక్త దాడుల్లో 86 యేళ్ల ఖమేనీతోపాటు ఆయన కుటుంబసభ్యులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. నాలుగునెలల తర్వాత వీరి అంతిమ సంస్కారాలను నిర్వహిస్తున్నారు. ఇరాన్, ఇరాక్‌లోని ఐదు నగరాల్లో ఏడు రోజులపాటు ఈ అంత్యక్రియలు జరగనున్నాయి. ఖమేనీ పార్థివదేహాన్ని ఆయన సొంత పట్టణం ఇరాన్‌లోని మషహద్‌లో ఈ నెల 9న ఖననం చేయనున్నారు. ఈ రోజు ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆయనకు శ్రద్ధాంజలి ఘటించేందుకు వేలాది మంది తరలివచ్చారు. వారంతా ప్రతీకారానికి గుర్తుగా ఎర్ర జెండాలను పట్టుకొని.. 'డెత్ ఆఫ్ అమెరికా' అంటూ నినాదాలు చేసినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. కాగా.. ఖమేనీతో సన్నిహితంగా పనిచేసిన నాయకులు ఉద్వేగానికి గురయ్యారు. విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ ఆయనను గుర్తుచేసుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు.

**ట్రంప్ వ్యాఖ్యలు వివాదాస్పదం..**

ఈ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. 'ఇరాన్‌ను చిత్తుగా ఓడించాం. దాంతో వారు రాజీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మనం మంచివాళ్లం కాబట్టి.. అంత్యక్రియల కోసం వీకాఫ్ ఇచ్చాం' అని సౌత్ డకోటాలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.

**కనిపించని మొజ్తాబా ఖమేనీ..**

కాగా అలీ ఖమేనీ అంత్యక్రియల్లో కుమారుడు మొజ్తాబా ఖమేనీ కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి బయటి ప్రపంచానికి కనిపించని ఆయన.. ఇప్పుడు తండ్రి అంత్యక్రియలకూ రాకపోవడం గమనార్హం. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతలతో భద్రతాపరమైన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన తండ్రి అంత్యక్రియలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని సమాచారం.

## బలూచిస్థాన్‌లో భారీ ఉగ్రదాడి

### 30 మంది భద్రతా సిబ్బంది మృతి

**గ్వదర్,జులై 4:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రాంతంలో మరో భారీ దాడి జరిగినట్లు బలూచ్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. గ్వదర్ జిల్లాలోని జీవానీ పరిధిలో ఉన్న పన్వాన్ ప్రాంతంలోని పాకిస్థాన్ కోస్ట్ గార్డ్స్ క్యాంపును లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు తెలిపింది. ఈ ఘటనలో 30 మందికిపైగా భద్రతా సిబ్బంది మృతి చెందారని, మరికొందరు గాయపడ్డారని పేర్కొంది. బిఎల్‌ఎ చేసిన ఈ ప్రకటనపై పాకిస్థాన్ సైన్యం లేదా కోస్ట్ గార్డ్స్ నుంచి అధికారిక ధ్రువీకరణ రాలేదు. బలూచ్ లిబరేషన్ ఆర్మీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, తమ మజీద్ బ్రిగేడ్‌కు చెందిన సభ్యుడు పేలుడు పదార్థాలతో నింపిన మాజ్దా వాహనాన్ని కోస్ట్ గార్డ్స్ క్యాంపులోకి తీసుకెళ్లి పేల్చినట్లు బిఎల్‌ఎ పేర్కొంది. ఈ భారీ పేలుడు కారణంగా కోస్ట్ గార్డ్స్ క్యాంపు తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలిపింది. పేలుడు అనంతరం తమ ఫతేహ్ స్క్వాడ్‌కు చెందిన సభ్యులు క్యాంపుపై దాడి చేసినట్లు వెల్లడించింది. పేలుడు నుంచి బయటపడిన భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగించినట్లు పేర్కొంది.

ఘటనలో 30 మందికిపైగా పాకిస్థాన్ భద్రతా సిబ్బంది మృతి చెందినట్లు బిఎల్‌ఎ ప్రకటించింది. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపింది. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకుని ఉండవచ్చని, గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నందున మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఘటన జరిగిన వెంటనే పాకిస్థాన్ సైన్యం లేదా కోస్ట్ గార్డ్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తి వివరాలను కూడా బిఎల్‌ఎ తన ప్రకటనలో వెల్లడించింది. అతడిని అత్తావుల్లా

## 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం

### వారిలో 17 మంది పాకిస్థానీయులు, ఆరుగురు భారతీయులు

**న్యూఢిల్లీ, జులై 4:** పాకిస్థాన్ గడ్డపైనుంచి ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న 23 మందిని చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) కింద ఉగ్రవాదులుగా కేంద్రం ప్రకటించింది. వీరిలో జైష్‌ఎమహ్మద్ (జెఇఎం), లష్కరే తోయిబా (ఎల్‌ఇటి)తో పాటు వాటి అనుబంధ సంస్థలకు చెందిన కీలక నేతలు ఉన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఉగ్రదాడులు, ఉగ్రవాదుల నియామకం, నిధుల సమీకరణ, ఆయుధాల అక్రమ రవాణా, సరిహద్దు చొరబాట్లు, ఉగ్ర సంస్థలకు సహకారం వంటి కార్యకలాపాల్లో వీరు పాల్గొంటున్నట్లు పేర్కొంది.

ఈ 23 మందిలో 17 మంది పాకిస్థాన్ పౌరులు, ఆరుగురు భారతీయులు ఉన్నారు. ప్రస్తుతం వీరంతా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని కేంద్రం తెలిపింది. ఈ జాబితాలో జైష్‌కు చెందిన మసూద్ ఇల్యాస్ కశ్మీరీ, మొహమ్మద్ ముసద్దిక్, ముఫ్తీ మహ్మద్ అస్గర్ ఖాన్, అబ్దుల్లా జెహాదీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరు ఉగ్రవాదుల శిక్షణ, నియామకం, భారత్‌లోకి చొరబాట్లు, దాడుల ప్రణాళికలో కీలక పాత్ర పోషించినట్లు కేంద్రం ఆరోపించింది. 2022 సుంజ్వాన్ దాడి, 2016 నాగ్రోటా ఆర్మీ క్యాంప్‌పై దాడులతోనూ వీరికి సంబంధాలు ఉన్నట్లు పేర్కొంది. లష్కరే తోయిబాకు చెందిన ఫిర్దౌస్ అహ్మద్ భట్, హరూన్ రషీద్ గనాయ్ తో పాటు మరికొందరినీ ఉగ్రవాదుల జాబితాలో చేర్చారు. వీరు ఆయుధాల సరఫరా, యువతను ఉగ్రవాదంలోకి ఆకర్షించడం, దాడులకు అవసరమైన లాజిస్టిక్ సహాయం అందించినట్లు ప్రభుత్వం తెలిపింది.

2019లో యూఏపీఏ సవరణల తర్వాత ఉగ్ర సంస్థలతో పాటు వ్యక్తులను కూడా నేరుగా ఉగ్రవాదులుగా ప్రకటించే అధికారం కేంద్రానికి లభించింది. అదే అధికారాన్ని వినియోగిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## మెసేజింగ్‌యాప్ టెలిగ్రామ్‌కు కేంద్ర ఐటిశాఖ నోటీసులు

**న్యూఢిల్లీ,జులై 4:** పైరసీ కంటెంట్ విషయంలో ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌కు కేంద్ర ప్రభుత్వం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. తమ ప్లాట్‌ఫామ్‌పై చట్టవిరుద్ధంగా చలామణి అవుతున్న పైరేటెడ్ సినిమాలు, ఒటిటి కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. దీనిపై తీసుకున్న చర్యల గురించి 15 రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నేడు టెలిగ్రామ్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న క్రియేటర్ ఎకానమీ, చిత్ర పరిశ్రమ, బ్రాడ్‌కాస్టర్లు, ఒటిటి ప్లాట్‌ఫామ్‌లు, నిర్మాతలు, పంపిణీదారులను డిజిటల్ పైరసీ బారి నుంచి కాపాడే లక్ష్యంతో కేంద్రం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు విడుదలైన కొద్ది గంటల్లోనే టెలిగ్రామ్ ఛానెళ్ల ద్వారా పైరసీకి గురవుతుండటంతో పరిశ్రమ వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రంగంలోకి దిగింది.

నీట్‌యూజీ 2026 పునఃపరీక్ష సందర్భంగా మోసాలను అరికట్టేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ జూన్ 22 వరకు టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా బ్లాక్ చేసిన విషయం తెలిసిందే. పరీక్షలో అక్రమాలకు పాల్పడేందుకు కొన్ని ముఠాలు ఈ యాప్‌ను వ్యవస్థీకృతంగా వాడుతున్నాయని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టెలిగ్రామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా చుక్కెదురైంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం చట్టప్రకారమే తన అధికారాలను ఉపయోగించిందని, ఈ ఆంక్షలు సమంజసమేనని జస్టిస్ తేజస్ కరియా ధర్మాసనం తీర్పునిచ్చింది. ఒకవైపు టెలిగ్రామ్‌కు పైరసీపై ఆదేశాలు జారీ చేసిన కేంద్రం, మరోవైపు మెటా యాజమాన్యంలోని వాట్సాప్‌పైనా దృష్టి సారించింది. వాట్సాప్ తీసుకురావాలనుకుంటున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పై సంప్రదింపులు పూర్తయ్యే వరకు దానిని భారత్‌లో ప్రారంభించవద్దని మెటాను ఆదేశించింది. దీనిపై స్పందించిన వాట్సాప్, ఈ ఫీచర్ ఐచ్ఛికమని, మోసాలు, నకిలీ ఖాతాలను నివారించేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వానికి వివరణ ఇచ్చింది.

## నా వార్తలే చదువుతా..

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, జులై 4:** తాను ఖాళీ సమయాల్లో ఎక్కువగా వార్తాపత్రికలే చదువుతానని, అందులోనూ తన గురించి వచ్చిన కథనాలే చూస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. 'స్టోరీ టైమ్ విత్ సెకండ్ లేడీ' పేరిట అమెరికా ఉపాధ్యక్షుడి సతీమణి ఉషావాన్స్ హోస్ట్ చేసిన పాడ్‌కాస్ట్‌లో అధ్యక్షుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైట్‌హౌస్ హిస్టారికల్ అసోసియేషన్ ప్రచురించిన 'ప్రెసిడెంట్స్ ప్లే!' పుస్తకాన్ని చదివి వినిపించారు. అందులో ప్రస్తావించిన మాజీ అధ్యక్షుల ఆసక్తుల గురించి పేర్కొన్నారు. వైట్‌హౌస్ ప్రాంగణంలో నిర్మిస్తోన్న బాల్‌రూమ్ గురించి మాట్లాడారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సం (జులై 4) సందర్భంగా ఈ పాడ్‌కాస్ట్ వీడియోను ఉష ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ఈ 'ప్రెసిడెంట్స్ ప్లే!' పుస్తకంలో ఒక అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో సూపర్ బౌల్ (యేటా జరిగే ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్) లైవ్ చూసిన ఫొటోను పొందుపర్చారు. ఆదృశ్యాన్ని ట్రంప్ ఈ పాడ్‌కాస్ట్‌లో చూపిస్తూ.. 'ఇది చూస్తే నాకు ఒక ఐడియా వచ్చింది. ఫుట్‌బాల్ చూసేందుకు బరాక్ ఒబామా, జో బైడెన్, బుష్ కుటుంబాలను ఆహ్వానిస్తే బాగుంటుందేమో. ప్రెసిడెంట్స్ రీయూనియన్ మాదిరిగా ఉంటుంది. అదే జరిగితే ప్రెస్ హోరెత్తుతుందేమో' అని సరదాగా అన్నారు. అమెరికాకు అధ్యక్షులుగా పనిచేసిన వారు ఖాళీ సమయంలో ఏమి చేసేవారో ట్రంప్ వెల్లడించారు. 'మామూలుగా ఒక అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో గడిపే సమయం చాలా తక్కువ. ప్రజల కోసం పనిచేస్తాం కాబట్టి అక్కడ ఉండటం ఒక గౌరవం. బిల్‌క్లింటన్ తన కోసం నిర్మించిన ట్రాక్‌పై జాగింగ్ చేసేవారు. ఈ విషయం నాకు ఇటీవలే తెలిసింది. నేనైతే అలా చేయలేను అనుకుంటా. క్లింటన్ మంచి మనిషి ఆయనంటే నాకు ఇష్టమే' అంటూ కొనియాడారు.

## వేడి తీవ్రతతో స్వాతంత్ర్య దినోత్సవ పెరేడ్ రద్దు

ET NOW
ETNOW.IN
AMERICA 250

**వాషింగ్టన్,జులై 4:** అమెరికా తన 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాషింగ్టన్‌లో నిర్వహించాల్సిన సాంప్రదాయ స్వాతంత్ర్య దిన పరేడ్‌ను తీవ్ర వేడి కారణంగా రద్దు చేశారు. ఈ ఉదయం జరగాల్సిన ఈపరేడ్ అత్యధిక ఉష్ణోగ్రత వల్ల రద్దు అయిందని నిర్వాహకులు ప్రకటించారు. జాతీయ వాతావరణ సంస్థ ప్రకారం, సుమారు 16 కోట్ల అమెరికన్లు తీవ్ర వేడి హెచ్చరికలు ఎదుర్కొంటున్నారు. తూర్పు అమెరికాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాషింగ్టన్‌లోని నేషనల్ మాల్‌లో జరిగే ఉత్సవాలు కూడా వేడి తీవ్రత కారణంగా మధ్యాహ్న భాగం రద్దు చేయాల్సి వచ్చింది. మరోవైపు, వేడిమికి తట్టుకోలేక అస్వస్థతకు గురైన ఒక యువతిని ఆసుపత్రికి తరలించారు. గ్రేట్ అమెరికన్ స్టేట్ ఫేర్ కార్యక్రమాన్ని కూడా తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. న్యూయార్క్‌లో హీట్ ఇండెక్స్ 105 ఫారెన్‌హీట్ (41 డిగ్రీల సెల్సియస్)కి చేరుకుంది. విద్యుత్ గ్రిడ్లపై భారీ ఒత్తిడి పడుతోంది. వేలాది మందికి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఈ తీవ్ర వేడి అమెరికా స్వాతంత్ర్య దినోత్సవాలు, ఫిఫా వరల్డ్ కప్ మ్యాచ్‌లు, విద్యుత్ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫిఫా ఈ వరల్డ్ కప్ మ్యాచ్‌ల్లో హైడ్రేషన్ బ్రేకులు తప్పనిసరి చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ వేడిని ఎదుర్కోవడానికి కూలింగ్ సెంటర్లు, స్విమ్మింగ్ పూల్స్ సమయం పొడిగించడం వంటి చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది అమెరికా స్వాతంత్ర్యానికి 250 ఏళ్లు పూర్తవుతున్న విశేష సందర్భం కావడంతో భారీ ఉత్సవాలకు ప్రణాళిక రూపొందించారు. అయితే ప్రకృతి వైపరీత్యాలు ఆ ఉత్సవాలపై పెను ప్రభావం చూపాయి.

## సంక్షిప్త వార్తలు

### ఉమర్‌ఖలీద్, షార్జిల్ ఇమామ్‌ల బెయిల్‌పై తీర్పు రిజర్వు

**న్యూఢిల్లీ,జులై 4:** ఢిల్లీలో 2020 నాటిఅల్లర్ల వెనుక కుట్రకు పాల్పడ్డారన్న ఆరోపణలతో అరెస్టయిన ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ దాఖలు చేసిన తాజా బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ కోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. శనివారం ఇరుపక్షాల వాదనలను విన్న అదనపు సెషన్స్ జడ్జి సమీర్ బాజ్‌పాయ్, తీర్పు వెల్లడిని సాయంత్రానికి వాయిదావేశారు. విచారణ ప్రారంభం కాకుండానే తాము సుదీర్ఘ కాలంగా జైలులో ఉన్నామని, ఇది రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ తమ పిటిషన్లలో పేర్కొన్నారు. మారిన పరిస్థితుల్లో దృష్ట్యా, విచారణలో జాప్యం జరిగితే కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) కింద కూడా బెయిల్ మంజూరు చేయవచ్చని సుప్రీంకోర్టు ఇటీవల పలు కేసుల్లో స్పష్టం చేసిన విషయాన్ని వారు ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు.

### టేలర్ స్విఫ్ట్ వివాహవేడుకలో వజ్రాలగిఫ్ట్‌లు!

**న్యూయార్కు,జులై 4:** ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తి రేపిన పాప్ సింగర్ టేలర్ స్విఫ్ట్, అమెరికన్ ఫుట్‌బాల్ స్టార్ ట్రావిస్ కెల్సీల వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఈ జంట ఒక్కటైన విషయం తెలిసిందే. అయితే, పెళ్లికి ముందు రోజు జరిగిన రిహార్సల్ డిన్నర్‌లో అతిథులకు వారు ఇచ్చిన ఖరీదైన బహుమతులు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఈ వేడుకకు హాజరైన ప్రతిఒక్కరికీ వజ్రాలు పొదిగిన షాంపైన్ గ్లాసులు బహుమతిగా ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లోని ఇన్ఫోసిస్ థియేటర్‌లో ఈ రిహార్సల్ డిన్నర్ జరిగింది. సుమారు 100మంది సన్నిహితులు, కుటుంబ సభ్యులు, సెలబ్రిటీలు ఇందులో పాల్గొన్నారు.

### మమతకు మరోషాక్: రాష్ట్ర అధ్యక్షురాలు రాజీనామా

**కోల్‌కతా, జులై 4:** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ సంక్షోభం మరింత తీవ్ర రూపం దాల్చింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితురాలిగా గుర్తింపు పొందిన సీనియర్ నాయకురాలు, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రిమ భట్టాచార్య తన పదవులన్నింటికీ రాజీనామా చేశారు. శనివారం ఆమె ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కేవలం రాష్ట్ర అధ్యక్షపదవికే కాకుండా, పార్టీ బ్యాంకు ఖాతాల ఆథరైజ్డ్ సిగ్నేచరీగా, ఎన్నికల సంఘం వద్ద పార్టీ ప్రతినిధిగా కూడా తన బాధ్యతల నుంచి ఆమె తప్పుకున్నారు. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టిఎంసి ఘోర పరాజయాన్ని చవిచూసిన విషయం తెలిసిందే. చంద్రిమ రాజీనామాపై మమత బెనర్జీ వర్గం నేతలు స్పందించారు. పార్టీలో కీలక పదవులను అనుభవించి, ఇప్పుడు ఇలా వ్యవహరించడం సరైనది కాదని ఎమ్మెల్యే కునాల్ ఘోష్ అభిప్రాయపడ్డారు. టిఎంసి క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోతోందనడానికి ఇదే నిదర్శనమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య వ్యాఖ్యానించారు.

### ముస్లిం మైనార్టీలే లక్ష్యంగా కూల్చివేతలు

**న్యూఢిల్లీ, జులై 4:** దేశంలోని రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో మసీదులు, దర్గాలు, నివాస ప్రాంతాలపై జరుగుతున్న కూల్చివేతల చర్యలు ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్నవేనని జమాత్‌ఏఇస్లామీ హింద్ ఆరోపించింది. సంస్థ ఉపాధ్యక్షుడు సలీం ఇంజినీర్ మాట్లాడుతూ మతపరమైన నిర్మాణాలపై ఎంపికచేసి చర్యలు తీసుకోవడం అత్యంత ఆందోళనకరమన్నారు. అభివృద్ధి, భద్రతపేరుతో చట్టబద్ధమైన విధానాలను పాటించకుండా కూల్చివేతలు చేపడుతున్నారని, ప్రజల్లో భయం సృష్టించే ప్రయత్నమే జరుగుతోందని విమర్శించారు. అలాగే ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కూడా జమాత్‌ఏఇస్లామీ హింద్ అభ్యంతరం వ్యక్తం చేసింది.

### వైద్యురాలి హత్యకేసులో బీహార్ ఎమ్మెల్యేకు నాలుగేళ్ల జైలు

**పాట్నా,జులై 4:** బీహార్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజు కుమార్ సింగ్‌కు ఢిల్లీ కోర్టు షాకిచ్చింది. మహిళా వైద్యురాలిని చంపిన కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. 2018 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జరిగిన సెలబ్రేటరీ ఫైరింగ్‌లో మహిళా వైద్యురాలు డాక్టర్ అర్చనా గుప్తా మృతి చెందిన కేసులో దోషిగా తేల్చిన కోర్టు.. నాలుగేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు ఆయుధ చట్టం ఉల్లంఘన కేసులో మరో రెండు నెలల జైలు శిక్ష విధించింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గొగ్నే ఈ తీర్పు వెలువరించారు.

## కార్మిక, కర్షకుల కోసం పోరాడిన వంగవీటి మోహన రంగా

నిజాంపట్నం, జులై 4, ప్రభాతవార్తః కార్మిక,కర్షకుల కోసం ప్రజల సమస్యలే తన సమస్యలుగా పోరాడిన మహానాయకుడు స్వర్గీయ వంగవీటి మోహనరంగా అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం స్వర్గీయ రంగా జయంతి సందర్భంగా మండలంలోని కూచినపూడి, కోనఫలం, అడవులదీవి తదితర గ్రామాల్లో వంగవీటి మోహనరంగా విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కాపు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి రంగా సేవలు చిరస్మరణీయం: మోపిదేవి

రేపల్లె, జూలై 4, ప్రభాతవార్త:అణగారిన వర్గాల ప్రజలకు అండగా రాబిన్ హుడ్ లాంటి గుర్తింపు తెచ్చుకున్న స్వర్గీయ వంగవీటి మోహనరంగా సేవలు చిరస్మరణీయమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత,ప్రముఖ వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు అన్నారు. శనివారం వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దివంగత వంగవీటి మోహనరంగా, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహానుభావుల జయంతి రోజునే పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలంలోని కాటూరు గ్రామంలో 1947 జూలై 4వ తేదీ రంగా జన్మించారని తెలిపారు. 1970లో విజయవాడకు చేరుకున్నప్పటి నుంచి విద్యార్థి,యువజన నాయకుడుగా గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. జైలులో ఉన్న సమయంలోనే 1981లో కృష్ణలంక మున్సిపల్ కార్పొరేటర్‌గా (ఇండిపెండెంట్) విజయం సాధించిన ఘనత రంగాకు దక్కిందన్నారు. 1985లో కాంగ్రెస్ పార్టీ తరపున విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారన్నారు. 1988 డిసెంబరు 26వ తేదీ ప్రత్యర్థుల దాడిలో దారుణ హత్యకు గురయ్యే వరకు వంగవీటి మోహనరంగా ప్రజల సంక్షేమం కోసమే పనిచేశారని మోపిదేవి శ్రీనివాసరావు గుర్తు చేశారు. వంగవీటి మోహనరంగా ఒక కులానికో ఒక ప్రాంతానికో చెందిన వ్యక్తిగా కాకుండా అందరికీ చెందిన వ్యక్తిగా చెరగని ముద్ర వేసుకున్నారని మోపిదేవి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో పేదల పక్షపాతిగా కీలకపాత్ర పోషించారన్నారు. విజయవాడలో శాంతిభద్రతల పరిరక్షణకు, అభాగ్యులకు అండగా తనదైన శైలిలో ఉద్యమాలు నిర్వహించి సామాజిక న్యాయమే లక్ష్యంగా రంగా అవలంభించిన విధానాలను తెలుగు ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని మోపిదేవి శ్రీనివాసరావు వెల్లడించారు. సీనియర్ రాజకీయవేత్త, మాజీ కౌన్సిలర్ బేతపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం పనిచేసిన నాయకులు చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. వంగవీటి మోహనరంగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా శ్రేణులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## మాజీ సిఎం జగన్‌పై మంత్రి అనగాని విమర్శలు అర్ధరహితం: మోపిదేవి శ్రీనివాసరావు

రేపల్లె, జూలై 4, ప్రభాతవార్త:వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యక్తిగత దూషణలకు పాల్పడటం విచారకరమని వైకాపా సీనియర్ నేత, ప్రముఖ వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ లోపాలు ఉంటాయని వాటిని దృష్టిలో ఉంచుకుని ప్రవర్తించాలని హితవు పలికారు. తాము సైతం వ్యక్తిగత విమర్శలకు దిగితే ఎలా ఉంటుందో మంత్రి అనగాని ఆలోచించుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం అడుగంటిపోయిందని, ప్రజలలో వ్యతిరేకత పెరిగిపోయిందని చెప్పారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి పాలనకు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. 2029 ఎన్నికలలో వైఎస్ జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, రేపల్లె నియోజకవర్గంలో వైఎస్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. పార్టీ అధిష్టాన వర్గం అభ్యర్థిగా ఎవరిని నిర్ణయించినా విజయం తథ్యమన్నారు. నాటి జగన్ పాలనలో అమలైన నవరత్న పథకాలను ప్రజలు మర్చిపోలేకపోతున్నారని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి ప్రశ్నిస్తే రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మోపిదేవి శ్రీనివాసరావు ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను పక్కదారి పట్టిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీలపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. గొడ్డలి పార్టీ, సైకో, గంజాయి బ్యాచ్ అంటూ విమర్శలు చేయడం అర్ధరహితమన్నారు. శాడిజాన్ని ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వం తీరు అగ్రభాగాన నిలిచిందని చెప్పారు. వివేకానందరెడ్డి మరణానికి గొడ్డలిపార్టీ కారణమని చేస్తున్న విమర్శలకు ఆధారాలు చూపుతారా అని శ్రీనివాసరావు ప్రశ్నించారు. రాజధానికి మావగన్ పేరుతోనే ఆయా ప్రాంతాల అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. అమరావతి భూముల పేరిట వాణిజ్యదందా జరుగుతున్నదని ఆయన ఆరోపించారు. తిరిగి వైఎస్ఆర్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి జిల్లాకు ఓ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడానికి జగన్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైద్యం, విద్య, వ్యవసాయరంగం అభివృద్ధి సాధ్యపడుతుందని ఆయన వివరించారు. తాను రేపల్లె నియోజకవర్గం నుండి 3 సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన అనుభవంతో వైసీపీలో చేరటంతో కార్యకర్తలలో ఉత్సాహం పెరిగిందని పార్టీని బలోపేతం చేసేందుకు రేపల్లె నియోజకవర్గంలో పర్యటిస్తున్నానని మోపిదేవి పేర్కొన్నారు. వైసీపీని నిర్వీర్యం చేసే అధికారపార్టీ ఆటలు సాగవని ఆయన హెచ్చరించారు. రాజకీయాలలోకి వచ్చిన దగ్గర్నుంచి తనకు ఎటువంటి పదవి లేకపోయినా వ్యాపారాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని రేపల్లె నియోజకవర్గంలో చర్చిలు, దేవాలయాల సేవా కార్యక్రమాల నిర్వహణకు వినియోగిస్తున్నానని, ప్రజల సంక్షేమమే తనకు ముఖ్యమని ఆయన వివరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బేతపూడి కోటేశ్వరరావు, బెల్లంకొండ చిట్టిబాబు, యు. శ్రీనివాసరావు, జి. రత్నప్రసాద్, వై. సుబ్బారావు, చదలవాడ శ్రీనివాసరావు, కొలుసు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టకుంటే ఆందోళన తప్పదు

రేపల్లె, జూలై 4, ప్రభాతవార్త:మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రాతినిథ్యం వహిస్తున్న రేపల్లె నియోజకవర్గంలోని అక్కిలేరు వాగు కట్ట 5 అడుగుల లోతులో అర కిలోమీటరు పొడవున నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న తవ్వకాలను అరికట్టకుంటే ధర్నాకు పూనుకుంటామని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ హెచ్చరించారు. శనివారం అక్కిలేరు వాగు ప్రాంతాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో జగనన్న కాలనీ వరద ముంపుకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని అక్రమ తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రెండేళ్ళుగా చేస్తున్న అభివృద్ధి ఇదేనా అంటూ మంత్రి అనగాని ధోరణి మార్చుకోవాలని పీటా నాగమోహన్‌కృష్ణ హెచ్చరించారు.

## వంగవీటి,అల్లూరి జయంతి వేడుకలు

రేపల్లె, జూలై 4, ప్రభాతవార్త:బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత వంగవీటి మోహన్‌రంగా 79వ జయంతి సందర్భంగా శనివారం ఓల్డుటౌన్‌లోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. 5వ వార్డులోని వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుది శ్వాస విడిచే వరకు ప్రజల సంక్షేమాన్ని వంగవీటి మోహన్‌రంగా కోరుకున్నారని చెప్పారు. అనంతరం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన తెలుగుజాతి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు సేవలు చిరస్మరణీయమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కరేటి శేషగిరిరావు, చిమటా బాలాజీ, యార్లగడ్డ మదన్‌మోహన్, మండల, నియోజకవర్గ, రాష్ట్రస్థాయి పదవులలోని నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా ఆధ్వర్యంలో రంగా జయంతి

రేపల్లె, జూలై 4, ప్రభాతవార్త:పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం స్వర్గీయ వంగవీటి మోహన్‌రంగా 79వ జయంతి వేడుకలను నిర్వహించారు. వంగవీటి మోహన్‌రంగా చిత్రపటానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూడి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, సాంబశివరావు, గుర్రం మురారిరావు, వేంకా రామకృష్ణ, తాతా ఏడు కొండలు, అగస్త్య తదితరులు పాల్గొన్నారు.

# ఆప్కో. ఓ బలమైన సహకార ఉద్యమం

### రేపు సంస్థ స్వర్ణోత్సవాలు

### చేనేత సంరక్షణలో వేలాది నేతకుటుంబాలకు భరోసా

**విజయవాడ, జూలై 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ చేనేత పారిశ్రామికుల సహకార సంఘం (ఆప్కో) జూలై 6న స్వర్ణోత్సవాన్ని జరుపుకోనుంది. ఇది కేవలం ఒక ప్రభుత్వ సంస్థగా అర్ధ శతాబ్దం వేడుక మాత్రమే కాదు.. రాష్ట్ర చేనేత సంప్రదాయాన్ని కాపాడుతూ, వేలాది నేత కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించిన ఐదు దశాబ్దాల ప్రయాణానికి గుర్తుగా నిలిచే చారిత్రక సందర్భం. 1976 జూలై 6న హైకో ఫ్యాబ్రిక్స్, రాయా ఫ్యాబ్రిక్స్, ఆంధ్ర హ్యాండ్లూమ్స్ అనే మూడు ప్రాంతీయ సంస్థలను విలీనం చేసి ఆప్కోను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక చేనేత సహకార సంఘాల ద్వారా తయారయ్యే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, నేతలకు నిరంతర ఉపాధి కల్పించడం, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, సంప్రదాయ చేనేత కళను పరిరక్షిచడం ప్రధాన లక్ష్యంగా ఆప్కో కొనసాగుతోంది. ఐదు దశాబ్దాల కాలంలో ఆప్కో దేశంలోనే ప్రముఖ చేనేత మార్కెటింగ్ సంస్థగా ఎదిగింది. ప్రస్తుతం రాష్ట్రంలోని వెయ్యికి పైగా ప్రాథమిక చేనేత సహకార సంఘాల ఉత్పత్తులను సేకరించి దేశవ్యాప్తంగా సుమారు 80 విక్రయకేంద్రాల ద్వారా వినియోగదారులకు అందిస్తోంది. కాలానుగుణంగా ఈకామర్స్, డిజిటల్ మార్కెటింగ్‌నుకూడా అందిపుచ్చుకుని ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు చేరువయ్యింది.

**చంద్రబాబు నాయకత్వంలో చేనేతకు కొత్త ప్రోత్సాహం:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి కొత్త ఊపునిస్తోంది. నేతన్నల ఆదాయం పెంచడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, సంప్రదాయ చేనేతకు మార్కెట్ విస్తరించడం లక్ష్యంగా పలు నిర్ణయాలు తీసుకుంది. ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించింది. 2025లో ఆప్కో బ్లీచింగ్, డైయింగ్ చార్జీలను గణనీయంగా పెంచింది. బెడ్‌షీట్లు, టవళ్లను నేసే చేనేత కార్మికుల రోజువారీ కూలీలను కూడా పెంచింది. ఈ మార్పుల వల్ల ఒక్కో నేతకు రోజుకు సగటున రూ.108 అదనపు ఆదాయం లభిస్తోంది. ఐదు దశాబ్దాలుగా వేలాది నేత కుటుంబాలకు అండగా నిలుస్తూ, సంప్రదాయాన్ని సజీవంగా ఉంచుతూ, చేనేతకు మార్కెట్ కల్పిస్తూ సాగుతున్న ఆప్కో ప్రయాణం ఆంధ్రప్రదేశ్ చేనేతచరిత్రలో ఒక స్ఫూర్తిదాయక అధ్యాయంగా నిలిచిపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సహకార సంఘం (ఆప్కో) స్వర్ణోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం 4 గంటలకు గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఎర్రబాలెంలోని ఆప్కో సముదాయంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, హెచ్ఆర్‌డీ, ఎలక్ట్రానిక్స్ రియల్ టైమ్‌గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక ముఖ్యఅతిథిగా, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ముఖ్య అతిథిగా హాజరవుతారు. రాష్ట్ర ప్రభుత్వ చేనేత–హస్తకళల అభివృద్ధి గౌరవ సలహాదారు డాక్టర్ సుచిత్ర ఎల్లా, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా, చేనేత జౌళిశాఖ కమిషనర్ జి. రేఖారాణి, సంస్థ వైస్‌చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె. కన్నబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

# అక్రమ లేఅవుట్‌లకు గ్రావెల్ తరలింపు: ఆర్ఐ ఆకస్మిక తనిఖీ

### మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతులు లేవన్న ఆర్ఐ

**అనుమసముద్రంపేట (నెల్లూరు), జులై 4, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలంలోని సర్వే నెంబర్లు 144/38, 144/3సి, 145/1ఎ, 145/2లో జరుగుతున్న లే అవుట్ అభివృద్ధి పనులకు ఎలాంటి రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతులు లేకుండానే భారీ ఎత్తున గ్రావెల్ తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో శనివారం మైన్స్ శాఖ ఆర్ఐ సి. హెచ్. స్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక విఆర్ఓ కృష్ణప్రసాద్‌ను వెంట తీసుకొని లే అవుట్ ప్రాంతాన్ని పరిశీలించిన ఆర్ఐ అక్కడ సుమారు 35 టిప్పర్ల మేర చదును చేయకుండా నిల్వ ఉంచిన గ్రావెల్‌ను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఇదే లే అవుట్‌కు గతంలో నక్కలవాగు, అనంతరం ప్రవేటు వ్యవసాయ భూముల నుంచి మట్టి గ్రావెల్ తరలింపుపై ఫిరానయదులు రావడంతో అధికారులు తనిఖీలు నిర్వహించి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత నాలుగురోజులపాటు రవాణా నిలిచిపోయినప్పటికీ గత మూడు రోజులుగా మళ్ళీ భారీ టిప్పర్లతో గ్రావెల్ తరలింపు కొనసాగుతుండడంతో మైన్స్ శాఖ ఈ ఆకస్మిక తనిఖీ చేపట్టింది. గ్రావెల్ తరలింపుదారులు ఎఎంఆర్ సంస్థ నుంచి అనుమతి తీసుకున్నామని చెబుతున్నప్పటికీ మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని మైన్స్ ఆర్ఐ సి. హెచ్. స్వామి స్పష్టం చేశారు. అలాగే ఈ లే అవుట్ అభివృద్ధి పనులకు సంబంధిత శాఖల అనుమతులున్నాయా లేదా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సర్వే నెంబర్లు 144/3బి, 144/3సి, 145/1ఎ, 145/2లో జరుగుతున్న లే అవుట్ అభివృద్ధి పనులకు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని కూడా అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. భారీ టిప్పర్లు ఏఎస్‌పేట ప్రధాన బజార్ మీదుగా జనావాసాల మధ్య నిరంతరం రాకపోకలు సాగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు స్థానికులు పోలీసుల సహకారంతోనే టిప్పర్లు వెళుతున్నారని ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై పోలీసు శాఖ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఈ వ్యవహారంలో స్థానికంగా రాజకీయ ప్రత్యర్థులుగా భావించే టిడిపి , వైసిపి నాయకులు ఈ లేఅవుట్ లో ఇరు పార్టీలకు చెందిన కొందరు నాయకులు, భాగస్వాములుగా ఉన్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. మైన్స్ ఆర్ఐ నిర్వహించిన తాజా తనిఖీతో ఈ వ్యవహారం మరోసారి ప్రాధాన్యత సంతరించుకుంది. తనిఖీ అనంతరం మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటా యనే అంశంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, మైనింగ్, రెవెన్యూ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ శాఖలు సమగ్ర విచారణ చేపట్టి, లే అవుట్ అనుమతులు, గ్రావెల్ తవ్వకం, రవాణాకు సంబంధించిన అనుమతుల వివరాలను బహిర్గతం చేసి నిబంధనల ఉల్లంఘనలు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పునాది వేసేటప్పుడు లేని ఆక్రోశం ఇప్పుడెందుకు?

**విజయనగరం, జూలై 4 ప్రభాతవార్త:** ప్రత్యక్షంగా ప్రైవేటు స్థలంలో పాగా వేస్తున్నారని తెలిసి ఉదాసీనతలో ఉండి అధికారం వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన తరువాత ఆ భవనం ఉన్న స్థలంమాది అని అశోక్ గజపతిరాజు తీరిగ్గా కోర్టును ఆశ్రయించడంతో విజయనగరంలో హాట్ టాక్‌గా మారింది. ఈ వివాదం సీఎం చంద్రబాబు నాయుడు వరకు వెళ్లింది. అయిన రోజురోజుకి వైసిపి టిడిపి వాగ్వివాదం జఠిలంగా మారుతుంది. జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల మధ్య దశాబ్దాల తరబడి అవగాహన రాజకీయాలు నడుస్తున్నాయని ఓ పెద్ద ఆరోపణ ఎప్పటి నుంచో రాజ్యమేలుతోంది. ఆ తరహా అవగాహన రాజకీయం తాజాగా బెడిసి కొట్టిందేమోనని సామాన్యుల మధ్య గుసగుసలు జోరందుకోవడం గమనార్హం. వైసీపీ అధినేత జగన్ దగ్గర నుంచి చోటా మోటా నాయకులు వరకు ప్రతీ రోజూ కూటమి ప్రభుత్వాన్ని ఏకిపారేస్తుంటే. కూటమి పాలకులు, ఆ పార్టీల శ్రేణులు చేష్టలుడిగి చూస్తున్నారే తప్ప వైసీపీ దూకుడుకు ఎందుకు కళ్లెం వేయలేకపోతున్నారన్నది వేయిమిలియన్ల ప్రశ్న. టీడీపీలో ఒకప్పుడు రాజాధిరాజు స్థాయిలోనే మెలిగిన అశోక్‌కు భూమి కష్టాలు వస్తే ప్రభుత్వం స్పందన అంత పేలవంగా ఉండడానికి కారణం ఏమిటి? అవినీతి కార్యాలపాలకు ఆమడ దూరంలో ఉండే అశోక్ చట్ట నిబంధనలకు పక్కాగా కట్టుబడి ఉంటారన్నది ప్రతీతి. పైగా రాజ్యాంగ బద్ధమైన రాష్ట్ర గవర్నర్ హోదాలో ప్రస్తుతం కొనసాగుతున్నారు. అలాంటి కీలక వ్యక్తి ఓ సామాన్య వ్యక్తి మాదిరిగా తన హక్కు భుక్తమైన భూమి కోసం ఇంత దీనంగా పోరాటం చేయడం వెనుక కిటుకు, మతలబు ఏమిటి? ఈ హక్కు ను అశోక్ సకాలంలో గుర్తించలేకపో యారా? అధికారులు మీనమేషాలు లెక్కించారా? పెద్దా యన దృష్టిలో నేరుగా ఈ అంశాన్ని తీసుకెళ్ల లేదా? తీసుకెళ్లితే ఎటువంటి శషబిషలు లేకుండా చట్టపరమైన స్పష్టమైన ఆదేశాలు ఎందుకు వెలువడలేదు? ఈ స్టార్ వార్‌కి ఎలా ముగింపు పలుకుతారు.

**కోర్టు ఆదేశాల కోసం వదిలేస్తారా:** విజయనగరం రాజుల ఆస్తులు ఆస్తులు ఎన్నో అన్యాక్రాంతమైన ఒక చిన్న స్థలం గురించి పెద్దాయన ఆగ్రహంతో ఊగిసలాడుతున్నారు. అది పక్కాగా ఆయన ఆస్తి కాకపోతే చిరు ఆస్తికోసం పెదవి విప్పరనే ఆలోచన లేకపోలేదు. ఇంత జరిగిన వైయస్సార్సీపి వేసిన పాగాను ఇట్టే తొలగించే అధికారం ఉన్న గత ప్రభుత్వం ప్రజా భవనాన్ని గూర్చి ప్రజల ఆగ్రహానికి గురై ఆ నిందతో వైయస్సార్ ప్రభుత్వం కూలిపోయింది. ఉన్నత ఆలోచనతో చట్టపరంగా తన ఆస్తి తనకు వచ్చేవరకు పోరాటం సాగిస్తున్నారన్నది సత్యం.

## ఎపి సంచార విముక్త జాతుల రాష్ట్ర కన్వీనర్‌గా తాళ్ళూరి ఏకగ్రీవ ఎన్నిక

**జగ్గయ్యపేట, జూలై 4, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రాంత సీనియర్ బిసి నేత, చిల్లకల్లు గ్రామానికి చెందిన తాళ్ళూరి వెంకటేశ్వర్లు ఆంధ్రప్రదేశ్ సంచార విముక్త జాతుల (డిఎన్‌టి) రాష్ట్ర కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. అమరావతి రాజధానిలోని ఉండవల్లి అంబేద్కర్ భవన్‌లో జాతీయ డిఎన్‌టి కన్వీనర్ ఎం సుబ్బారావు అధ్యక్షతన ఇటీవల జరిగిన ఏపిలోని 32 సంచార విముక్త జాతుల ప్రతినిధుల సమావేశంలో ఈమేరకు తీర్మానిస్తూ తాళ్ళూరి ఎన్నికతోపాటు 11 సంచార విముక్త జాతులకు చెందిన నాయకులను కో–కన్వీనర్లుగా నియమిస్తూ ప్రకటించారు. ఈసందర్భంగా తాళ్ళూరి మాట్లాడుతూ శక్తివంచన లేకుండా తన వంతు కర్తవ్యాన్ని ఆదర్శవంతంగా అందిస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కాగా పలువురు సంచార విముక్త జాతుల నాయకులు తాళ్ళూరిని అభినందించారు.

# రేపటి నుంచి ప్రధాని 3దేశాల పర్యటన

### ఆస్ట్రేలియా వస్తే చంపేస్తామంటూ బెదరింపులు: నిఘా సంస్థలు వెల్లడి

**న్యూఢిల్లీ,జులై 4:** ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. ఈ 3 దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా మోడీ ఈ పర్యటన చేయనున్నారని విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ మొదట ఇండోనేషియాను సందర్శిస్తారు. ఆ తర్వాత ఆస్ట్రేలియాకు ప్రయాణమవుతారు. అక్కడ ఆయన ప్రధాన అధికారిక కార్యక్రమాలు మెల్‌బోర్న్‌లో జరుగుతాయి. అనంతరం న్యూజిలాండ్ పర్యటనతో మోడీ తన విదేశీ పర్యటనలను ముగిస్తారని ఎంఈఏ కార్యదర్శి రుద్రేంద్ర టాండన్ తెలిపారు. దాదాపు 40 సంవత్సరాల తర్వాత ఒక భారత ప్రధాన మంత్రి ఆ దేశంలో పర్యటించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వచ్చేవారం ప్రధాని మోడీ న్యూజిలాండ్ లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నట్లు ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ శనివారం అధికారికంగా ప్రకటించారు. "భారత ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే వారం న్యూజిలాండ్‌లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నారని ప్రకటించడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను" అని లక్సన్ తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే ఈ పర్యటన గురించి కచ్చితమైన తేదీలను ఆయన వెల్లడించలేదు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటి అని కొనియాడిన లక్సన్ , న్యూజిలాండ్ ఆర్థిక శ్రేయస్సుకు భారత్ ఎంతో కీలకమైనదని స్పష్టం చేశారు. ఏప్రిల్‌లో కుదిరిన న్యూజిలాండ్ ఇండియా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ ద్వారా ఇరుదేశాల మధ్య సంబంధాలను మేము తదుపరి స్థాయికి తీసుకెళ్తున్నాం. ఇది న్యూజిలాండ్ కు మరిన్ని ఉద్యోగాలను, అధిక ఎగుమతులను, బలమైన ఆర్థిక వృద్ధిని అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం కొత్త అవకాశాలను తెరుస్తుందని, న్యూజిలాండ్ వస్తు, సేవలకు 1.4 బిలియన్ల (140 కోట్ల) జనాభా కలిగిన భారీ మార్కెట్ ను అందుబాటులోకి తెస్తుందని లక్సన్ అన్నారు. ఇది కివీస్ సమాజంలోకి మరింత ఆదాయాన్ని తీసుకువస్తుందని, కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని, వేతనాలను పెంచుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, న్యూజిలాండ్ ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించడానికి, పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఈ సంవత్సరం ప్రారంభంలోనే భారత్, న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకాలు చేశాయి. ఇండోనేషియా పర్యటన నివేదికల ప్రకారం, భారతదేశంలో ప్రజల జీవితాలను, జీవనోపాధిని మార్చడంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) సాధించిన విజయాన్ని చూసి, ఆ రంగంలో భారత్ తో భాగస్వామ్యం పట్ల ఇండోనేషియా చాలా ఆసక్తి కనబరుస్తోంది. ఇందులో భాగంగానే, 2026 జూన్ 7న ఢిల్లీలో 8వ ఇండియాఇండోనేషియా జాయింట్ కమిషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి (ఈఏఎం) ఎస్. జైశంకర్, ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుగియోనో సంయుక్తంగా అధ్యక్షత వహించారు.

**ఆస్ట్రేలియా పర్యటన:** ఇక మోదీ తన ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా, ఇరుదేశాల మధ్య ఉన్న సన్నిహిత వ్యూహాత్మక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ తో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇటీవలే గతనెల 26న ఢిల్లీలో జరిగిన ఫారిన్ మినిస్టర్స్ ఫ్రేమ్ వర్క్ డైలాగ్ సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్ తన ఆస్ట్రేలియా కౌంటర్ పార్ట్ పెన్నీ వాంగ్ తో సమావేశం కావడం గమనార్హం. ఈ పర్య టనలో అత్యంత ముఖ్యమైన ఘట్టంగా ఈనెల 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరగనున్న మెల్‌బోర్న్ మీట్స్ మోడీ అనే భారీ కమ్యూనిటీ ఈవెంట్‌లో ప్రధాని ప్రసంగించ నున్నారు. ఆస్ట్రేలియా ఇండియా ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం, విక్టోరియా రాష్ట్ర చరిత్రలోనే భారత్ ఆస్ట్రేలియా కమ్యూనిటీల మధ్య జరిగిన అతిపెద్ద సమ్మేళనాలలో ఒకటిగా నిలుస్తుందని అంచనా.

**ఆస్ట్రేలియా వస్తే చంపేస్తామంటూ మోడీకి బెదరింపులు:** ఇదిలా ఉంటే మోడీ విదేశీ పర్యటనకు ముందే ఆయనకు బెదిరింపులు ఎదురయ్యాయి. ఫేస్‌బుక్ పోస్టులో బెదిరింపులు వచ్చినట్లు దర్యాప్తు ఏజెన్సీలు నిర్ధారించాయి. ఆస్ట్రేలియా వస్తే చంపేస్తామంటూ ప్రధానిమోడీకి బెదిరింపులు వచ్చినట్లు దర్యాప్తు ఏజెన్సీలకు సమాచారం అందడంతో వెంటనే అలర్ట్ అయ్యాయి.

---

## దళిత సమాజం సంఘటితంగా ఉద్యమించాలి

రేపల్లె, జూలై 4, ప్రభాతవార్త:పార్లమెంట్‌లో దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించేందుకు చట్టసవరణ చేసే విధంగా దళిత సమాజం సంఘటితంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ దళాధిపతి జి. విజయకుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఐఆర్ఇఎఫ్ ఇవాంజలికల్ చర్చిలో దళిత క్రైస్తవ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా, మత స్వేచ్ఛను హరించడం అంటే రాజ్యాంగాన్ని విస్మరించడమేనని స్పష్టం చేశారు. దళిత క్రైస్తవుల హక్కుల గురించి మాట్లాడే ప్రజాస్వామ్యవాదులపై అక్రమ కేసులు బనాయించడం విచారకరమన్నారు. దళిత క్రైస్తవుల విషయంలో టిడిపి, వైసీపీ పార్టీలు హామీలకే పరిమితమవుతున్నాయని విజయకుమార్ ఆరోపించారు. ఈ సదస్సులో బిషప్ డాక్టర్ ఇమ్మానియేలు రెబ్బా, ఎఐపిఎఫ్ జాతీయ అధ్యక్షుడు పి. జీవన్‌కుమార్, జి. ప్రశాంత్‌కుమార్, డి. సాంబశివరావు, సి హెచ్. మణిలాల్, చందోలు దేవదాసు, ఎ. బిక్షాలు, ఎస్. నాగేశ్వరరావు, బి. వెంకటేశ్వరరావు, బి. భాస్కర్, గోవర్ధన్, కె. విజయరాజు, కె. జక్రయ్య, కె. లారెన్స్, పి. హనోక్, ఎస్. అజయ్, ఎం. రాజారత్నం తదితరులు పాల్గొన్నారు

## విధుల్లో అలసత్వం.. పంచాయితీ సెక్రెటరీకి షోకాజు నోటీసు

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 4, ప్రభాతవార్త : ఈనెల ఒకటి రెండు తేదీలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేసే విషయంలో అలసత్వం ప్రదర్శించినందుకు కారంపూడిపాడు గ్రామపంచాయతీ సెక్రటరీ లక్కాకుల సుబ్బారావుకు ఎంపీడీవో ఎలీషాబాబు శుక్రవారం షోకాజు నోటీసులు జారీచేశారు. గ్రామానికి చెందిన మాదాసు సాంబయ్య కు ఎన్టీఆర్ పెన్షన్ పొందేందుకు అర్హతకు మించి వ్యవసాయ భూమి ఉందని స్థానికులు గత ఏప్రిల్ లో ఫిర్యాదు చేశారని తెలిపారు. అప్పటి నుండి ఈ మాసం వరకు లబ్ధిదారులకు పింఛన్ ఇవ్వటం లేదని వివరించారు. అయితే లబ్ధిదారుడు పింఛన్ పొందేందుకు అర్హతకు మించి వ్యవసాయ భూమి లేదని ఉన్నత అధికారులకు తెలియచేసుకోగా అధికారులు విచారించి పింఛన్ ఇవ్వమని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానిక పంచాయతీ సెక్రటరీకి శుక్రవారం లబ్ధిదారుడైన సాంబయ్య కు పింఛన్ ఇవ్వమని ఆదేశించినట్లు వివరించారు. అయితే పంచాయతీ సెక్రెటరీ లబ్ధిదారునకు పింఛన్ అందివ్వకుండా, అధికారుల ఆదేశాలను ధిక్కరించి, విధుల పట్ల అలసత్వం ప్రదర్శించడంతో గ్రామపంచాయతీ సెక్రటరీ సుబ్బారావుకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు వెల్లడించారు. విధుల్లో ఎలాంటి అలసత్వం లేదా నిర్లక్ష్యం సహించబోమని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సిబ్బందిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రంగా చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం..

### ప్రత్తిపాడు వైసిపి ఇన్ఛార్జ్ బలసాని.

ప్రత్తిపాడు(వట్టిచెరుకూరు), జూలై 4, ప్రభాతవార్త : పేద వర్గాల ఆశాజ్యోతి, మాజీ శాసనసభ్యులు, స్వర్గీయ వంగవీటి మోహనరంగా చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటితరం యువతకు ఆదర్శప్రాయమని ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం ఏటుకూరు బైపాస్ వద్ద ఉన్న వైసీపీ కార్యాలయంలో శనివారం వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలు ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. బలసాని మోహనరంగ చిత్రపటానికి పూలమాలలు వేసి అందరికీ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంగా చూపిన మార్గాలు తనలాంటి ఎందరికో ఆచరణీయమని

పేర్కొన్నారు. రంగా బడుగు బలహీన వర్గాల కోసం జీవితాంతం పోరాడిన నాయకుడని, కార్మిక నేతగా, పేదల పక్షపాతిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. వైసిపి పార్టీ రంగా లాంటి మహనీయుల ఆశయాల సాధనే లక్ష్యంగా పనిచేస్తోందని వివరించారు. రంగా అభిమానులకు రాజకీయ ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ అధినేతకు ధన్యవాదాలు తెలిపారు. రంగా ఆదర్శాలను అందరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రంగా ఎనలేని కృషి చేశారని, పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని, ఆయన సేవలను ఎప్పటికీ మరుగు రానివ్వని కొనియాడారు. నేతలతో కలిసి జోహార్ వంగవీటి మోహనరంగా అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జయంతి కేక్ కట్ చేసిన నాయకులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో పాటిబండ్ల కవిత, బైరెడ్డి ఇంద్రారెడ్డి, బోరుగడ్డ రజిని, కారసాల భవాని, కందుకూరు జ్యోతి, అమర్తల విజయబాబు, మెట్టు వెంకటప్ప రెడ్డి,కారసాల భవాని, పిల్లి మేరి, వంగ సీతారామరెడ్డి, తదితర వైసిపి నేతలు, కార్యకర్తలు, రంగా అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జులై 4,ప్రభాతవార్త :ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరునికి అత్యంత విలువైన హక్కు అని, ఆ హక్కును పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ప్రస్తుతం భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు కొనసాగాలంటే ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం గణన ఫారం పూర్తి చేసి అవసరమైన పత్రాలతో పాటు సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ జూలై 14వ తేదీలోపు సమర్పించాలని కోరారు. జూలై 21న విడుదల కానున్న డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు ఉండాలంటే ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేయడం అత్యంత అవసరమని తెలిపారు.చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే ఫారాలను సమర్పించాలని, తమ ఓటరు వివరాలను మరోసారి పరిశీలించి ధృవీకరించుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత బిఎల్లఓ ను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని అన్నారు.ప్రజల సౌకర్యార్థం ఈ శనివారం, ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బ్లో లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు.

## అల్లూరి సీతారామరాజు, వంగవీటి రంగా, కొణిజేటి రోశయ్యకు ఘన నివాళులు

గుంటూరు,జులై 4,ప్రభాతవార్త :గిరిజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. శనివారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక నాజ్ సెంటర్లో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన నాయకులు అల్లూరి సీతారామ రాజు అని కొనియాడారు. రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక ద్వారా పనులు చేదుతుందని చెప్పారు.

**పేదల పక్షపాతి వంగవీటి రంగా:** వంగవీటి రంగా కేవలం ఒక వర్గానికో, ప్రాంతానికో పరిమితం కాదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. రంగా జయంతి సందర్భంగా స్థానిక కొత్తపేటలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటూ, వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతూ అతి తక్కువ కాలంలోనే ప్రజా నాయకునిగా గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు.

**రాజకీయ చాణక్యుడు కొణిజేటి:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి, గొప్ప రాజకీయ నాయకునిగా కొణిజేటి రోశయ్య గుర్తింపు పొందారని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా స్థానిక నాజ్ సెంటర్ లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మాజీ మంత్రి కొణిజేటి రోశయ్య రాజకీయ ఉద్దండులని కొనియాడారు.

## నిడమర్రు జెడ్పిహెచ్ఎస్ మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు విశేష స్పందన

### నో అడ్మిషన్స్ బోర్డులు

మంగళగిరి, జూలై 4, ప్రభాతవార్త మంగళగిరి నియోజకవర్గం నిడమర్రులో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు శ్రీ నారా లోకేష్ చొరవతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన మోడల్ స్కూల్‌కు విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. నారా లోకేష్ విజన్‌కు ప్రతీకగా రూపుదిద్దుకున్న ఈ విద్యా సంస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు సుమారు రూ.16 కోట్ల వ్యయంతో 5.2 ఎకరాల విస్తీర్ణంలో నిడమర్రు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఈ మోడల్ స్కూల్‌ను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించే లక్ష్యంతో అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. తరగతి గదుల్లో గ్రీన్ బోర్డులు, చార్ట్ బోర్డులు, డిజిటల్ బోధన కోసం ఐఎఫ్‌పీ ప్యానెల్స్, ఆధునిక టేబుల్స్, కుర్చీలు ఏర్పాటు చేశారు. క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ఫుట్‌బాల్ మైదానం, 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, ఫ్లడ్ లైట్స్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులతో పాటు మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియాన్ని నిర్మించారు. సుమారు 400 మంది విద్యార్థులు వీక్షించే సామర్థ్యంతో యాంఫీ థియేటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. సైన్స్ మ్యూజియం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆటల్ టింకరింగ్ ల్యాబ్, ఆధునిక గ్రంథాలయం వంటి సౌకర్యాలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు దోహదపడనున్నాయి. 500 మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేసే డైనింగ్ హాల్, ఆర్వో తాగునీటి ప్లాంట్, 40 సీసీ కెమెరాలతో భద్రతా వ్యవస్థ, ప్రత్యేక పార్కింగ్ స్థలం, కిచెన్ గార్డెన్, చిన్నారుల కోసం ఆధునిక ఆట పరికరాలతో చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేశారు. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థుల కోసం 28 తరగతి గదులు, తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థుల కోసం ప్రత్యేక బ్లాక్‌లో 12 తరగతి గదులు నిర్మించారు. చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంచేలా గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు రూపొందించారు. సాంకేతికత ఆధారిత బోధనతో ఈ పాఠశాల విద్యారంగంలో కొత్త దిశను చూపుతోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో నిర్మితమైన నిడమర్రు మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు తల్లిదండ్రులు భారీగా ఆసక్తి చూపుతుండగా, ప్రస్తుతం అడ్మిషన్స్ పూర్తి అయ్యాయి,భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్య అందించే కేంద్రంగా ఈ పాఠశాల నిలవనుందని స్థానికులు పేర్కొన్నారు.

## చందోలు బండ్లమ్మ ఆలయానికి ప్రభుత్వ అండ

### క్యూ కాంప్లెక్స్ నుంచి మినరల్ వాటర్ ప్లాంట్ వరకు.. సమగ్ర అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్

### దేవాదాయ కమిషనర్‌తో కలిసి ఆలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

పిట్టలవానిపాలెం,జులై4,ప్రభాతవార్త, చందోలు గ్రామంలోని చారిత్రాత్మక ప్రసిద్ధ శ్రీ బండ్లమ్మ అమ్మవారి ఆలయాన్ని రాష్ట్రంలో ఆదర్శ దేవాలయంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కే.రామచంద్ర మోహన్ ఆలయాన్ని సందర్శించి,ఎమ్మెల్యే నరేంద్ర వర్మతో కలిసి అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు.భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆలయాన్ని ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని కమిషనర్ స్పష్టం చేశారు.ఆలయానికి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఇప్పటికే తన సొంత నిధుల నుంచి సుమారురూ.9.50 లక్షలు అందించి పలు వసతులు కల్పించారని ఆలయ కమిటీ సభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అందిస్తున్న సహకారాన్ని కమిషనర్ అభినందించారు.చందోలు బండ్లమ్మ ఆలయాన్ని ఆధునిక సౌకర్యాలతో రాష్ట్రంలో ఆదర్శ దేవాలయంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు.పండుగలు,సెలవు దినాల్లో భారీగా వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఆలయ నమూనాలో మార్పులు చేయాలనికమిషనర్ సూచించారు.ఆలయంలోకి ప్రవేశానికి ప్రత్యేక మార్గం,దర్శనం అనంతరంబయటకు వెళ్లేందుకు మరో ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.శాశ్వత షెడ్లతో కూడిన ఆధునిక క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.దీపారాధన ప్రాంతాల్లో అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేయంతో పాటు విద్యుత్ వ్యవస్థను సురక్షితంగా మార్చాలన్నారు.ఆలయ భద్రత పై నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమీటిని కూడా ఏర్పాటు చేయాలన్నారు.దేవస్థానానికి సంభందించి ఆధునిక భవనం,అర్చక నివాస గృహాలు,భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించేలా ఆత్యాధునిక మురుగుదోడ్ల బ్లాకులు నిర్మించాలని అదేశించారు. ఆలయ సొంత ఆదాయంతో పాటు దేవాదాయ శాఖ సీజీఎఫ్ నిధుల నుంచి కూడా అభివృద్ధి పనులకు బడ్జెట్ కేటాయించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

**తూర్పు సత్రం అభివృద్ధిపైనా ఎమ్మెల్యే వినతి**

:ఈ సందర్భంగా బాపట్ల జిల్లా కేంద్రంలోని తూర్పు సత్రం అభివృద్ధి,అక్కడి ఆలయాలకు నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన కమిషనర్, దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల నరసింహమూర్తి పర్యవేక్షణలో కమిషనర్ రామచంద్ర మోహన్, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అమ్మవారిని దర్శించుకు ఆలయ ఈవో జి.నరసింహ మూర్తి మాట్లాడుతూ కమీషనర్,ఎమ్మెల్యే అదేశాల మేరకు రాబోయే రోజుల్లో ఆలయ ముఖచిత్రాన్ని మార్చే విధంగా పనులు ప్రారంబిస్తామన్నారు.ఈకార్యక్రమంలోజిల్లా డిఈవో ఎ ం.నాగయ్య,ఈఈ సిహెచ్ శ్రీనివాసులు,స్థపతి శ్రీనివాసాచారి,ఏఈ మధుసూధన్,ఇన్స్ పెక్టర్లు గోపి.ఎస్ కుమార్‌బాబు,ఈవోలు,చందోలు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## పిల్లల విద్యా నైపుణ్యాల పెంపునకు కృషి చేయాలి

బాపట్ల,జులై4,ప్రభాతవార్త,ప్రతినిధి: చిన్నారుల్లో పునాది స్థాయి నుంచే అక్షరాస్యత,సంఖ్యా పరిజ్ఞానాన్నిపెంపొందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) రాధా మాధవి పిలుపునిచ్చారు.జ్ఞాన జ్యోతి120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా నిర్వహిస్తున్న రెండు రోజుల జిల్లా స్థాయి శిక్షణ కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూఫీల్డ్ లెవెల్‌లోఅంగన్‌వాడీ కార్యకర్తలకు ఎఫ్.ఎల్.ఎన్‌శిక్షణ ఎంతో కీలకమన్నారు.కేంద్రాల్లోని పిల్లలకు సంఖ్యా పరిజ్ఞానం, భాషా నైపుణ్యాలను అలవర్చడంతో పాటు సమాజంలో మహిళలు,చిన్నారుల పట్ల జరుగుతున్న లింగ వివక్షపై అవగాహన పెంచాలన్నారు.ముఖ్యంగా బాలలపై జరుగుతున్న అకృత్యాల దృష్ట్యాపోక్సో చట్టాలపై అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలల పరిధిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని శిక్షకులకు అవగాహన కల్పించారు. కేఆర్పీలు బి. శివరామకృష్ణ, జి. సుభద్రతో పాటు వివిధ మండలాల నుంచి వచ్చిన డిఆర్పీలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల పంపిణీ..

కర్లపాలెం,జులై04,ప్రభాతవార్త, కర్లపాలెం మండలం ఇందిరా నగర్ లో ఉన్న భవిత సెంటర్ నందు ఉపకరణాల డిస్ట్రిబ్యూషన్ లో భాగంగా నాలుగు వీల్ చైర్లు, ఒక ట్రై సైకిల్, మూడు టిఎల్ఎం కిట్స్, మూడు చెవిటి మిషన్లు మండలంలోని చిన్నారులకు శనివారం పంపిణీ చేశారు.వీటి విలువ సుమారు రెండు లక్షల వరకు ఉంటుంది ఇవి హెలెన్కో నుంచి ప్రభుత్వం దిగుమతి చేసుకున్న ఉపకరణాలు. వీటి పంపిణీకి సహకరించిన డీఈఓ సింగ్ శ్రీనివాస్,సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఆవుల శ్రీనివాసరావు,ఐడి కోఆర్డినేటర్ మట్ట జోత్స్న, కు భవిత సెంటర్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు అదే విధంగా ఈ ప్రోగ్రాం కి హాజరైన ఎంఈఓ లు మనోరంజని,విజయశ్రీ లకు ఇందిరా నగర్ ప్రధానోపాధ్యాయురాలు శైలజ, భవాని ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పిల్లలు మరియు వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి భవిత సెంటర్ ఉపాధ్యాయులు నరాల శెట్టి లక్ష్మీ ్మ ప్రసన్న మరియు చెన్నబోయిన చందన తదితరులు పాల్గొన్నారు.

## అన్నార్తుల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

గుంటూరు విద్య జులై 4 ప్రభాతవార్త: అన్నార్తుల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్ లు ఎంతోమందికి ఆపన్న హస్తంలా నిలుస్తున్నాయని రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ అన్నారు. రామకృష్ణ రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారి స్నేహితులు త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల ఛైర్మన్ డా.గొల్లపూడి వీరేంద్ర చౌదరి, భాష్యం పేరమ్మ ఛారిటబుల్ ట్రస్ట్, నానమ్మ ఛారిటబుల్ ట్రస్ట్, హిత ఫౌండేషన్ ల ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని 20 అన్న క్యాంటీన్ లలో శనివారం ఒక రోజు మూడు పూటల ఉచిత భోజన వసతిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఆర్టీఓ కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్ లో ఎంపీ రామకృష్ణ స్వయంగా అల్పాహారం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పురప్రజల తో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఒక రోజు మూడు పూటల భోజన సేవల నిమిత్తం రూ.5,21,320 విరాళాన్ని అందించగా మొత్తం 18,160 మంది ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ రామకృష్ణ మిత్ర బృందం పాల్గొన్నారు.

## లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులుగా బి.సురేష్ బాబు బాధ్యతల స్వీకారం

గుంటూరు, జులై 4,ప్రభాతవార్త :లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విజయ్ కుమార్ చేతుల మీదుగా బి.సురేష్ బాబు గుంటూరు జిల్లా అధ్యక్షులుగా నియామక పత్రాన్ని అందుకుని అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై అవగాహనతో పాటు సేవాభావం కలిగిన నాయకుడిగా సురేష్ బాబు ఇప్పటికే ప్రజల్లో మంచి గుర్తింపు పొందారని తెలిపారు. ఆయన నాయకత్వంలో గుంటూరు జిల్లాలో పార్టీ మరింత బలోపేతమై ప్రజలకు చేరువ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.నూతన జిల్లా అధ్యక్షులు బి. సురేష్ బాబు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాలైన సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సంక్షేమం అనే నాలుగు ప్రధాన సూత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.గుంటూరు జిల్లాలో గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడం, యువత, మహిళలు, రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, బడుగు బలహీన వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పార్టీ కార్యకర్తలతో కలిసి నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

## ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లోనే ఇక వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

కర్లపాలెం,జులై4,ప్రభాతవార్త, బాపట్ల జిల్లాలో ట్రాన్స్‌పోర్ట్ వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌ద్వారా నిర్వహించనున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి టి.కె.పరంధామరెడ్డి తెలిపారు.కర్లపాలెం మండలం యాజలి గ్రామంలోని సర్వే నెం. 8103లో ఉన్న ఎం/ఎస్ వాసిరెడ్డి ఆక్వా పార్క్ సంస్థకు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ రవాణాశాఖ నుంచి జూలై 1అనుమతి లభించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇకపై ట్రాన్స్‌పోర్ట్ వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు ఈ ఏటీఎస్ కేంద్రంలోనే నిర్వహించబడతాయని పేర్కొన్నారు.ట్రాన్స్‌పోర్ట్‌తో పాటు నాన్‌ట్రాన్స్‌పోర్ట్ వాహన యజమానులు కూడా తమ వాహనాల ఫిట్‌నెస్ పునరుద్ధరణ కోసం ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ సేవలను సద్వినియోగం చేసుకుని, నిర్ణీత గడువులోపు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను పునరుద్ధరించుకోవాలని జిల్లా రవాణాశాఖ అధికారి సూచించారు. దీంతో వాహనాల తనిఖీలు మరింత పారదర్శకంగా, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

## యూనియన్ బ్యాంక్ మేనేజర్ మానస సేవలు అమోహం..

కర్లపాలెం,జులై4,ప్రభాతవార్త, కర్లపాలెం యూనియన్ బ్యాంక్ మేనేజర్ మానస బదిలీ సందర్భంగా అలాగే కొత్త శాఖాధిపతిగా తిరుపతమ్మ బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని, హృదయపూర్వక వీడ్కోలు మరియు స్వాగత సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేశారు.కర్లపాలెం శాఖలో తన పదవీకాలంలో శాఖకు మరియు దాని వినియోగదారులకు అందించిన అద్భుత సేవ, అంకితభావంతో కూడిన నాయకత్వం, మరియు విలువైన కృషికి గాను మానస కు సిబ్బంది హృదయపూర్వక కృతజ్ఞతలను తెలియజేసారు. ఆమె నిజాయితీ, నిబద్ధత, మరియు వృత్తిపరమైన ప్రతిభ సహచరులు మరియు వినియోగదారుల గౌరవాభిమానాలను పొందాయి అన్నారు.ఆమె భవిష్యత్ బాధ్యతలన్నింటిలోనూ మరింత విజయాలు, మంచి ఆరోగ్యం, మరియు ఆనందం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము అని తెలియజేశారు. అదే సమయంలో, కర్లపాలెం శాఖ కొత్త శాఖాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన తిరుపతమ్మ కు హృదయపూర్వక స్వాగతం తెలియజేసారు. ఆమెకు విజయవంతమైన మరియు సంతృప్తికరమైన పదవీకాలం కలగాలని కోరుకుంటూ, శాఖను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంలో మొత్తం సిబ్బంది సంపూర్ణ సహకారం మరియు మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ మార్పు కర్లపాలెం శాఖకు కొత్త విజయాల ఆరంభంగా, నిరంతర ఉత్తమతకు నాందిగా నిలవాలని ఆకాంక్షి స్తున్నాము అన్నారు.

## జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా అల్లూరి సీతారామరాజుజయంతి వేడుక.

బాపట్ల,జులై4,ప్రభాతవార్త,ప్రతినిధి: అల్లూరి సీతారామ రాజు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి యువత నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీఉమామహేశ్వం సూచించారు.మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురష్కరించుకుని శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన అయన చిత్రపటానికి ఎస్పీపూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్, ఏఆర్ డిఎస్పి కృష్ణంరాజు, ఎస్బి ఇన్స్పెక్టర్స్‌నారాయణ, రాంబాబు.ఎస్సీ ఎస్టీ సెల్ ఇన్స్పెక్టర్ బాలకోటి రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఏడి శృతి బేతాళ, ఆర్ఐ లు మోలుద్దీన్, ప్రవీణ్ లు పాల్గొన్నారు.

## ఓటరుజాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను శ్రద్ధ పెట్టి పనిచేయాలి..

బాపట్ల,జులై4,ప్రభాతవార్త,ప్రతినిధి: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను శ్రద్ధ పెట్టి పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు.పి.వి.పాలెం మండలం,ఖాజీపాలెం గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిర్వహణ కార్యక్రమాన్ని శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, పరిశీలించారు.జిల్లా కలెక్టర్ ఓటరుతో మాట్లాడుతూ బీఎల్ఓమీ ఇంటికి ఎన్యూమరేషన్ ఫారం తీసుకొచ్చారా,ఫారాన్ని ఎలానింపాలో పూర్తి వివరాలు తెలియజేశారా,అవసరమైన పత్రాలగురించి వివరించారా అని ఓటర్లను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు.ఖాజీపాలెం గ్రామం లో సర్ ఇంటింటా సర్వేనిఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆర్‌డీఓ ఏ. హరికుమార్, తహశీల్దార్ వెంకటేశ్వరరావు ఎంపీడీఓ, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి.

పిట్టలవానిపాలెం,జులై4,ప్రభాతవార్త, ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలోనాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు.బాపట్ల జిల్లా పిట్టలవారిపాలెం మండలం,ఖాజీపాలెం గ్రామంలోని సాయి ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్‌సందర్శించి పరిశీలించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చేరోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు.బాపట్ల జిల్లా కేంద్రం,రెవిన్యూ డివిజన్ కేంద్రం కాదు ఒక మండలకేంద్రంలో అన్నివసతులు కలిగిన ఆసుపత్రి ఉండడంచాలా మంచిదన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎస్. విజయమ్మ, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారిణి డాక్టర్ పద్మావతి, సాయి ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏజన్సీ ప్రాంత గిరిజనుల ఆశాజ్యోతి అల్లూరి సీతారామరాజు

బాపట్ల,జులై4,ప్రభాతవార్త,ప్రతినిధి: గిరిజనుల అణచివేత విధానాలు,అటవీ హక్కుల చట్టాలకు వ్యతిరేకంగా అములుచేసిన బ్రిటిష్ పాలకుల పై పోరాటం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి.పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోశనివారం జిల్లా కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాల్ నందుభారత స్వాతంస్ర్యమరయోధుడు,మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల అణచివేత విధానాలు,అటవీ హక్కులచట్టాలకు వ్యతిరేకంగా అములు చేసిన బ్రిటిష్ పాలకుల పై పోరాటం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుని తెలిపారు. డియంహెచ్ డాక్టర్ఎస్.విజయమ్మ,జిల్లా గిరిజనసంక్షేమ మరియు సాధికారత అధికారి వెంకట సుబ్బయ్య,డిసిహెచ్ఎస్ పద్మావతి,పశు సంవర్ధక శాఖ,జెడి వేణుగోపాల్.డిఆర్డీఏ పి డి.బి.సింగయ్య,గృహ నిర్మాణ సంస్థ పి డి.వెంకటేశ్వరరావు,బి సి సంక్షేమ మరియు సాధికారత అధికారిణి శివలీల,జిల్లా అగ్నిమాపక అధికారి వినయ్, వ్యవసాయ అధికారిణి అన్నపూర్ణ,పర్యాటక శాఖ అధికారి బెహనర్,గిరిజన సంఘాల నాయకులు, గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

BAPATLA
DISTRICT

## డిగ్రీ ఫలితాలలో శ్రీమేధ కెరీర్ డిగ్రీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు విద్య జులై 4 ప్రభాతవార్త ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ బి.కామ్ 4 వ సెమిస్టర్ (జనరల్ కంప్యూటర్స్) పరీక్షా ఫలితాలలో శ్రీమేధ కెరీర్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో టాప్ మార్కులు సాధించారని సంస్థ డైరెక్టర్లు శేష సాయి బాబు, సి ఎ నందకిషోర్ తెలిపారు. నిరంతర పర్యవేక్షణ, ప్రణాళికా బద్ధమైన విద్యా బోధన, ప్రతిరోజు ల్యాబ్ ప్రాక్టీస్, వ్యక్తిగత శ్రద్ధ కారణంగా ఈ ఫలితాలు సాధించారని వారు తెలిపారు. ఈ ఫలితాలకు సహకరించిన విద్యార్థులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని వారు అధినందించారు.

శ్రీమేధ & కెరీర్ డిగ్రీ కా

## .పేదల పాలిటి పెన్నిధి వంగవీటి రంగా: మాజీ కార్పొరేటర్ నిమ్మల

గుంటూరు, జూలై 4, ప్రభాతవార్త: పేదల పాలిటి దేవుడని, పేద వర్గాల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులు స్వర్గీయ వంగవీటి మోహనరంగా అని జనసేన పార్టీ నాయకులు,18వ డివిజన్ మాజీ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య పేర్కొన్నారు. వంగవీటి మోహనరంగా 79వ జయంతిని పురస్కరించుకొని గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని ఆర్.అగ్రహారం ఎత్తురోడ్డు వద్దగల మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి అందరికీ 79వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నిమ్మల మాట్లాడుతూ..సమాజంలోని నిరుపేదలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం రంగా చేసిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేని కొనియాగాడు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రంగా పరమపదించి మూడు దశాబ్దాలు దాటినా ఎన్నటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలియజేశారు. రంగా చిన్నవయస్సు నుంచే యువత ఆయనకు అభిమానులుగా మారుతూ పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో కీర్తి ప్రతిష్టలు, ఆశయాలు మరింత ముందుకెళ్తాయని ఆకాంక్షించారు. ఉప్పు వెంకట రత్తయ్య మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికై నిరంతరం శ్రమించి అహర్నిశలు కృషిచేసిన వంగవీటి రంగా జీవితం నేటి యువతకు ఎంతో ఆదర్శనియమని, వారి సేవలను కొనియాడారు.రంగా ఆశయసాధనకు తామంతా కంకణబద్ధులై ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, జనసేన పార్టీ నాయకులు దొడ్డి కోటి, రేజేటి రామకృష్ణ, దళవాయి సుబ్రహ్మణ్యం, ముక్తం బాషా, కుర్రా అచ్చారావు, అడపా రాజు, సచ్చు రాంబాబు, విడదల సురేష్, దొడ్డి వంశీధర్, నాయుడు రమేష్,యర్రగోపుల జయదీప్, పాల్గొన్నారు.

## యూనివర్సల్ బేబీ బాస్ ఆగయా

# వస్తూనే సచిన్ రికార్డు బ్రేక్

**మాంచెస్టర్, జులై 4:** క్రికెట్ బుడ్డోడు, వరల్డ్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ ఎట్టకేలకు టీమిండియా తుది జట్టులోకి అరంగేట్రం చేశాడు. వస్తూ వస్తూనే రికార్డుతో ఎంట్రీ ఇచ్చాడు. క్రికెట్ గాడ్ సచిన్ తెండూల్కర్ రికార్డును బ్రేక్ చేశాడు. కేవలం 15 ఏళ్ల 99 రోజుల వయస్సులోనే టీమిండియాకు ఆడిన అతిపిన్న క్రికెటర్‌గా వైభవ్ అరుదైన ఘనత అందుకున్నాడు.

ఇంతకు ముందు ఈ రికార్డు సచిన్ పేరిట ఉండేది. బ్యాటింగ్ మాస్ట్రో 16 ఏళ్ల 205రోజుల వయసులో టీమ్ ఇండియా తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడగా.. అతనికంటే ఏడాదిన్నరముందే వైభవ్ సూర్యవంశీ తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడేశాడు.

### ఎలాంటి బెరుకు లేకుండా...

ఇక తొలి అంతర్జాతీయ మ్యాచ్ అంటే ఓ రకమైన బెరుకు, ఒత్తిడి. వైభవ్ టెంపర్‌మెంట్ చూస్తే మరో మ్యాచ్ అన్నంతగా తేలికగా తీసుకున్నాడు. ఎక్కడా భయం, ఒత్తిడి కనిపించలేదు. తాను ఎదుర్కొన్న తొలిబంతి నుంచే ఎదురుదాడికిప్రయత్నించాడు. అయితే మూడో బంతికి సింగిల్‌తో పరుగుల ఖాతా తెరిచిన బుడ్డోడు...అర్చర్ వేసిన తొలి బంతినే ఫైన్‌లెగ్ మీదుగా భారీ సిక్స్ బాదేశాడు. ఒక టాంగ్‌వేసిన మరో ఓవర్ తొలి బంతిని కూడా మిడ్ వికెట్ మీదుగా స్టాండ్స్‌లోకి పంపాడు. ఇక స్పిన్నర్ విల్ జాక్స్ ఓవర్‌లో భారీ షాట్ ఆడేందుకు స్టెప్ అవుట్ కాగా, కీపర్ స్టంప్ చేశాడు. పది బంతుల్లో రెండు సిక్స్‌లతో చేసింది 14 పరుగులైనా... తొలి వికెట్‌కు 50 పరుగుల శుభారంభం అందించాడు. అంతర్జాయ మ్యాచ్‌లు ఆడే సత్తా తనకుందని వైభవ్ చాటిచెప్పాడు.

# మెస్సీ రికార్డుల మ్యాజిక్



**మియామి, జులై 4:** ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ రికార్డుల మోత మోగించాడు. అటు గోల్స్‌తో పాటు ఆడిన మ్యాచ్‌ల పరంగా సరికొత్త మైలురాళ్లను అందుకున్నాడు. రెండు వేర్వేరు ఫిఫా వరల్డ్ కప్ ఎడిషన్లలో ఏడు చొప్పున గోల్స్ సాధించిన తొలి ఫుట్‌బాలర్‌గా మెస్సీ నిలిచాడు. 2022 ఖతార్ వరల్డ్ కప్‌లో 7 గోల్స్ చేసిన అర్జెంటీనాను ఛాంపియన్‌గా నిలబెట్టిన మెస్సీ..ఇప్పుడు ఈ టోర్నీలోనూ అదే జోరును ప్రదర్శిస్తున్నాడు.

కాబో వెర్దేతో మ్యాచ్‌తో ఫిఫా టోర్నమెంట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా మెస్సీ నిలిచాడు. ప్రపంచకప్‌లో అతనికి ఇది 30వ మ్యాచ్. ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో వరుసగా 8 మ్యాచ్‌లలో గోల్స్ చేసిన మొదటి ఆటగాడిగా మెస్సీ మరో చరిత్ర సృష్టించాడు. 29వ నిమిషంలో మెస్సీ చేసిన గోల్‌తో ఈ అరుదైన ఫీట్‌ను అందుకున్నాడు. ఈ తాజా గోల్‌తో ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో మెస్సీ ఖాతాలో మొత్తం 20 గోల్స్ చేరాయి. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాకు వరుసగా రెండోసారి ఫిఫా కప్ అందించే దిశగా జట్టును మెస్సీ ముందుండి నడిపిస్తున్నాడు. అలాగే గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ ఏడు గోల్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఫ్రాన్స్ స్టార్ ఎంబాపే 6 గోల్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. ఇక 2018లో అర్జెంటీనా మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిఇన స్కలోనీ.. కోచ్‌గా 100వ అంతర్జాతీయ మ్యాచ్ మైలురాయిని చేరుకున్నారు. స్కలోనీ మార్గదర్శకత్వంలోనే అర్జెంటీనా జట్టు కోపా అమెరికా, ఫిఫా ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలను గెలుచుకుంది.

# భారత్‌ను ఓడించిన బెతెల్

## రెండో టి20లో ఇంగ్లాండ్ 4 వికెట్ల విజయం

మాంచెస్టర్, జులై 4: అయిదు టీ ట్వంటీ సిరీస్ లోభాగంగా మాంచెస్టర్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో టీమిండియా పరాజయం పొందింది. జాకబ్ బెతెల్(46 బంతుల్లో 76 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటిచేత్తో ఇంగ్లాండ్‌కు 4 వికెట్ల విజయాన్ని అందించాడు. మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు చేయగా, ఈ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ మరో ఓవర్ ఉండగానే 6 వికెట్లు కోల్పోయి అందుకుంది.

టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఓపెనర్లు వైభవ్(14), అభిషేక్ (24 బంతుల్లో 43) 50 పరుగుల మెరుపు ఆరంభం ఇచ్చారు. అయితే 15 రన్స్ తేడాతో ఓపెనర్లను కోల్పోయి కష్టాల్లో పడ్డ టీమిండియాను ఇషాన్ కిషన్(40 బంతుల్లో 49), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(22 బంతుల్లో 37) ఆదుకున్నారు. 13ఓవర్లలో 130 పరుగులకు చేర్చారు. డాసన్, కుర్రాన్ దెబ్బతీయడంతో చివర్లో వేగంగా పరుగులు సాధించలేక పోయింది. తిలక్ వర్మ 11 బంతుల్లో 2 సిక్స్‌లతో 24 పరుగులు చేయడంతో భారత్ 190 పరుగులకు చేరింది.

### దెబ్బతీసిన అర్షదీప్

191 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్‌ను తొలి ఓవర్లోనే అర్షదీప్ దెబ్బతీశాడు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్, జాస్ బట్లర్‌లను డకౌట్‌గా పెవిలియన్‌చేర్చాడు. కెప్టెన్ హ్యారీబ్రూక్(15బంతుల్లో 39) క్రీజ్‌లో ఉన్నంత సేపు మెరుపులు మెరిపించాడు. బ్రూక్స్ అవుటైన తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన టామ్ బాంటన్(32బంతుల్లో 39) అండగా జాకబ్ బెతెల్(76నాటౌట్)చెలరేగాడు. నాలుగో వికెట్‌కు 67రన్స్ జోడించి ఆదుకున్నాడు. అర్ధ సెంచరీ తర్వఆత బౌలర్లపై సిక్స్‌లు, ఫోర్లతో మరింతగా బెతెల్ విరుచుకుపడ్డాడు. భారత్ గెలుపు ఆశలపై నీళ్లుచల్లాడు. టీమిండియా నుంచి గెలుపును లాక్కొని వెళ్లాడు. దీంతో 19 ఓవర్లలోనే ఇంగ్లాండ్ లక్ష్యాన్ని అందుకుంది. భారత బౌలర్లలో అర్షదీప్ మూడు వికెట్లు... హర్షిత్ రాణా, అక్షర్ పటేల్, వరుణ్ తలా ఓ వికెట్ పడగొట్టారు. కెప్టెన్‌గా శ్రేయాస్ మూడో పరాజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు.

# సెల్ఫ్ గోల్‌తో కాబో వెర్డే ఔట్ - ప్రిక్వార్టర్స్‌కు అర్జెంటీనా

## ముగిసిన రౌండ్-36 * ప్రిక్వార్టర్ సేజ్‌కు చేరిన సాకర్ వరల్డ్ కప్ * నేడు బ్రెజిల్, నార్వే మ్యాచ్

*సాకర్ వరల్డ్ కప్ ప్రి క్వార్టర్ ఫైనల్ స్టేజ్‌కు చేరుకుంది. శనివారంతో ముగిసిన రౌండ్-36 స్టేజ్‌లో అర్జెంటీనా, ఈజిప్ట్, కొలంబియా విజయాలతో ముందంజ వేశాయి. ప్రి క్వార్టర్ ఫైనల్‌కు హాట్ ఫేవరెట్లు అర్జెంటీనా, పోర్చుగల్, బ్రెజిల్, ఫ్రాన్స్‌తో పాటు కెనడా, మొరాకో, పరాగ్వే, నార్వే, మెక్సికో, ఇంగ్లాండ్, స్పెయిన్, అమెరికా, బెల్జియం, ఈజిప్ట్, స్విట్జర్లాండ్, కొలంబియా జట్లు చేరుకున్నాయి. ప్రిక్వార్టర్ ఫైనల్లో తొలి మ్యాచ్ లో కెనడా, మొరాకో తలపడుతుండగా, మిగతా రెండు మ్యాచ్‌ల్లో పరాగ్వేతో ఫ్రాన్స్, బ్రెజిల్‌తో నార్వే ఆడతాయి. ఫిఫా ప్రపంచకప్‌కు అతిథ్యమిస్తు మూడు దేశాలు అమెరికా, కెనడా, మెక్సికో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరడం విశేషం.*

తొలి సాకర్ ప్రపంచకప్‌లోనే అద్భుత ఆటతీరుతో ఆకట్టుకున్న కాబో వెర్దే జట్టు ఆటగాళ్లు

**మియామి, జులై 4:** సాకర్ వరల్డ్ కప్‌లో ఎంట్రీ ఇచ్చిన తొలిసారే సంచలన ఆటతీరుతో నాకౌట్ స్టేజ్‌కు చేరుకున్న చిన్న దేశం కాబో వెర్దే పెద్ద ఆటే కనబరిచింది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాకు చుక్కలు చూపించింది. ప్రపంచ ఛాంపియన్లను 120 నిమిషాలకు పైగా ఉక్కిరిబిక్కిరి చేసింది. చివరకు సెల్ఫ్ గోల్‌తో ఫిఫా కప్ నుంచి నిష్క్రమించింది. కెప్టెన్ లియోనెల్ మెస్సితో పాటు అనుభవం కలిగిన అర్జెంటీనా చివరకు 3-2తేడాతో కాబో వెర్దేపై అతికష్టంగా విజయం సాధించి ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది. లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా ఈ మ్యాచ్‌లో మూడుసార్లు ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పట్టుదలగా ఆడిన కేప్ వెర్దే జట్టు మొదటి రెండు సార్లు గోల్స్ చేసి స్కోరును సమం చేసినప్పటికీ, మూడో గోల్ మాత్రం చేయలేకపోయింది. మ్యాచ్ అనంతరం కాబో వెర్దే పోరాటానికి ప్రేక్షకులు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు.

### మెస్సీ మెరుపుగోల్

మొదటి అర్ధభాగంల 29వ నిమిషంలో అర్జెంటీనా తరఫున లియోనెల్ మెస్సీ తొలిగోల్ చేయగా, ఆట మొదలైన గంటకు కేప్ వెర్దే తర ఫున డెరోయ్ దువార్టే అర్హతగా గోల్ చేసి స్కోరును సమంచేశాడు. నిర్ణీత సమయం ముగిసేసరికి ఆట 1-1తో సమంగా ఉండటంతో, రిఫరీ అదనంగా మరో 30 నిమిషాల ఎక్స్‌ట్రా టైమ్ కేటాయించారు. ఎక్స్‌ట్రా టైమ్ తొలి భాగం ఆరంభంలో లిసాండ్రో మార్టినెజ్ గోల్ చేసి అర్జెంటీనాను 2-1 లీడ్‌లోకి తీసుకెళ్లాడు. కొద్ది సేపటికే కాబ్రాల్.. టాప్ కార్నర్‌లోకి రాకెట్ లాంటి అద్భుతమైన షాట్‌ను సంధించి స్కోరును 2-2తో సమం చేశాడు. ప్రస్తుత ఫిఫా కప్‌లో ఇదిఅత్యుత్తమ గోల్‌గా నిలిచింది. ఇక పెనాల్టీ షూటౌట్ తప్పదనుకుంటున్న దశలో అర్జెంటీనాకు గోల్ లభించింది. మెస్సీ పంపిన క్రాస్‌ను రొమెరో హెడర్‌తో గోల్‌గా ప్రయత్నం చేయగా, ఆ బంతి డైనీ బోర్జెస్‌కు తగిలి ఓన్ గోల్‌గా మారింది. దీంతో అర్జెంటీనా ప్రిక్వార్టర్‌కు చేరి ఊపిరిపీల్చుకుంది. గ్రూప్ దశలో స్పెయిన్, ఉరుగ్వే, సౌదీ అరేబియాలను నిలువరిస్తూ డ్రాలతో కాబో వెర్దే నాకౌట్‌కు వచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచింది.

### పెనాల్టీ షూటౌట్‌లో...

ప్రపంచ కప్ ప్రిక్వార్టర్స్‌లోకి ఈజిప్ట్ అడుగు పెట్టింది. ఆస్ట్రేలియాపై పెనాల్టీ షూటౌట్‌లో 4-2తో విజయం సాధించింది. ఆట ఆరంభంలోనే ఇమామ్ ఆషౌర్ (11వ నిమిషం) గోల్ చేసి ఈజిప్ట్‌కు ఆధిక్యం ఇచ్చాడు. అయితే, రెండో అర్ధ భాగం తర్వాత ఆస్ట్రేలియా తరఫున మహమ్మద్ హానీ (55వ నిమిషం) గోల్ చేసి స్కోర్లను సమం చేశాడు. అనంతరం నిర్ణీత సమయంలోగా ఇరు జట్లూ గోల్స్‌ను సాధించలేదు. 1-1గోల్స్‌తో సమంగా నిలిచాయి. పెనాల్టీ షూటౌట్‌లో ఈజిప్ట్ 4-2 తేడాతో ఆసీస్‌ను ఓడించి తదుపరి రౌండ్‌కు చేరుకుంది. 92 ఏళ్ల తర్వాత ఈజిప్ట్ ప్రిక్వార్టర్స్‌లోకి అడుగు పెట్టింది. అర్జెంటీనాతో జులై 7న ఈజిప్ట్ తలపడనుంది.

### ఘనాపై కొలంబియా

ప్రి క్వార్టర్‌ఫైనల్లోఅడుగు పెట్టిన చివరి జట్టుగా కొలంబియా నిలిచింది. ఘనాపై ఏకైక గోల్‌తో నెగ్గింది. 14వ నిమిషంలోనే కొలంబియా ప్లేయర్ జాన్ అరియాస్ గోల్ కొట్టాడు. ఆ తర్వాత ఇరు జట్లూ గోల్ పోస్ట్‌ల వైపు గురిపెట్టినా ఫలితం రాలేదు. రెండుజట్లు గోల్స్ చేయడంలో విఫల మయ్యాయి. దీంతో ఘనాపై 1-0 గోల్స్‌తో కొలంబియానే విజయం వరించింది. జులై 8న స్విట్జర్లాండ్‌తో ప్రిక్వార్టర్స్‌లో కొలంబియా జట్టు తలపడనుంది.

## ఆరు బిలియన్ డాలర్లు క్షీణించిన

# భారత్ ఫారెక్స్ ఖజానా

**న్యూఢిల్లీ, జులై 4:** భారత విదేశీ మారక నిల్వలు మరోసారి తగ్గాయి. జూన్ 26తో ముగిసిన వారానికి దేశ విదేశీ మారక నిల్వలు 5.654 బిలియన్ అమెరికన్ డాలర్లు తగ్గి 666.933 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని భారతీయ రిజర్వు బ్యాంక్ వెల్లడించింది. అంతకుముందు వారంలో విదేశీ మారక నిల్వలు 963 మిలియన్ డాలర్లు పెరిగి 672.587 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు చరిత్రాత్మక గరిష్ఠ స్థాయి అంటే 728.494 బిలియన్ డాలర్లను నమోదు చేశాయి. అనంతరం పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రూపాయిపై ఒత్తిడి పెరగడంతో ఆర్‌బీఐ డాలర్ల విక్రయాల ద్వారా మార్కెట్లో జోక్యం చేసుకోవాల్సి రావడంతో నిల్వలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి.

ఇదిలా ఉండగా, విదేశీ మారక నిల్వలను పరిరక్షించే దిశగా విదేశీ పర్యటనలను తగ్గించుకోవాలని, ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాలని, ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను తగ్గించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మే 11 నుంచి పలుమార్లు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం, విదేశీ మారక నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీకరెన్సీ ఆస్తులు 150 మిలియన్ డాలర్లు తగ్గి 541.067 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్‌తో పాటు యూరో, పౌండ్, యెన్ వంటి ఇతర విదేశీ కరెన్సీల విలువల్లో చోటుచేసుకున్న మార్పుల ప్రభావం కూడా ఈ ఆస్తులపై ప్రతిబింబిస్తుంది. అదే సమయంలో బంగారం నిల్వల విలువ 5.394 బిలియన్ డాలర్లు తగ్గి 102.536 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు (ఎస్‌డీఆర్‌లు) 89 మిలియన్ డాలర్లు తగ్గి 18.558 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అలాగే అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత రిజర్వు స్థానం కూడా 21 మిలియన్ డాలర్లు తగ్గి 4.772 బిలియన్ డాలర్లకు

# 500మిలియన్ డాలర్ల విదేశీ నిధుల సేకరణలో ఐసిఐసిఐ

**ముంబయి, జులై 4:** ఐసీఐసీఐ బ్యాంక్ విదేశీ కరెన్సీ బాండ్ల ద్వారా సుమారు 500 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించేందుకు కసరత్తులు చేస్తోంది. ఈ నెల మూడో వారంలో ఏప్రిల్‌జూన్ త్రైమాసిక ఫలితాల ప్రకటన అనంతరం అధికారికంగా నిధుల సమీకరణ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ బాండ్ జారీతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టిన ప్రత్యేక విదేశీ కరెన్సీ స్వాప్ సౌకర్యాన్ని వినియోగించుకునే నాలుగో వాణిజ్య బ్యాంకుగా ఐసీఐసీఐ బ్యాంక్ నిలవనుంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు ఇప్పటికే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని విదేశీ మార్కెట్లలో బాండ్లు జారీ చేశాయి. రిజర్వ్ బ్యాంక్ గత నెల ప్రవేశపెట్టిన ఈ స్వాప్ విండో వల్ల విదేశీ కరెన్సీ బాండ్ జారీలకు హెడ్జింగ్ వ్యయం తగ్గుతోంది. దీంతో బ్యాంకులకు తక్కువ వ్యయంతో డాలర్లలో నిధులు సమీకరించే అవకాశం లభిస్తోంది.

ఐసీఐసీఐ బ్యాంక్ చివరిసారిగా 2017లో 500 మిలియన్ డాలర్ల విలువైన అమెరికన్ డాలర్ బాండ్లను జారీ చేసింది.

దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత మరోసారి అంతర్జాతీయ బాండ్ మార్కెట్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమవుతోంది. భారత బ్యాంకులు వరుసగా విదేశీ మార్కెట్లలో నిధులు సమీకరిస్తుండటంతో అంతర్జాతీయ ఇన్వెస్టర్లు అధిక ప్రీమియంను డిమాండ్ చేస్తున్నారు. గత వారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఐదేళ్ల కాలపరిమితితో 750 మిలియన్ డాలర్ల బాండ్లను అమెరికా ట్రెజరీ దిగుబడిపై 90 బేసిస్ పాయింట్ల స్ప్రెడ్‌తో జారీ చేసింది. అనంతరం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ 300 మిలియన్ డాలర్లను 105 బేసిస్ పాయింట్ల స్ప్రెడ్‌తో సమీకరించగా, యాక్సిస్ బ్యాంక్ 300 మిలియన్ డాలర్లను 110 బేసిస్ పాయింట్ల స్ప్రెడ్‌తో సమీకరించింది.

మరోవైపు ఎస్‌బీఐ కూడా 300 మిలియన్ డాలర్ల ఫ్లోటింగ్ రేట్ నోట్లను విజయవంతంగా జారీ చేసింది. రూపాయి మారకపు విలువకు మద్దతు ఇవ్వడం, విదేశీ మూలధనాన్ని ఆకర్షించడం, అలాగే రుణాల వృద్ధి డిపాజిట్ల కంటే అధికంగా ఉన్న నేపథ్యంలో బ్యాంకుల నిధుల సమీకరణ వ్యయాన్ని తగ్గించడమే ఈ స్వాప్ విండో ప్రధాన ఉద్దేశమని ఆర్బీఐ తెలిపింది. ఈ పథకం ప్రకారం కనీసం మూడు సంవత్సరాల కాలపరిమితి ఉన్న విదేశీ కరెన్సీ రుణాలకు ఆర్బీఐ ఏడాదికి 1.5 శాతం స్థిర స్వాప్ రేటుతో సౌకర్యాన్ని అందిస్తోంది.

# కోటక్ మహీంద్రా బ్యాంక్ రుణాలు డిపాజిట్లలో రెండంకెల వృద్ధి

**ముంబయి, జులై 4:** ప్రైవేట్ రంగంలోని కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో రుణాలు, డిపాజిట్లలో బలమైన వృద్ధిని నమోదు చేసింది. శనివారం విడుదల చేసిన తాత్కాలిక గణాంకాల ప్రకారం, బ్యాంకు నికర అడ్వాన్సులు (రుణాలు) వార్షిక ప్రాతిపదికన 15 శాతం పెరిగి రూ.4.94 లక్షల కోట్లకు చేరాయి. గత త్రైమాసికంతో పోలిస్తే ఇవి 2.7 శాతం పెరిగాయి. బ్యాంకు మొత్తం డిపాజిట్లు కూడా ఏడాది క్రితం నమోదైన రూ.4.92 లక్షల కోట్ల నుంచి 13.6శాతం పెరిగి రూ.5.58 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత త్రైమాసికంలోని రూ.5.38 లక్షల కోట్లతో పోలిస్తే 3.38 శాతం వృద్ధి నమోదైంది. కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్ (కాసా) డిపాజిట్లు కూడా 13 శాతం పెరిగి రూ.2.17 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఇవి రూ.1.92 లక్షల కోట్లుగా ఉండగా, గత త్రైమాసికంతో పోలిస్తే కూడా 2.4 శాతం పెరుగుదల కనిపించింది. సగటు నికర రుణాలు, సగటు కాసా డిపాజిట్లు, సగటు మొత్తం డిపాజిట్లలో కూడా బ్యాంకు వృద్ధిని నమోదు చేసినట్లు వెల్లడించింది.

2025-26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (జనవరి-మార్చి)లో కోటక్ మహీంద్రా బ్యాంక్ ఏకీకృత నికర లాభం 13శాతం పెరిగి రూ.4,027 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.3,552 కోట్లుగా నమోదైంది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 8 శాతం పెరిగి 7వేల 875 కోట్లకు చేరగా, నిర్వహణ లాభం 7 శాతం పెరిగి రూ.5,855 కోట్లుగా నమోదైంది. నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తి కూడా మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏ 1.20 శాతానికి, నికర ఎన్‌పీఏ 0.25 శాతానికి తగ్గింది. ఇవి మార్కెట్ అంచనాల కంటే మెరుగ్గా ఉండటంతో బ్యాంకు పనితీరుపై విశ్వాసం పెరిగింది. 2025-26ఆర్థిక సంవత్సరానికి డివిడెండ్‌ను ప్రకటించిన బ్యాంకు వాటాదారుల ఆమోదం పొందాల్సి ఉంది.

## బ్యాంక్ ఆఫ్ బరోడాపై 63.6 లక్షలు, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌పై 3.10 లక్షలు

# ఆర్బీఐ జరిమానా

**ముంబయి, జులై 4:** నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించినందుకు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడాపై రూ.63.60 లక్షల జరిమానాను విధించినట్లు భారతీయ రిజర్వు బ్యాంకు ప్రకటించింది. రుణదాతల కోసం అమల్లో ఉన్న ఫెయిర్ ప్రాక్టీసెస్ కోడ్‌తో పాటు నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలను పాటించడంలో బ్యాంకు విఫలమైనట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. కేవైసీ మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌పై రూ.3.10 లక్షల జరిమానా కూడా విధించింది.

ఆర్‌బీఐ తెలిపిన వివరాల ప్రకారం, 2025 మార్చి 31 నాటికి బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థిక పరిస్థితిపై నిర్వహించిన చట్టబద్ధ తనిఖీల అనంతరం బ్యాంకుకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. బ్యాంకు ఇచ్చిన వివరణను పరిశీలించిన తర్వాత కొన్ని రుణ ఖాతాల్లో ఒప్పందంలో పేర్కొన్న వడ్డీ రేటుకంటే అధిక వడ్డీని వసూలు చేసినట్లు గుర్తించింది.

కొంతమంది ఖాతాదారుల కేవైసీ వివరాలను నిర్దేశిత గడువులోగా సెంట్రల్ కేవైసీ రికార్డ్స్ రిజిస్ట్రీలో నమోదు చేయడంలో కూడా బ్యాంకు విఫలమైనట్లు ఆర్‌బీఐ పేర్కొంది.

మరోవైపు, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌పై జాతీయ గృహ బ్యాంకు 2025 మార్చి 31 నాటి ఆర్థిక పరిస్థితిని ఆధారంగా చేసుకుని తనిఖీలు నిర్వహించింది. అనంతరం సంస్థకు కూడా షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. సంస్థ తనఖాతాల రిస్క్ వర్గీకరణను కనీసం ఆరు నెలలకు ఒకసారి సమీక్షించే విధానాన్ని అమలుచేయడంలో విఫలమైనందున రూ.3.10 లక్షల జరిమానా విధించినట్లు తెలిపింది. ఈ రెండు సంస్థలపై విధించిన జరిమానాలు కేవలం నియంత్రణ నిబంధనల ఉల్లంఘనలకే సంబంధించిన వని, ఖాతాదారులతో సంస్థలు కుదుర్చుకున్న లావాదేవీలు లేదా ఒప్పందాల చెల్లుబాటుపై ఎలాంటి ప్రభావం ఉండదని ఆర్‌బీఐ స్పష్టం

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణాలు, డిపాజిట్లలో రెండంకెల వృద్ధి

**ముంబయి, జులై 4:** దేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తొలి త్రైమాసికంలో రుణాలు, డిపాజిట్లలో బలమైన వృద్ధిని నమోదు చేసింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన తాత్కాలిక వ్యాపార గణాంకాలను బ్యాంక్ విడుదల చేసింది. బ్యాంక్ మొత్తం స్థూల అడ్వాన్సులు ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే 15.4 శాతం పెరిగి 30 లక్షల 61 వేల కోట్ల రూపాయలకు చేరాయి. ప్రస్తుతం ఇచ్చిన అడ్వాన్సులు అంటే ఇంటర్‌బ్యాంక్ మొత్తం 31 లక్షల 27 వేల కోట్ల రూపాయలకు చేరింది. ఇది వార్షిక ప్రాతిపదికన 12.4 శాతం వృద్ధిని నమోదు చేసింది. డిపాజిట్ల పరంగాకూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బలమైనవృద్ధిని నమోదు చేసింది.

జూన్ చివరి నాటికి మొత్తం డిపాజిట్లు 14.7 శాతం పెరిగి 31 లక్షల 71 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. త్రైమాసిక ప్రాతిపదికన డిపాజిట్లు 2.1 శాతం పెరిగాయి. కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్‌లను కలిపిన కాసా డిపాజిట్లు 9.4 శాతం పెరిగి 10 లక్షల 26వేల కోట్ల రూపాయలకు చేరాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్ల వంటి టైమ్ డిపాజిట్లు వార్షిక ప్రాతిపదికన 17.4శాతం పెరిగి 21 లక్షల 45 వేల కోట్ల రూపాయలకు చేరాయి. గత త్రైమాసికంతో పోలిస్తే ఇవి దాదాపు 5 శాతం వృద్ధి నమోదు చేశాయి. దేశవ్యాప్తంగా బ్యాంకుల రుణాలు 17.7 శాతం పెరగగా డిపాజిట్లు 12 శాతం మాత్రమే పెరిగాయి. దీంతో రుణాల వృద్ధి డిపాజిట్ల వృద్ధికంటే 570 బేసిస్ పాయింట్లు అధికంగా ఉందని ఆర్‌బీఐ వెల్లడించింది.

## తొలి త్రైమాసికంలో

# వేదాంత భారీ వృద్ధి

**ముంబయి, జులై 4:** గనులు, లోహాల రంగ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కీలకవిభాగాల్లో ఉత్పత్తి వృద్ధిని నమోదు చేసింది. జింక్ ఇండియా విభాగంలో ఇప్పటివరకు ఎన్నడూ లేని స్థాయిలో తొలి త్రైమాసిక మైన్డ్ మెటల్ ఉత్పత్తి నమోదవగా, కాపర్, ఫెర్రో క్రోమ్ విభాగాలు కూడా స్థిరమైన వృద్ధిని నమోదు చేసినట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన వివరాల్లో తెలిపింది. జింక్ ఇండియా విభాగంలో మైన్డ్ మెటల్ ఉత్పత్తి 2.68 లక్షల టన్నులకు చేరుకుని గత ఏడాదితో పోలిస్తే 1 శాతం పెరిగింది. అమ్మకానికి వీలున్న లోహ ఉత్పత్తి 4 శాతం పెరిగి 2.60 లక్షల టన్నులకు చేరుకోగా, శుద్ధి చేసిన జింక్ ఉత్పత్తి 6 శాతం వృద్ధిని నమోదు చేసింది. వెండి ఉత్పత్తి మాత్రం 149 టన్నుల వద్ద గత ఏడాది స్థాయిలోనే కొనసాగింది.

చందేరియా, దరిబా ప్లాంట్లలో చేపట్టిన డీబాటిల్‌నెకింగ్ చర్యలతో ఉత్పత్తి సామర్థ్యం పెరగడం వల్ల శుద్ధి చేసిన లోహ ఉత్పత్తి మెరుగుపడిందని కంపెనీ పేర్కొంది. వేదాంతా అనుబంధ సంస్థ ఫాకోర్‌లో ఫెర్రో క్రోమ్ ఉత్పత్తి 4శాతం పెరిగి 29వేల టన్నులకు చేరింది. అదే సమయంలో ఖనిజ ఉత్పత్తి 41 శాతం పెరిగి రికార్డు స్థాయిలో 1.53లక్షల టన్నులకు చేరింది. కాపర్ ఇండియాలో విక్రయాలు3శాతం పెరిగి 53వేల టన్నులకు చేరాయి. గత ఎనిమిదేళ్లలో తొలి త్రైమాసికానికి ఇది అత్యధిక విక్రయాలుగా కంపెనీ పేర్కొంది. అంతర్జాతీయ జింక్ వ్యాపారంలో గామ్స్‌బర్గ్ ఫేజ్1 ఉత్పత్తి గత త్రైమాసికంతో పోలిస్తే 10 శాతం పెరిగిందని, ఫేజ్2 ఉత్పత్తిని ఈ ఏడాది ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. తొలి త్రైమాసికంలో జింక్ ఇండియా చరిత్రలోనే అత్యధిక మైన్డ్ మెటల్ ఉత్పత్తి నమోదు చేయడంతో పాటు, ఫాకోర్ విభాగం కూడా ఇప్పటివరకు ఎన్నడూలేని స్థాయిలో త్రైమాసిక ఖనిజ ఉత్పత్తిని సాధించిందని వేదాంతా

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14